Acc No: 25727

ఉత్తర రామాయణ కథలు

వేమూరి వేంకటేశ్వరశర్మ

ఫోన్ : 530448

డిస్ట్రిబ్యూటర్స్

స్వాతి బుక్ డిస్ట్రిబ్యూటర్స్

23-8-4, ఆదిశేషయ్య వీధి, ఎస్. ఎన్. పురం,

విజయవాడ - 520 011.

ఉత్తర రామాయణ కథలు

వేమూరి వేంకటేశ్వరశర్మ

Publishers :
SRI MAHALAKSHMI BOOK CORPORATION
Musuem Road, Governorpet,
Vijayawada-520 002.
Ph : 433322

First Edition :
August 1992
Second - Aug-1999

Price :
Rs. 30

Cover Design :
Ramana

Printers :
JAYASRI PRESS
Vijayawada-11.

డాక్టర్ ఆచార్య తిరుమల
"ప్రభాస" 11-11-152/1/2
సౌభాగ్యపురం, ఆర్. కె. పురం
హైదరాబాదు-660
ఫోను : 876902.

అద్దంలో అవనీధరం!

భారత, భాగవత, రామాయణాల్లో—రామాయణం ఆదర్శ కావ్యం. మనిషి ఎలా వుండాలో రామాయణం చెబుతుంది: ఎలా వుండకూడదో భారతం చెబుతుంది. పురాణం కాబట్టి భాగవతం హితాన్ని గుప్తంగా ఉప దేశిస్తుంది. ఇవి కేవలం లౌకికమైన చారిత్రక కథా కథనాలు కావు; అలౌకిక తాత్త్విక విద్యుద్వాహకాలు. అందుకే, అవి శాశ్వత సాహిత్య ధర్మ కోశాలయ్యాయి. వాటిని ఆ ధార్మిక లోచనంతో చూడవలసి వుంది. ఆ దృష్టితో అర్థం చేసుకోవలసి వుంది.

శ్రీరాముని జీవిత చరిత్ర—రామాయణం. శ్రీరాముడంటే రూపు దాల్చిన ధర్మం. మాతృ పితృభక్తి, పెద్దల యెడ వినయం, శత్రువుల యెడ శౌర్య ప్రకటనం, దుష్ట నిగ్రహం, శిష్టపాలనం, ప్రజానురాగం, ఏకపత్నీ లోలత్వం, పరాంగనా వైముఖ్యం, సోదర వాత్సల్యం, బుధ సేవనం, ఆశ్రిత పోషణం, శరణాగత త్రాణ పరాయణత్వం, స్నేహితుల యెడ నిర్మల మైత్రి, ఔదార్యం, సదాచార వర్తనం—మొదలైన ఎన్నో, ఎన్నెన్నో సద్గుణాల ఖని-శ్రీరాముడు. అటువంటి ఆదర్శ ప్రాయుడైన

శ్రీరాముని కథని వాల్మీకి మహర్షి రామాయణంగా రచించి అందించాడు. కవితా శాఖని అధిరోహించిన వాల్మీకి కోకిల కూజితానికి ప్రపంచమంతా పరవశించని భారత హృదయం లేదు, ఉండదు.

రామాయణం రెండు భాగాలుగా ఉంది. మొదటిభాగం రామజననం నుండి రామ పట్టాభిషేకం వరకు. దీన్ని పూర్వ రామాయణం అంటారు. రెండో భాగం రామ పట్టాభిషేకోత్సవం నుండి రామ నిర్యాణం వరకు. దీన్ని ఉత్తర రామాయణం అంటారు.

ఈ ఉత్తర రామాయణ కథని సంస్కృతంలో భవభూతి పండితుడు ఉత్తర రామచరితంగా రాశాడు. అనేక రసవత్తరమైన నాటకము. అందులో ఒకచోట :-

ఏకో రసః కరుణ ఏవ నిమిత్త భేదా
భిన్నః పృథగ్ పృథగి వాశ్రయతే వివర్తాః
ఆవర్త బుద్బుద తరంగ మయాన్ వికారాన్
అంభో యథా సలిల మే వహి తత్సమస్తమ్॥

అని కరుణ రసం ఒక్కటే రసమని వక్కాణించాడు. కరుణకు స్థాయిభావం శోకం. ఆది కవి వాల్మీకి శోకమే శ్లోక మయ్యింది. రామాయణ కావ్యమంతటా ఈ కరుణరసం ప్రవహిస్తూనే వుంటుంది. ఉత్తర రామాయణంలో ఈ కరుణ సీతారాముల వియోగంవల్ల, నిర్యాణంవల్ల, పతాక స్థాయిని చేరుకుంది. అందుకే అది ప్రబంధ రాజమయ్యింది.

తెలుగులో "కవిబ్రహ్మ" తిక్కన ఈ కథని వచనం లేకుండా, "నిర్వచనోత్తర రామాయణం" అని కేవలం పద్య కావ్యంగా రాశాడు. తర్వాత కంకంటి పాపరాజు అనే కవి ఉత్తర రామాయణాన్ని చంపూ కావ్యంగా రచించాడు. వీటిలో, తిక్కన రామాయణంలో రామ నిర్యాణం

కథ లేదు, సరిగదా కావ్యం చాలా సంక్షిప్తంగా ఉంటుంది. పాపరాజు కావ్యం సమగ్రంగా ఉంటుంది; సరళ సుందరంగా ఉంటుంది. పాపరాజు తన కావ్య ప్రస్తావనలో ఒకచోట :

"కాసకీ కాని కథల్ రచింపక యుపత్కృథ లెన్ని రచించె నేని యున్ మాని రచేక మేమిటిరా! వాని కవిత్వ మహత్త్వ మేటికిన్" అనటమే కాకుండా "రఘువీరు చారిత్రము లెందరెన్ని గతులన్ వర్ణించినం గ్రాలదే!" అని కూడా అంటాడు. పాపరాజు మాట నిజం. 'కవి' అని అని పించుకునే వాడేవడైనా ఎప్పుడో అప్పుడు శ్రీరాముని స్పృశించకుండా పోడు. ఆ పేరులో, ఆ కథలో అంత శక్తి, అంత ఆకర్షణా ఉన్నాయి.

శ్రీ వేమూరి వెంకటేశ్వరశర్మగారు కవి, పండితులు, విమర్శకులు సంస్కృతాంధ్ర ఆంగ్ల భాషల్లో ఆయనకు గల పాండిత్యం అపారం. ఆయన పఠన, పాఠన శక్తి అద్భుతం. అంతే కాదు, విద్యకు మించిన వినయ శీలి. అందుకే, ఆయన ఆలోచనకి, మాటకి అంత ఆకర్షణ వుంటుంది.

శ్రీ శర్మగారు రచించిన ఈ ఉత్తర రామ కథలు చదివితే పాప రాజు పద్యకావ్యం చదివినంత అనుభూతి కలుగుతుంది.

ఒక మహా విషయాన్ని, ఒక జటిలమైన అంశాన్ని, అతిసామాన్యమైన చదువరికి కూడా అర్థమయ్యే పద్ధతిలో రాయటమంటే-అది అందరు రచయితలకూ చేతనైన విషయం కాదు, శర్మగారి రచనా విధానం వేరు. చాలా గొప్ప కావ్యాల్ని వాడుక భాషలో-చిన్ని చిన్ని వాక్యాల్లో రాసి, చాలా చాలా చిన్న వారిచేత, చిన్నారుల చేత కూడా ఆయన చదివించ గలరు. అదే ఆయన వచన రచనా విశిష్టత! అదే ఈ పుస్తకంయొక్క గొప్పతనం!

ఈ ఉత్తర రామ కథల్లో వీర, కరుణ రసాలు వెల్లి విరుస్తాయి. ఇది చాలా భాగం రావణ చరిత్ర. రావణుడు, అతని వంశం, అతని పుట్టుక, అతని వీర విక్రమాలన్నీ ఈ కథల్లో చోటుచేసుకున్నాయి. అంతటి పరాక్రమశాలి అయిన శ్రీరామునికి ప్రత్యర్థి అయిన రావణుడెంతటివాడో ఈ కథలవల్లనే మనకి తెలుస్తుంది. ఇది వీరరస ప్రధానమైన అంశం. తర్వాత సీతా పరిత్యాగం, సీతా నిష్క్రమణం, కుశలవుల పట్టాభిషేకం, శ్రీరామ నిర్యాణం వంటివి కరుణ రస ప్రధానమైన అంశాలు.

శ్రీ శర్మగారి కథా కథన రీతి చాలా విశిష్టంగా ఉంటుంది. పాపరాజు కావ్యంలోని వర్ణనలు మినహాయించి, కథా భాగాన్ని చాలా బిగువుగా, అందంగా చెప్పారు, శర్మగారు. ఇది ఇప్పటి మాటల్లో చెప్పుకోవాలంటే—హాల్లో మూడు గంటలపాటు సినిమా చూసి వచ్చి, చూడని వాళ్ళకి ఒక గంటలో ఆ సినిమా కథంతా చెప్పినట్టుగా ఉంటుంది. అలా కళ్ళకి కట్టినట్టుగా చెప్పటం మాటలా? ఏ వెంకటేశ్వరశర్మగారి లాంటి వారికో తప్ప! ఆయన, అద్దంలో అవనీధరాన్ని చూపించారు. అదే ఆయన ఘనత!

పాపరాజు తన ఉత్తర రామాయణానికి ఫల శ్రుతి చెపుతూ—

ఈ మహాకావ్య మతిభక్తి నెవ్వడు విను
నతడిహంబున సకల సౌఖ్యముల నంది
తనివి గని యంతఃబున రాగమన విరహిత
శాశ్వత బ్రహ్మలోక నివాస మొందు !!

అన్నాడు. విషయం ఒకటే కాబట్టి శ్రీ శర్మగారు రాసిన ఈ కథల ఫలశ్రుతీ అదే అవుతుంది. చదివి, తరించండి. మిత్రులు శర్మగారిని హృదయపూర్వకంగా అభినందిస్తూ—

4–7–1992

—ఆచార్య తిరుమల

ఈ మాటా వినండి

సార్వకాలికమైన నీతికీ, ధర్మానికీ, సత్యానికీ ప్రతీక రాముడు. ఆయన తత్త్వమే రామతత్త్వం. అదే రామాయణం.

నిత్య సత్యాన్ని ప్రబోధించే రామాయణాన్ని చదవని వాళ్ళూ, వినని వాళ్ళూ ఉండరు. అయితే ఎక్కువ మందికి రామ పట్టాభిషేకందాకానే రామాయణ కథ తెలుసు. ఆ తర్వాత కథా వివరాలు తెలియవు. ఇదే విషయాన్ని గురించి నన్ను చాలా మంది ప్రశ్నించినప్పుడు ఉత్తర రామాయణ కథామృతాన్ని పదిమందికీ అందించాలనే సంకల్పం కలిగింది. రామాయణాన్ని అనువాదం చేసిన వాళ్ళందరూ ఉత్తర రామాయణం జోలికి పోలేదు. కారణం ఊహాతీతం. బహుశా అది విషాదాంతం అనేమో! అయినప్పటికీ ఉత్తర రామాయణానికి పద్యానువాదాలూ, గద్యానువాదాలూ కొన్ని లేకపోలేదు. కానీ వాటిని చదివే ఓపికా, తీరికగానీ ఈ ఆధునిక కాలంలో అందరికీ లేకపోవచ్చు. అందువల్ల సరళమూ, పండిత పామర రంజకమూ అయిన భాషతో ఉత్తర రామాయణాన్ని కథలుగా రూపొందించడం జరిగింది.

ఈ కథలకు ఆధారం వాల్మీకి రామాయణం—ఉత్తరకాండ. దానితోపాటు తిక్కనగారి నిర్వచనోత్తర

రామాయణమూ, కంకంటి పాపరాజుగారి ఉత్తర రామా యణమూ పరిశీలించాను. ఆ కవిలోక మూర్ధన్యులకు శత సహస్ర ప్రణామాలు.

ఓపికతో ఈ పుస్తకాన్ని చదివి పరిచయ వాక్యాలు- అద్దంలో అవనీధరం - రాసి యిచ్చిన 'కవి కౌస్తుభ' డా॥ ఆచార్య తిరుమల గారికి కృతజ్ఞతా పూర్వక నమో వాకాలు.

ఈ కథల్ని పుస్తక రూపంలో వెలువరిస్తున్న శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్ వారికి ప్రశంసా పూర్వక అభినందనలు.

సికిందరాబాదు - రచయిత

5–7–1992

27-1-6/6 కృపా కాంప్లెక్స్
నేరేడుమెట్టు
సికింద్రాబాద్-500056

ఉత్తర రామాయణ కథలు

కుబేరుడు

పూర్వం కృతయుగంలో బ్రహ్మపుత్రుడయిన పులస్త్యుడు ఉండేవాడు. ఆయన బ్రహ్మర్షి. ఉత్తమ గుణసంపన్నుడు. ధర్మశీలుడు. మేరు పర్వత ప్రాంతాన వున్న తృణబిందుని ఆశ్రమంలో నివసిస్తూ, వేదాధ్యయనం చేస్తూ, ఇంద్రియాల్ని నిగ్రహించి తపస్సు చేసుకునేవాడు.

అందమైన ప్రకృతి సంపదతో ఆహ్లాదాన్ని కలిగించే ఆ ప్రదేశములో విహారం కోసం దేవకన్యలూ, ఋషి కన్యలూ, రాజర్షి కన్యలూ, తదితరులూ వచ్చి క్రీడా విలాసాల్లో మునిగి తేలేవారు. అందువల్ల పులస్త్యుడి తపోదీక్షకి తరచుగా భంగం కలిగేది. దీనికి మహర్షి చికాకుపడి "ఇక ముందు ఇక్కడికి రావద్దు. ఒకవేళ ఎవరయినా వచ్చి నన్ను చూశారంటే వాళ్ళకి వెంటనే గర్భం వస్తుంది." అని ఒక కట్టడి చేశాడు. అప్పటినుంచీ అక్కడికి వెళ్ళటం మానుకున్నారు అందరూ.

కాని విధివశాత్తూ ఈ కట్టడి సంగతి తెలియని తృణబిందుని కూతురు ఒక రోజు ఆశ్రమంలోకి ప్రవేశించి పులస్త్యుడు చేసే యింపైన వేదపఠనం వింటూ అయన్ని చూసింది. వెంటనే గర్భం దాల్చింది. ఆశ్చర్యంతో, భయంతో, ఆందోళన చెందుతూ ఆమె తన యింటికి వెళ్ళింది. తండ్రి ముందు తలవాల్చి నిలబడింది.

రాజర్షి అయిన తృణబిందువు ఇదంతా దివ్యదృష్టితో గ్రహించి కూతుర్ని పులస్త్యుడి దగ్గరకు తీసుకెళ్ళి ఆమెను స్వీకరించవలసిందిగా ప్రార్థించారు. ఆయన అంగీకరించాడు. కొంతకాలం తర్వాత ఆమె విశ్రవసుడనే కుమారుణ్ని ప్రసవించింది.

విశ్రవసుడు దినదిన ప్రవర్థమానుడై, ధర్మపరుడై, తపస్సంపన్నుడై విరాజిల్లి తండ్రికి తగ్గ కొడుకు అనిపించుకున్నాడు. భరద్వాజ మహర్షి కూతురయిన దేవవర్ణిని వివాహం చేసుకున్నాడు. ఈ పుణ్య దంపతులకు జన్మించిన కొడుకే వైశ్రవణుడు. ఇతనే కుబేరుడు.

వైశ్రవణుడు బ్రహ్మను గురించి వెయ్యి సంవత్సరాలు తపస్సు చేశాడు. బ్రహ్మ సంతోషించి అతనికి ప్రత్యక్షమై ఏం కావాలో కోరుకొమ్మన్నాడు. దిక్పతిత్వాన్ని, ధనాధిపత్యాన్ని ప్రసాదించమని కోరుకున్నాడు వైశ్రవణుడు. బ్రహ్మదేవుడు "తథాస్తు" అన్నాడు.

అంతే కాకుండా దివ్యమణులతో ప్రకాశించే పుష్పక విమానాన్ని కూడా బహూకరించాడు.

వరాల్ని పొందిన వైశ్రవణుడు తండ్రి దగ్గరికి వెళ్ళి జరిగినదంతా విన్నవించి, తనకు తగినట్లుగా ఒక నివాసం ఏదయినా సెలవియ్యమని ప్రార్థించాడు.

"నాయనా! విశ్వకర్మచేత త్రికూట పర్వతంమీద నిర్మింపబడి, అందాలు చిందించే లంకా పట్టణం నీ నివాసానికి యోగ్యమయింది. ఈ పట్టణంలో పూర్వం మాల్యవంతుడు మొదలయిన రాక్షసులు ఉండేవాళ్ళు. దేవతలతో యుద్ధంచేసి శ్రీ మహావిష్ణువుకు భయపడి పాతాళానికి పారి

పోయారు. కాబట్టి నువ్వు అక్కడికి వెళ్ళి సుఖంగా వుండు" అని ఆన తిచ్చాడు విశ్రవసుడు.

అప్పటినుంచీ వైశ్రవణుడు లంకాధిపతి అయి ధర్మపాలన చేస్తూ అందరి ప్రశంసలూ అందుకున్నాడు.

చాలాకాలం తర్వాత పాతాళవాసి అయిన సుమాలి భూలోకానికి వచ్చి, లంకా నగరాన్ని ఆక్రమించుకోవలసిందిగా తన మనవడైన రావణా సురుణ్ని ప్రోత్సహించాడు. ఈ విషయం కుబేరునికి చెప్పేందుకు ప్రహ స్తుడనే మంత్రిని దూతగా పంపించాడు రావణుడు. కుబేరుడు తన తండ్రి అయిన విశ్రవసుడికి ఈ సంగతి విన్నవించాడు.

"రావణునితో విరోధం పెట్టుకోకుండా లంకా నగరాన్ని అతని కిచ్చేసి, కైలాస పర్వత ప్రాంతంలో మంచి సుందర నగరాన్ని నిర్మించు కుని నిశ్చింతగా ఉండు" అని కొడుక్కి సలహా యిచ్చాడు విశ్రవసుడు. తండ్రి చేసిన సూచన ప్రకారం అలకాపురంలో నివాసం ఏర్పరచుకున్నాడు కుబేరుడు.

లంకాధిపతి అయిన రావణుడు దేవతల్ని, మునుల్ని, నానా రకా లుగా బాధించడం మొదలుపెట్టాడు. యజ్ఞాలకు విఘ్నాలు కలిగిస్తున్నాడు. ఈ దుష్టకృత్యాలన్నీ చూసి సహించలేక తమ్ముడికి హితబోధలు చేస్తూ ఒక దూతను పంపాడు కుబేరుడు. రావణుడు దీనికి మండిపడి, దూతను చంపి, ధనపతిమీద యుద్ధం ప్రకటించాడు. ఆ భయంకర యుద్ధంలో బ్రహ్మ వర ప్రభావంతో మత్తెక్కిన రావణునిదే పైచెయ్యి అయింది. కుబే రుడు ఓడిపోయాడు. అతని పుష్పక విమానాన్ని రావణుడు వశం చేసు కున్నాడు.

⊙

రాక్షస వీరుల జననం-1

పూర్వం రాక్షస వంశంలో హేతి, ప్రహేతి అనే యిద్దరు జన్మించారు. వారిలో ప్రహేతి ధర్మరతుడై తపస్సు చేసుకోవడానికి వెళ్ళిపోయాడు. హేతి యముడి చెల్లెలైన "భయ"ను వివాహం చేసుకున్నాడు. వాళ్ళకి "విద్యుత్కేశుడు" అనే కొడుకు పుట్టాడు. అతను "సాలకటంకట" అనే స్త్రీని పెళ్ళి చేసుకున్నాడు. ఆమె కొంతకాలానికి గర్భవతియై భర్తతో అనుభవించాల్సిన సుఖాలకి అంతరాయం ఏర్పడిందని చిక్కులి పడాలించింది. నెలలు నిండిన తర్వాత మందర పర్వత ప్రాంతానికి వెళ్ళి ఒక కొడుకుని ప్రసవించి దయలేకుండా వాణ్ని అక్కడే వదిలేసి యింటికి తిరిగివచ్చి భర్తతో అనేక మన్మథ సుఖాలు అనుభవించింది.

తల్లిచేత తిరస్కృతుడైన ఆ పసికందు ఏడ్వడం మొదలుపెట్టాడు. ఆ సమయంలో ఆకాశమార్గంలో వెడుతున్న పార్వతీ పరమేశ్వరులు ఆ బాలుణ్ని చూసి జాలితో చలించిపోయారు. దగ్గరకు తీసుకుని ముద్దాడి లాలించారు. చక్కని కేశసంపద కలిగిన ఆ బాలుడికి "సుకేశుడు" అని పరమశివుడు నామకరణం చేశాడు. అంతేకాదు. ఆ బాలుణ్ని తండ్రితో (విద్యుత్కేశునితో) సమానమైన వయస్సు కలవాడినిగా చేశాడు. ఆకాశగమనంగల పట్టణాన్ని, ఎక్కడికి పోవాలనుకున్నా పోయే విమానాన్ని ప్రసాదించాడు.

ఈశ్వరుని వర ప్రసాద బలంచేత దివ్య తేజస్సుతో వెలుగొందుతున్న సుకేశుడు స్వేచ్ఛగా ఆకాశంలో సంచరిస్తూ, ధర్మతత్పరుడై, నియమం తప్పకుండా ఈశ్వరుణ్ని ఆరాధిస్తూ ఆయన కృపకు పాత్రుడైనాడు.

సుకేశుడు "దేవవతి" అనే గంధర్వ కన్యను వివాహమాడి మాల్యవంతుడు, సుమాలి, మాలి అనే ముగ్గురు కొడుకుల్ని కన్నాడు. వాళ్ళు గొప్ప తపస్సుచేసి బ్రహ్మదేవుణ్ని మెప్పించి ఎవ్వరితోను యుద్ధంలో

ఓటమి లేకుండాను, అన్నదమ్ములు ముగ్గురూ అన్యోన్యంగాను, ప్రేమాను రాగాలతో ఉండేటట్లుగాను, చిరాయువు కలిగేటట్లుగాను వరాలు పొంది తపో ధీకరుడైనాడు.

తర్వాత వీరి కోరిక ప్రకారం విశ్వకర్మ సుందరమైన లంకా నగరాన్ని త్రికూట పర్వతంమీద నిర్మించి యిచ్చాడు. ఆ పట్టణంలో అన్నదమ్ములు ముగ్గురూ సుందరి, కేతుమతి, వరద అనే గంధర్వ కన్యల్ని పెళ్ళి చేసుకుని సుఖసంపదలతో తులతూగుతున్నారు.

కాని బ్రహ్మదేవుడిచ్చిన వరాల ప్రభావంవల్ల వాళ్ళు మదాంధులై క్రూరకర్ములై దేవతల్ని, మునుల్ని నానా బాధలకు గురి చేశారు. యజ్ఞాలను ధ్వంసం చేశారు. ధర్మాన్ని పీడించారు. ఈ బాధలు పడలేక దేవ ముని గణాలు ఈశ్వరునితో తమ బాధలు చెప్పుకుని రక్షించమని వేడుకున్నారు.

దానికి శివుడు-"సుకేశుడు నాకు కొడుకు లాంటివాడు. కాబట్టి అతని కొడుకులైన వీళ్ళని నేనేమీ చెయ్యలేను. మీరు వెళ్ళి విష్ణువును ప్రార్థించండి. తప్పకుండా ఆయన మీ కోరికలు తీరుస్తాడు." అని సెలవిచ్చాడు.

"ఆ ప్రకారం వాళ్ళు విష్ణువును దర్శించి తమ కష్టాల్ని చెప్పుకున్నారు. ఆ రాక్షసుల శౌర్యపరాక్రమాలు, బ్రహ్మదేవుని వరప్రభావం అంతా నాకు తెలుసు. మీరు నిశ్చింతగా ఉండండి" అని దయామయుడైన విష్ణువు అభయమిచ్చి వాళ్ళందర్నీ పంపేశాడు.

ఈ విషయమంతా విన్న మాల్యవంతుడు కుపితుడై, సోదరుల్ని పిలిచి జరిగిన సంగతి వివరించాడు. తమ్ముళ్ళిద్దరూ "దీనికంతా కారణం ఆ దేవతలు. కాబట్టి మనం వెంటనే అమరావతిపై దండయాత్ర సాగించాలి" అన్నారు. సరేనన్నాడు మాల్యవంతుడు.

దేవదానవుల మధ్య భీషణ సమరం జరిగింది. విష్ణువు దేవతల అండగా వుండి శత్రువుల్ని చీల్చి చెండాడి పాంచజన్యాన్ని పూరించాడు.

రక్కసుల గుండెలు అవిసిపోయాయి. మాలి కోపంతో విష్ణువుకు ఎదు ర్కొన్నాడు. వెంటనే శ్రీహరి చక్రం ప్రయోగించి వాడి శిరస్సును ఖండించాడు. సుమాలి, మాల్యవంతుడుకూడా విష్ణువును ఎదిరించి అత్యంతమైన శౌర్యపరాక్రమాలు ప్రదర్శించారు. కాని హరిముందు ఎవరి శక్తి నిలుస్తుంది? ఆయన ధాటికి తట్టుకోలేక వాళ్ళు తమ బలగంతో లంకకు పారిపోయారు. యీ విధంగా చాలాసార్లు దేవతలమధ్య దానవుల మధ్య యుద్ధాలు జరిగాయి. విష్ణువుకు భయపడి చివరికి రాక్షసులందరూ లంకను విడిచి పాతాళానికి పారిపోయి అక్కడే నివాసం ఏర్పాటు చేసుకున్నారు.

రాక్షస వీరుల జననం—2

పాతాళంలో నివసిస్తున్న సుమాలి ఒకనాడు అతిలోక లావణ్య విలాసిని, యౌవన విలాస భాసిని అయిన తన కూతురు కైకసిని పిలిచి- "భూలోకంలో కుబేరుడు మహావైభవంతో వెలిగిపోతున్నాడు. అటువంటి కొడుకులు నీకు కలగాలి. కాబట్టి నువ్వు వెళ్ళి విశ్రవసుణ్ని వరించు" అని చెప్పి పంపించాడు

ఆమె సంధ్యాసమయంలో ముని ఆశ్రమానికి వచ్చి, మునికి నమస్కరించి ఎదురుగా నిలబడింది. ఆమె కోరికను గ్రహించిన విశ్రవసుడు "నీ వాంఛితం నెరవేరుస్తాను. కాని నువ్వు చాలా దారుణమైన సమయంలో వచ్చావు. అందువల్ల నీకు దారుణాకారులు, క్రూరులు, దుర్మార్గులు అయిన రాక్షసులు పుడతారు" అని చెప్పాడు.

యీ మాటలు విన్న కైకసి పరిపరి విధాల విచారించి [illegible]త్వంతా నాన్న! అనుగ్రహించవలసిందిగా ప్రార్థించుచుండగా "నీకు పుట్టబోయే చివరి కొడుకు మాత్రం [illegible] తప్పదు. [illegible] నన్ను

వివేక శీలుడై మన యిద్దరి వంశాన్ని పవిత్రం చేస్తాడు" అని చెప్పి ఓదార్చాడు బ్రహ్మర్షి.

కొంత కాలానికి పదితలలు, ఇరవై చేతులు, నల్లని పెద్ద శరీరం, ఎర్రని కన్నులు, పెద్ద పెద్ద కోరలు కలిగి వున్న కుమారుణ్ని కన్నది కైకసి. పది శిరస్సులున్నవాడు కాబట్టి ఈ బాలుణ్ణి "దశగ్రీవుడు" అన్నారు.

ఇతడు పుట్టగానే నెత్తురు వర్షం కురిసింది. మేఘాలు గర్జించాయి. ఉల్కలు కిందపడ్డాయి. భూమి కంపించింది. పెద్దగా గాడ్పులు వీచాయి. నక్కలు అరిచాయి. సముద్రం అల్లకల్లోలమైంది. సూర్యుడు కాంతిహీనుడైనాడు.

దశగ్రీవుని తర్వాత దీర్ఘకాయుడు, మహా బలుడు అయిన కుంభకర్ణుడు జన్మించాడు. ఆ తర్వాత వికారమైన ముఖముతో పుట్టింది శూర్పణఖ. అనంతరం సాధుమూర్తి, ధర్మకర్మాపేక్షుడు అయిన విభీషణుడు ప్రభవించాడు. ఇతను పుట్టగానే పూలవాన కురిసింది. వీళ్ళందరూ మహారణ్యంలో సంచరిస్తూ దినదిన ప్రవర్ధమానులైనారు.

ఒకనాడు కుబేరుడు తన విమానంలో తండ్రి అయిన విశ్రవసుని చూడడానికి వచ్చినపుడు, కైకసి అతని భోగభాగ్యాలు చూసి అసూయపడి, పెద్ద కొడుకుతో "నాయనా! కుబేరుడు చూడు ఎలా వున్నాడో! నువ్వు కూడా ఇతనిలాగా సర్వ సంపదలతో తులతూగేటట్లు ఉండడానికి ప్రయత్నించాలి" అని చెప్పింది.

దానికి సమాధానమిస్తూ- "చూడమ్మా! నేను తప్పకుండా ఇతనితో సరితూగే వైభవం సంపాదిస్తాను. విచారించవద్దు" అని తల్లికి మాట యిచ్చాడు.

వెంటనే తమ్ముళ్ళతో బయలుదేరి గోకర్ణక్షేత్రం చేరుకున్నాడు. పది వేల సంవత్సరాలు కఠోరమయిన నియమాలు పాటిస్తూ, పరమేష్ఠిని గూర్చి అన్నదమ్ములు ముగ్గురూ గొప్ప తపస్సు చేశారు.

రావణుడు తొమ్మిదివేల సంవత్సరాలు తపస్సుచేసి తొమ్మిది శిరస్సులు అగ్నికి అర్పించాడు. మరో వెయ్యి సంవత్సరాల తపస్సు పూర్తి అవగానే తన పదో శిరస్సును కూడా అగ్నికి ఆహుతి చెయ్య దానికి ఉద్యుక్తుడు కాగా బ్రహ్మదేవుడు ప్రసన్నుడై వరం కోరు కొమ్మన్నాడు.

"దేవా! నాకు ఎవ్వరితోను చావు లేకుండా వరం అనుగ్రహించు" అని ప్రార్థించాడు రావణుడు.

"మృత్యువు లేకుండా వుండడమనేది సాధ్యంకాని పని. కాబట్టి వేరే వరం కోరుకో" అన్నాడు బ్రహ్మ.

"అయితే నాకు దేవ 'గంధర్వ' కిన్నెర కింపురుష 'దైత్య' రాక్షసాదులతో చావు లేకుండా వరం ప్రసాదించు. గడ్డి పరకలతో సమానమైన మానవులంటే నా కసలు భయమేలేదు". అన్నాడు రావణుడు.

బ్రహ్మ ఆ వరం ఇచ్చి అగ్నికి అర్పించబడిన తొమ్మిది శిరస్సులూ మొలిచేటట్లు చేశాడు. తాను కోరుకున్న రూపం కలిగేటట్లు రావణుడికి యింకో వరం కూడా యిచ్చాడు.

బ్రహ్మదేవుడు విభీషణుని కోరిక ప్రకారం అభ్యసించకుండానే బ్రహ్మాస్త్ర సిద్ధి కలిగేటట్లు వరమిచ్చి, ధర్మపరతంత్రమయిన బుద్ధిని ప్రసాదించి, అమరత్వాన్ని కూడా యిచ్చాడు.

భక్తుల పాలిట కామధేనువైన పితామహుడు వరాలివ్వడానికి కుంభకర్ణుణ్ణి సమీపించగానే పక్కనేవున్న దేవతలు ఆయన కిలా విన్నవించారు.

"దేవా! ఇతడు చాలా క్రూరుడు. అనేక దుష్కార్యాలుచేసి ఎంతో మందిని బాధించాడు. చాలామందిని సంహరించాడు. ఏడుగురు అప్సరసల్ని, పదిమంది ఇంద్రుని అనుచరుల్ని భక్షించాడు. ఏ వరం లేకుండానే ఇంతటి క్రూరుడైనాడు. దీనికితోడు వరాలు కూడా లభిస్తే ఇతను చేసే పనులకు పట్టపగ్గాలుండవు. కాబట్టి యితణ్ణి మాయా మోహితుణ్ణి చెయ్యి."

దేవతల ఆవేదన గ్రహించిన బ్రహ్మ సరస్వతిని పిలిచి, కుంభ కర్ణుడి నోట్లో ప్రవేశించి సంవత్సరాల తరబడి నిద్ర కావాలని కోరుకునే టట్లు చెయ్యమన్నాడు. ఆ విధంగానే వరం కోరుకున్నాడు కుంభకర్ణుడు. "తథాస్తు" అన్నాడు బ్రహ్మ.

వర ప్రదానానంతరం దేవతలు తమ లోకానికి వెళ్ళిపోయారు.

సరస్వతి రాక్షసుని నోటినుంచి బయటికి వచ్చేసరికి తాను చేసిన తప్పు తెలుసుకున్నాడు కుంభకర్ణుడు. కాని చేసేదేముంది?

వరాలు గ్రహించిన ముగ్గురు అన్నదమ్ములూ తమ తండ్రి ఉన్న శ్లేషాత్మక వనానికి తిరిగి వెళ్ళిపోయారు.

రావణ విహారం 1

తన మనవళ్ళైన రావణ కుంభకర్ణ విభీషణులు బ్రహ్మచేత వరాలు పొందినట్లు తెలిసి సంతోషించాడు పాతాళవాసి అయిన సుమాలి. వాళ్ళని చూడ్డానికి ఒక మాటు భూలోకానికి వచ్చి రావణునితో-"రావణా! పూర్వం లంకా నగరంలో మేము నివసించే వాళ్ళం. కాని విష్ణువుకు భయపడి పాతాళానికి పారిపోవాల్సి వచ్చింది. ఇప్పుడక్కడ కుబేరుడు నివసిస్తు న్నాడు. కాబట్టి నువ్వు సామదాన భేద దండోపాయాల చేత అతణ్ణి వెళ్ళ గొట్టి లంకా పట్టణాన్ని ఆక్రమించుకో. ఇక నుంచీ నువ్వే రాక్షసు లంద రికీ రాజువి. మేమందరం నీకు లోబడి వుంటాం" అన్నాడు.

కానీ రావణుడు దీనికి ఒప్పుకోలేదు.

"కుబేరుడు నా అన్న. అతణ్ణి లంకనుంచి వెళ్ళిపొమ్మని చెప్పడం భావ్యం కాదు" అన్నాడు.

ప్రస్తుతానికి లాభంలేదనుకుని సుమాలి పాతాళానికి వెళ్ళిపోయాడు.

కొంతకాలానికి సుమాలి మంత్రి ప్రహస్తుడు వచ్చి "రావణా!

రాజ్యకాంక్షా పరులైన వాళ్ళకి బంధుప్రీతి ముఖ్యమైనది కాకూడదు. లంకా రాజ్యం రాక్షసులకే దక్కాలి. నువ్వు ఊరుకుంటే లాభంలేదు..." అని హితబోధలు చేసి ఒప్పించాడు.

వెంటనే రావణుడు ప్రహస్తుణ్ణి తన దూతగా కుబేరుని దగ్గరకు పంపి లంకా నగరాన్ని విడిచి పొమ్మని చెప్పించాడు. కుబేరుడు యీ విషయాన్ని తన తండ్రి విశ్రవసుడికి విన్నవించాడు.

రావణునితో విరోధం మంచిది కాదనీ, లంకా పట్టణాన్ని అతని కిచ్చేసి కైలాస పర్వత ప్రాంతంలో ఒక సుందరమైన నగరాన్ని నిర్మించుకుని సుఖంగా ఉండమనీ ఆయన సలహా ఇచ్చాడు. ఆ విధంగానే కుబేరుడు లంకను విడిచిపెట్టి అలకాపురాన్ని కట్టించుకుని అందులో సుఖంగా ఉన్నాడు.

రావణుడు బంధుమిత్ర సమేతంగా లంకా ప్రవేశంచేసి తన శౌర్య ప్రతాపాలతో, అతులిత వైభవంతో రాజ్యం చేయసాగాడు.

కొంత కాలానికి యౌవనవతి అయిన తన చెల్లెలు శూర్పణఖను కాలకేయ వంశంలో జన్మించి, మహాపరాక్రమంతో విలసిల్లే విద్యుజ్జిహ్వుడు అనే వాడి కిచ్చి పెళ్ళిచేశాడు.

మయుడి కూతురయిన మండోదరిని తాను పెళ్ళి చేసుకున్నాడు. యీ సందర్భంగా మయుడు శక్తి అనే ఆయుధాన్ని అల్లుడి కిచ్చాడు.

వజ్రజ్వాల అనే అమ్మాయిని కుంభకర్ణుడూ, సరమ అనే గంధర్వ వనితను విభీషణుడూ ఉద్వాహమైనారు.

అన్నదమ్ములు ముగ్గురూ భార్యలతో హాయిగా కాలం గడుపుతుండగా మండోదరి శౌర్యవంతుడైన ఒక కొడుకుని కన్నది. పుడుతూనే అతడు మేఘంలాగా గర్జించాడు. అందువల్ల అతనికి మేఘనాదుడనే పేరు పెట్టారు. ఇతడే తర్వాత ఇంద్రుణ్ణి ఓడించి 'ఇంద్రజిత్తు' అనే పేరుతో ప్రఖ్యాతి వహించాడు.

తన బలం, శక్తి సామర్థ్యాలు చూసుకుని రావణుడు హింసా కార్యక్రమాల్లో మునిగిపోయాడు. మునుల్ని, దేవతల్ని, ఇతర దేవ

జాతుల్ని నానా బాధలకు గురిచేశాడు. యీ క్రూరకృత్యాల్ని విన్న కుబేరుడు ఒక దూతను పిలిచి తమ్ముడి వద్దకు పంపి సక్రమ మార్గంలో ప్రవర్తించవలసిందిగా హితోక్తులు చెప్పించాడు. ఆ పలుకులన్నీ రావణుడికి ములుకులుగా తోచాయి. అతడు మండిపడ్డాడు. చురకత్తితీసి దూతను నరికి కుబేరునిమీద దండయాత్ర చేశాడు.

యక్షరాక్షసుల మధ్య భయంకరమైన యుద్ధం ప్రజ్వరిల్లింది. రావణుడు తన మాయాప్రభావంతో అనేక రూపాలుగా కనిపిస్తూ కుబేరుణ్ణి ముప్పుతిప్పలుపెట్టి గదతో అతని తల పగిలేటట్లు కొట్టాడు. కుబేరుడు ఓడిపోయాడు. అతని పుష్పక విమానాన్ని తన వశం చేసుకుని పట్టరాని ఆనందంతో గగన విహారం చేశాడు రావణుడు.

ఆ విమానం కైలాస పర్వతంపైన ఆకాశ మార్గంలో వెడుతూ వెడుతూ అకస్మికంగా ఆగిపోయింది. ఆశ్చర్యచకితుడైనాడు రావణుడు.

అక్కడికి నందీశ్వరుడు వచ్చి "ఈ కొండమీద పార్వతీ పరమేశ్వరులు వినోద క్రీడల్లో ఉన్నారు. కాబట్టి వెనక్కి తిరిగి వెళ్ళిపో" అని హెచ్చరించాడు.

"ఎవడురా నీవుడు?" అంటూ విమానం దిగివచ్చి నందిని దుర్భాషలాడి, కోతి ముఖం కలవాడని ఎగతాళి చేశాడు.

అప్పుడు నంది కుపితుడై "ఒరే! నావంటి రూప బల తేజోవిరాజమానులైన వానరులే నిన్ను, నీ వంశాన్ని సర్వనాశనం చేస్తారు" అని శపించాడు.

రావణుడు నందీశ్వరుని శాపాన్ని లెక్కచెయ్యకుండా "నా విమానం ఆగిపోవడానికి కారణం ఈ పర్వతం. కాబట్టి దీన్ని పెకలించివేస్తాను" అంటూ కొండని కుదిపేశాడు.

ఆ కుదుపుతో భూతగణాలు బెదిరిపడ్డాయి. పార్వతి భయంతో భర్తను కౌగిలించుకుంది. పరిస్థితిని గమనించిన శంకరుడు తన కాలి బొటనవేలితో పర్వతాన్ని కిందకు నొక్కాడు. రాక్షసుని చేతులు కొండ కింద ఇరుక్కుపోయాయి. బాధతో పెద్దపెట్టున ఒక రావం అతని

నోట్లోంచి వెడలింది. ఈ రావానికి ముల్లోకాలూ భయపడ్డాయి. అందు వల్లనే అతనికి రావణ నామధేయం వచ్చింది.

చేసేది లేక మంత్రుల సలహా ప్రకారం దశకంఠుడు శంకరుణ్ని స్తోత్రం చేశాడు. భోళాశంకరుడు సంతోషించి భక్తుణ్ని అనుగ్రహించాడు. రావణుని కోరిక ప్రకారం అతనికి చంద్రహాసమనే కత్తిని ప్రసాదించాడు. సంతోషంతో లంకకు చేరుకున్నాడు రాక్షసేశ్వరుడు.

రావణ విహారం-2

ఒకప్పుడు రావణుడు 'ఉశీరబీజం' అనే దేశంలో యజ్ఞం చేస్తున్న మరుత్తుడనే రాజు దగ్గరికి వచ్చాడు. అతడు వచ్చి రాగానే, యజ్ఞానికి విచ్చేసిన ఇంద్ర యమ కుబేర వరుణులు అతన్ని జయించటం సాధ్యం కాదని తెలియడంవల్ల, తమ నిజరూపాలు వదిలిపెట్టి నెమలిగాను, కాకిగాను, తొండగాను, హంసగాను మారి పారిపోయారు.

రాజును సమీపించి "నాతో యుద్ధం చేస్తావా? లేక ఓడిపోయానని ఒప్పుకుంటావా?" అని నిలదీసిఅడిగాడు వరబల గర్వోద్ధతుడైన రావణుడు.

"నువ్వెవరు?" అన్నాడు రాజు.

"నేనెవరినో నీకు తెలీదా? నా అంతటివాడిని ఎవరని అడుగుతావా? నేనే దశకంఠుణ్ని..నా అన్న కుబేరుణ్ని ఓడించి అతని పుష్పకాన్ని దక్కించుకున్నాను" సగర్వంగా సమాధాన మిచ్చాడు రావణుడు.

రాజు యుద్ధానికి సిద్ధమయ్యాడు. కాని యుద్ధంలో పాల్గొంటే యజ్ఞం పూర్తికాదనీ, దానివల్ల కీడు వాటిల్లుతుందనీ, కాబట్టి యుద్ధం ఈ సమయంలో కూడదనీ సలహా ఇచ్చాడు యజ్ఞం చేయిస్తున్న సంవర్తుడనే ఋషి. దాంతో యుద్ధ సన్నాహాలు విరమించాడు రాజు.

"నేనే జయించాను" అని పెద్దగా అరుస్తూ అక్కడికి వచ్చిన

ఋషుల్ని చంపి, వాళ్ళ రక్తం తృప్తిగా తాగి వెళ్ళిపోయాడు రావణాసురుడు.

రావణ నిష్క్రమణం తర్వాత దేవతలు తమ తమ నిజరూపాలతో తిరిగి వచ్చారు.

ఇంద్రుడు నల్లగావున్న నెమలిని చూసి "ఇకనుంచీ మీ పింఛాలు రంగు రంగుల కళ్ళతో అందంగా మెరుస్తూ వుంటాయి. మీకు పాముల భయం వుండదు" అని వరమిచ్చాడు.

యముడు కాకినిచూసి "మీ జాతికి ఇకనుంచీ రోగభయం వుండదు. నరులు చంపనంతకాలం మీరు బ్రతికి వుంటారు. మీరు యిక్కడ తినే పిండాలవల్ల యమలోకంలో ఉన్న పితృదేవతలు తృప్తిపడతారు" అని వరం అనుగ్రహిస్తాడు. ACC NO . 25725

నలుపు, తెలుపు, లేత ఆకుపచ్చ రంగులు గల హంసనుచూసి "ఇప్పటినుంచీ మీరు స్వచ్ఛమైన తెల్లని వర్ణంతో ప్రకాశిస్తూ వుంటారు" అని వరుణుడు వరం ఇచ్చాడు. 2014-5-12 VEN

"ఇకమీదట మీ శరీరాలు బంగారు ఛాయలో వుంటాయి. మీ తలల్లో బంగారం వుంటుంది" అని కుబేరుడు తొండను దీవించాడు.

యజ్ఞం నిర్విఘ్నంగా పరిసమాప్తం అయిన తర్వాత దేవతలు తమ హవిర్భాగాలు తీసుకుని వెళ్ళిపోయారు. 30 200

ఉశీర దేశాన్ని వీడిన పిదప దుష్యంతుడు, సురదుడు, గాధీ, గయుడు, పురూరవుడు మొదలైన రాజుల్ని ఓడించి, చిట్టచివరికి అయోధ్యాపట్టణానికి వెళ్ళి "అనరణ్యుడు" అనే రాజుని యుద్ధానికి రమ్మని పిలిచాడు లంకేశ్వరుడు.

మిక్కిలి పౌరుషం కల ఆ రాజు రావణునితో భీకరంగా పోరాడి మరణించాడు. మరణించేముందు "రావణా! ఈ విజయం నీ గొప్పతనమని భావించకూడదు. ప్రస్తుతం కాలం నీకు అనుకూలంగా వుంది.

ముందు ముందు నా వంశంలో శ్రీరాముడనే మహాపురుషుడు జన్మించి నిన్ను, నీ వంశాన్ని సర్వనాశనం చేస్తాడు" అని శపించాడు.

తర్వాత అయోధ్యను విడిచి వెళ్ళిపోయాడు విజయుడైన రావణుడు.

రావణ విహారం-3

ఒకప్పుడు రావణాసురుడు పుష్పక విమానంలో తిరుగుతూవుంటే నారదమహర్షి ఆకాశమార్గంలో ఎదురుపడ్డాడు. ఆయనకి అభివాదం చేసి క్షేమ సమాచారాలు అడిగాడు రావణుడు. అప్పుడు నారదుడు ఇలా అన్నాడు.

"రావణా! నీ పరాక్రమం సాటిలేనిది. దేవతలుగాని, రాక్షసులుగాని, యక్షులు మొదలైనవారుగాని నిన్ను జయించలేరు. యీ భూలోకంలోని మానవుల్లో నిన్ను ఎదిరించేవాళ్ళు అసలే లేరు. వీళ్ళందరూ బలహీనులు. ఎప్పుడూ రోగాలతోను, రొప్పులతోను బాధపడుతూ వుంటారు. అటువంటి వారిని కూడా నువ్వు నానావిధాలుగా హింసిస్తున్నావు. ఇది నీవంటి వాడికి తగని పని. నీ శక్తియుక్తులన్నీ ఆ యముడిమీద చూపించు."

నారదుడు చెప్పిన మాటలన్నీ విన్న రావణుడు ఇలా అన్నాడు-- "మహర్షీ! ప్రస్తుతం నేను పాతాళానికి వెళ్ళి అక్కడ అందర్నీ జయించి, తర్వాత ముల్లోకాలను ముట్టడించాలను కుంటున్నాను"

అప్పుడు నారదుడు "దశగ్రీవా! ఇప్పుడు నువ్వు వెళ్ళేదారి పాతాళానికి పోదు. దక్షిణపు దిక్కునవున్న యమపురికి పోయే మార్గం యిది. కాబట్టి నేను చెప్పినట్లు విని యముణ్ణి జయించు" అని సలహా యిచ్చాడు.

"సరే. ఇప్పుడే వెళ్ళి ఆ యముడి మదం అణుస్తాను" అంటూ ముందుకి సాగిపోయాడు రావణుడు.

యమరావణ యుద్ధం చూడాలనే వేడుకతో నారదుడు కూడా యమపురికి పయనమై వెళ్ళి రావణుని యుద్ధకాంక్షను గూర్చి యముడికి వివరించాడు.

ఈ లోపలే రావణుడు యమలోకానికి వెళ్ళి అక్కడ పాపులకు విధించే శిక్షలన్నీ స్వయంగా చూశాడు. బాధితుల్ని యమభటుల బారినుంచి తప్పించి విడిపించాడు. అప్పుడు యమదూతలు రావణుణ్ణి ఎదిరించారు. అనేక ఆయుధాలు ప్రయోగించారు. పుష్పకాన్ని పాడుచేశారు. కాని వెంటనే అది మామూలు స్థితికి వచ్చింది. యమ సైన్యం రావణ సైన్యాన్ని, మంత్రుల్ని ఎదుర్కొని రావణుడు ప్రయోగించిన బాణాలన్నింటినీ నిర్వీర్యం చేసింది. దానితో ఉగ్రుడైన లంకాధిపతి పాశుపతాన్ని సంధించి శత్రు సైన్యంమీద ప్రయోగించి విజయోత్సాహంతో పెద్దగా కేక పెట్టాడు.

ఆ కేక విని పరిస్థితిని గుర్తించిన యముడు ఉగ్రరూపుడైనాడు. అతని కన్నులు క్రోధాగ్నితో ఎరుపెక్కినాయి. రథాన్ని అధిరోహించి యుద్ధభూమికి బయలుదేరాడు. అతని పక్క కాలదండం కాచుకుని ఉంది. ఆయన రథానికి ముందు మృత్యుదేవత ముద్గరాన్ని, కాలపాశాన్ని ధరించి ముందుకు నడిచింది. తన వాహనమైన మహిషం యొక్క గళములో వ్రేలాడుతున్న గంటె గణగణ మోగుతుండగా, ధనుష్టంకారంచేస్తూ, లోక భీకరుడై రాక్షస సైన్యాన్ని చిందర వందర చేశాడు. ఆయన ధాటికి తట్టుకోలేక రాక్షస మంత్రులు నీరుకారిపోయారు.

రావణుడు మాత్రం అంతకుణ్ణి ధైర్యంతో ఎదుర్కొని నిలిచాడు. ఏడు రోజులు వాళ్ళ యిద్దరి మధ్యా మహా సంగ్రామం జరిగింది. భీషణంగా జరుగుతున్న యీ యుద్ధాన్ని దేవతలందరూ తిలకిస్తున్నారు. రాక్షస రాజు మృత్యువును నాలుగు బాణాలతోను, యముడి సారథిని ఏడు బాణాలతోను, యమధర్మరాజుని లక్ష బాణాలతోను నొప్పించాడు.

అప్పుడు మృత్యువు ముందుకువచ్చి— "స్వామీ! నాకు అనుజ్ఞ ఇవ్వండి. ఈ రాక్షసుని పొగరణుస్తాను" అంటూ ప్రార్థించింది.

"నువ్వు ఊరుకో! నేనే పీడ విరతం పడతాను" అంటూ యముడు దుర్నివార పరాక్రముడై, అప్రతిమాన భీముడై కాలదండాన్ని చేతిలోకి తీసుకుని గిరగిర తిప్పుతూ రాక్షసరాజు మీద ప్రయోగించడానికి సిద్ధమైనాడు.

ఇంతలో బ్రహ్మదేవుడు అడ్డుపడి ఇలా అన్నాడు. "యమధర్మరాజా! నా వర ప్రభావవల్ల ఇతనికి నీతో చావులేదు. యీ కాలదండము ప్రయోగిస్తే సర్వ సంహారం అవుతుంది. దీనికి అమోఘశక్తి నిచ్చింది నేనే గదా! నా వరాల్ని అసత్యం కాకుండా చూడు. కాలదండాన్ని ప్రయోగించవద్దు."

ప్రజాపతి ఆజ్ఞను శిరసావహించిన యముడు యుద్ధ భూమినుండి అదృశ్యుడైనాడు. తానే గెలిచాననే ఉత్సాహంతో రావణుడు పాతాళానికి దారి తీశాడు.

రావణ విహారం-4

యమలోకంమీద దండయాత్రచేసి విజయుడై తిరిగి వచ్చిన రావణాసురుడు పాతాళానికి వెళ్ళి నాగులకు నివాసమైన భోగవతీ పురాన్ని ముట్టడించగా, నాగరాజు అతనికి వినమ్రుడై అనేక మణుల్ని కానుకగా ఇచ్చి సత్కరించాడు

తర్వాత రాక్షసేశ్వరుడు "మణిపురి" అనే పట్టణానికివెళ్ళి, బ్రహ్మచేత మునుపు వరాలు పొందిన నివాతకవచులనే యుద్ధరు దానవ వీరుల్ని తనతో యుద్ధం చెయ్యమని కవ్వించాడు. మహా బలశాలురయిన ఆ దానవ వీరులు రాక్షస సైన్యంతో తలపడ్డారు. రెండు సైన్యాల మధ్య ఒక

సంవత్సరంపాటు యుద్ధం కొనసాగింది. కాని ఓటమిగాని గెలుపుగాని ఎవరికీ కలగలేదు.

ఆ సమయంలో బ్రహ్మదేవుడు అక్కడికి వచ్చి "రావణాసురుణ్ని దేవదానవుల్లో ఎవ్వరూ ఓడించలేరు. కాబట్టి అతనితో స్నేహం చేసుకోండి" అని నివాత కవచులకు సలహా యిచ్చాడు.

ఆయన మాటల్ని శిరసావహించి దానవులు రాక్షస రాజుతో స్నేహం చేశారు. రావణుడు వాళ్ళ దగ్గర ఒక సంవత్సరంపాటు వుండి తొంభయి తొమ్మిది మాయా విద్యలను నేర్చుకున్నాడు.

అనంతరం అశ్మనగరానికి వెళ్ళి కాలకేయుల్ని, శూర్పణఖ భర్త అయిన విద్యుజ్జిహ్వుని సమర రంగంలో సమయించాడు.

నాగుల్ని, దైత్యుల్ని ఓడించిన తరువాత లంకాధినేత వరుణ పట్టణానికి వెళ్ళి, అక్కడ కాపలా కాస్తున్న భటులతో "నాతో యుద్ధము చెయ్యాలని మీ రాజుతో చెప్పండి" అన్నాడు.

ఈ లోపలే వరుణుని కొడుకులు, మనవలు యుద్ధ సన్నద్ధులై వచ్చి రావణునితో తలపడ్డారు. కాని కొంతసేపు పోరాటం జరిగిన తర్వాత వరుణ సైన్యం ఓడిపోయింది. వెంటనే వరుణ పుత్రులు రథాల మీద ఆకాశమార్గం చేరుకుని రాక్షస రాజుని బాగా నొప్పించారు.

అప్పుడు కుపితుడయిన మహోదరుడనే రాక్షస వీరుడు గదతో వరుణుని కొడుకుల రథాల్ని ముక్కలు ముక్కలుగా చేశాడు. గుర్రాలు కింద పడిపోయాయి. కాని రథాలు లేకుండానే వాళ్ళు ఆకాశంలో నిలబడి తీవ్రమైన బాణాలచేత రావణ మహోదరుల్ని బాణవర్షంలో ముంచెత్తారు. రావణుడు మూర్తీభవించిన కోపదేవత అయి, మేఘంలా గర్జిస్తూ వరుణ కుమారుల్ని నానావిధాలైన ఆయుధాలతో పీడించాడు. అతని శక్తికి తట్టుకోలేక వాళ్ళు తమ యింటికి పలాయనం చిత్తగించారు.

రావణుడు కూడా వరుణ గృహానికి వెళ్ళి తన యుద్ధ కాంక్షను గురించి వరుణుడికి తెలియజెయ్యమని అడిగాడు.

అప్పుడు ప్రహాసుడు అనే వరుణుని మంత్రి వచ్చి- "రావణా! వరుణుడు సంగీతం వినడానికి బ్రహ్మలోకానికి వెళ్ళాడు. ఇక్కడున్న వాళ్ళందరినీ ఇప్పుడే గదా ఓడించావు. ఇంకా నిన్ను ఎదిరించే వాళ్ళు ఎవరున్నారిక్కడ?" అన్నాడు.

ఈ సమాధానంతో తృప్తిపడ్డ రావణుడు "నేనే జయించా"నని సగర్వంగా చెప్పుకుంటూ ఇంటిముఖం పట్టాడు.

రావణ విహారం-5

వరుణ పుత్రుల్ని ఓడించి లంకకు తిరిగి వస్తూ రావణుడు అనేక రాజకన్యల్ని, నాగ గంధర్వ కాంతల్ని, దేవదానవ కన్యల్ని, మానవ మహర్షి తనయుల్ని ఎత్తుకువచ్చి పుష్పకంలో కూర్చోబెట్టాడు. అడ్డము వచ్చిన వాళ్ళని హతమార్చాడు. ఆ స్త్రీల ఆర్తనాదాలతో పుష్పకం మారు మోగింది. వాళ్ళ కన్నీరు మున్నీరైంది. ఆ అబలలు పరిపరివిధాలశోకిస్తూ తమ తల్లిదండ్రుల్ని, భర్తల్ని మాటిమాటికీ తలచుకుంటూ "ఈ దురాత్ముడిలా మమ్మల్ని అపహరించుకు పోతున్నాడు. పరస్త్రీల పట్ల గల వ్యామోహమే వీడి వినాశనానికి దారి తీస్తుంది." అంటూ రావణాసురుణ్ణి శపించారు. వాళ్ళ దీనారవాలు రావణుడి హృదయాన్ని మాత్రం కరిగించలేకపోయాయి. రాతిగుండెలు కరుగుతాయా!

లంకకు చేరుకున్నాడు రావణుడు. తన భర్తని యుద్ధరంగములో చంపిన అన్నను చూసి బావురుమంది శూర్పణఖ.

"చెల్లి! యుద్ధంలో మనవాళ్ళు, పరాయివాళ్ళు అని నిదానించటం కూడని పని. ఎదురొచ్చిన వాళ్ళని చంపడమే అప్పటి కర్తవ్యం. పైగా నీ భర్తని కావాలని చంపలేదు. యుద్ధ సంరంభంలో అతణ్ని గుర్తించ

లేకపోయాను. జరిగిందేదో జరిగిపోయింది. నీకేమీ అన్యాయం జరగ నివ్వను. దండకారణ్యం రాక్షసులకు నివాసమవుతుందని పూర్వం శుక్రుడు శపించాడు. మన పినతల్లి కొడుకైన ఖరుడు అక్కడే వున్నాడు గదా ! అతని చేతిక్రింద యోధాన యోధులున్నారు. కాబట్టి నువ్వు అతని సంరక్షణలో సుఖంగా కాలం గడుపు" అని ఊరడించి, ఖరుణ్ని వెంటనే దండకారణ్యానికి ప్రభువుగాచేసి, చెల్లెల్ని అతనికి అప్పగించాడు.

పద్నాలుగు వేలమంది అరివీర భయంకరులైన రాక్షసవీర సైన్యానికి దూషణుడు సైన్యాధిపతి కాగా, ఖరుడు దండకారణ్య పాలనము స్వీకరించాడు.

తర్వాత "నికుంభిల" అనే వనానికి వెళ్ళాడు లంకేశ్వరుడు. అక్కడ మేఘనాదుడు కృష్ణాజినం ధరించి, చేతిలో కమండలం పట్టుకుని ఆసీనుడై వున్నాడు.

"ఏమిటిదంతా?" అంటూ కొడుకుని ఆలింగనము చేసుకున్నాడు రావణుడు.

"రావణా! నీ కొడుకు అగ్నిష్టోమం, అశ్వమేధం, బహుసువర్ణకు, రాజసూయం, గోమేధం, వైష్ణవం, మాహేశ్వరం అనే ఏడు యజ్ఞాలు పూర్తి కావించాడు. మాహేశ్వర యజ్ఞానికి తృప్తుడైన శంకరునివల్ల కామగమనం కలిగి ఆకాశంలో సంచరించే దివ్యరథాన్ని, 'తామసి' అనే మాయా విద్యనూ, శత్రువుల్ని దుర్నివారంగా క్షోభింపజేసే ధనస్సును, మహా మహిమోపేతమైన దివ్యాస్త్రాన్ని, రెండు అక్షయ తూణీరాల్ని పొందాడు." అని శుక్రుడు తెలియజేశాడు.

"మీరు చేసిన పని మంచిదికాదు నాకు శత్రువులైన ఇంద్రాది దేవతల్ని పూజించారు" అంటూ విభీషణునితోనూ, కొడుకుతోనూ కలిసి లంకా పట్టణానికి ప్రయాణమైనాడు రావణుడు.

o o o o

పాతాళ వాసియైన మాల్యవంతుని మనుమరాలు కుంభీనసి. రావణ

విభీషణులకు పినతల్లి కూతురు అంటే చెల్లెలు. ఆమె ఒకప్పుడు రావణుడి అంతఃపురంలో కొంతకాలం వుంది.

ఒకానొక సమయంలో రావణుడు జైత్రయాత్రల్లో మునిగి వున్నాడు. అతని కొడుకు మేఘనాదుడు యజ్ఞదీక్షలో వున్నాడు. విభీషణుడు నీటిలో తపస్సు చేస్తున్నాడు. కుంభకర్ణుడు నిద్రాలోలుడై వున్నాడు. ఈ అదను చూసుకుని 'మధువు' అనే రాక్షసుడు వచ్చి, ఎదురు వచ్చిన రాక్షసుల్ని చంపి, కుంభీనసిని బలవంతంగా ఎత్తుకుపోయాడు. ఈ సంగతి విభీషణుని ద్వారా విని రావణుడు కోపోద్రిక్తుడై వెంటనే సమరానికి సన్నాహాలు చెయ్యవలసిందిగా ఆజ్ఞాపించాడు.

కుంభకర్ణుడు, మేఘనాదుడు సైన్యంతో తోడురాగా రావణుడు మధుపురం చేరుకున్నాడు. తన భర్తని చంపడానికి వచ్చి వుంటాడని గ్రహించిన కుంభీనసి అన్న పాదాలపై పడి భోరున ఏడ్చింది.

"ఏం కావాలమ్మా నీకు? ఎందుకిలా ఏడుస్తున్నావు? నేనుండగా నీ కెందుకు భయం?" చెల్లెల్ని బుజ్జగిస్తూ అన్నాడు లంకాధిపతి.

"అన్నా! నేను నా భర్త అన్యోన్యంగా వుంటున్నాం. నా పతిని రక్షించు. నువ్వు అన్నమాట నిలబెట్టుకో. వైధవ్యం కులస్త్రీలకు భరించరానిది ...." అంది కుంభీనసి.

చెల్లెలి మాటలు విని ఆమెకు అభయం ఇచ్చాడు అన్న. అంతే కాదు. "నేను అమరావతిమీద దండెత్తాలి. దీనికి నీ భర్త సహాయపడు కావాలి. కాబట్టి అతన్ని నాతో రమ్మని చెప్పు" అన్నాడు.

కుంభీనసి వెంటనే నిద్రపోతున్న మధువును లేపి జరిగినదంతా చెప్పింది. అతను సంతోషించి రావణుడికి అతిథి మర్యాదలు చేశాడు. ఆ రాత్రి అక్కడే గడిపి మర్నాడు కుబేరుడు నివసిస్తున్న కైలాస పర్వతంమీద తన దండుతో విశ్రాంతి తీసుకున్నాడు లంకేశ్వరుడు.

రావణ విహారం-6

ఒకప్పుడు రావణుడు ఇంద్రునిపైకి యుద్ధానికి బయలుదేరి వెళ్ళాడు. అతని వెంట కుంభకర్ణుడు, మేఘనాదుడు కూడా ఉన్నారు.

ఈ సంగతి విన్న ఇంద్రుడు దిగులుపడి దేవతలందర్నీ యుద్ధానికి సంసిద్ధులు కమ్మని చెప్పి, విష్ణుమూర్తి దగ్గరికి వెళ్ళి-"దేవా! బ్రహ్మ వర ప్రసాద జనిత గర్వాటోపంతో మిడిసిపడుతూ రావణుడు నామీద యుద్ధానికి వస్తున్నాడు. పూర్వం నన్ను అనేక విధాల ఆదుకుని రక్షించావు. నీ కృపాకటాక్షం చేత నముచి, వృత్రుడు మొదలైనవారిని హత మార్చాను. ఇప్పుడు నిన్నే శరణువేడుకుంటున్నాను నువ్వు తప్ప నాకు వేరే గతిలేదు" అని ప్రార్థించాడు.

ఇంద్రుడి ప్రార్థనలు ఆలకించిన విష్ణువు "దేవేంద్రా! రావణుడు అజేయుడు. తగిన సమయం చూసి వాడిని నేనే అంతం చేస్తాను. ప్రస్తుతానికి నువ్వే యథాశక్తిగా వాడితో పోరాడు" అని నచ్చజెప్పి పంపిస్తాడు.

దేవదానవ యుద్ధం మొదలైంది. రాక్షసుల పక్షాన సుమాలి దేవతల్ని ఎదిరించి చెల్లాచెదురు చేశాడు. వాళ్ళు చెట్టుకొకరు పుట్టకొకరుగా పారిపోయారు. ఇది చూసి సావిత్రుడనే ఎనిమిదవ వసువు మహోగ్రుడై నూరణాయుధాలతో రాక్షస వీరుల్ని భయభ్రాంతుల్ని చేసి ఒక్క పెను గదను తీసుకుని సుమాలి శిరస్సుమీద కొట్టాడు. దానితో సుమాలి ప్రాణాలు పక్షిలాగా ఎగిరిపోయాయి. రాక్షస సైన్యం యావత్తూ పారిపోయింది.

అప్పుడు మేఘనాదుడు ముందుకువచ్చి తన సైన్యానికి ధైర్యం చెప్పాడు. అతన్ని ఎదుర్కొనేందుకు ఇంద్రుడు తన కొడుకు జయంతుణ్ణి పంపించాడు. జయంత మేఘనాదుల యుద్ధం ప్రచండంగా సాగింది. ఎక్కడ చూసినా బాణవర్షం. అంతా అయోమయం. అంతా అంధకార బంధురం.

ఈ సమయంలో తన మనవడికి ఏ అపకారమూ జరగకూడదనే ఉద్దేశ్యంతో రాక్షసుడైన పులోముడు (ఇంద్రుని భార్య అయిన శచీదేవి తండ్రి) యీ చీకటిని ఆసరాగా చేసుకుని, జయంతుణ్ని తీసుకుపోయి సముద్రంలో దాచాడు.

కొడుకు కనిపించకపోయేసరికి ఇంద్రుడు రోషావేశంతో మాతలి తీసుకువచ్చిన రథం ఎక్కి యుద్ధభూమికి బయలుదేరి వచ్చాడు. ఆయన్ని ప్రతిఘటించేందుకు రావణుడే స్వయంగా విశ్వకర్మ నిర్మించిన రథమెక్కి వచ్చాడు. మేఘనాదుణ్ని విశ్రాంతి తీసుకొమ్మన్నాడు..

మహా బీభత్సంగా సురాసుర యుద్ధం సాగుతోంది. కుంభకర్ణుడు కాలాగ్ని భీకరుడై కనపడిన వాళ్ళందరినీ నానా హింసలూ పెట్టి పీడించాడు. ఏకాదశరుద్రులు, మరుత్తులు రాక్షసుల్ని మట్టుపెడుతున్నారు. రణరంగమంతా నెత్తురు ప్రవాహంతో నిండిపోయింది.

ఇంద్ర రావణులు ఒకరితో ఒకరు తలపడ్డారు. ఇద్దరూ మహోగ్ర తేజంతో పోరాడుతున్నారు. ఆకాశమంతా బాణాలతో నిండిపోయింది అంతా చీకటి వ్యాపించింది.

రావణుడు దేవసైన్యం మధ్యగా వెడుతూ ఉదయ పర్వతంవైపు మళ్ళించమన్నాడు రథాన్ని. అతని ఉద్దేశ్యం మరో పక్కనుంచి దేవతల్ని ఎదుర్కోవాలని, ఇది కనిపెట్టిన ఇంద్రుడు "దేవతలారా! సిద్ధంకండి. ఈ అసురుణ్ని మనం చంపలేం. కాబట్టి వీడిని ప్రాణాలతో పట్టుకుని బంధించడమే మనం చెయ్యాల్సిన పని" అంటూ హెచ్చరించి, మరో పక్కగా వెళ్ళి రాక్షసుల్ని చెండాడసాగాడు. రావణుడు ఉత్తరముఖంగా వచ్చి బాణాలు గుప్పిస్తున్నాడు. ఇంద్రుడు దక్షిణ ముఖంగా వెళ్ళి రావణుణ్ని చుట్టుముట్టి, అతని సైన్యాన్ని పంచబంగాళం చేశాడు. రాక్షసుల దీనారావాలతో రణరంగమంతా మారుమోగింది.

పరిస్థితిని అర్థం చేసుకున్న మేఘనాదుడు కుపితుడై ముందుకు నడిచాడు. మాయా యుద్ధం మొదలుపెట్టాడు. తాను ఎవ్వరికీ కనపడ

మండా అదృశ్యంగా వుండి ఇంద్రుడి మీద శరవర్షం కురిపించాడు. మేఘనాదుడికోసం ఇంద్రుడు ఎంత వెతికినా అతను కనిపించలేదు. ఇంతలో అదృశ్యుడై వచ్చి మేఘనాదుడు ఇంద్రుణ్ని ఐరావతంమీదనుంచి పైకి ఎత్తుకుపోయాడు. అలా ఎవరు తీసుకుపోతున్నారో అర్థంకాలేదు దేవతలకు. ఆ కోపంతో వాళ్ళందరూ రావణాసురుణ్ని చుట్టుముట్టి బాగా కొట్టించారు. అతను బాగా అలిసిపోయాడు.

ఈలోపల అక్కడికి వచ్చాడు మేఘనాదుడు. "తండ్రీ! ఇంద్రుడు నాకు పట్టుబడ్డాడు. ఇంకా యుద్ధం చెయ్యాల్సిన అవసరం మనకు లేదు. ఇప్పుడు మూడులోకాలకీ అధిపతివి నువ్వే" అన్నాడు.

కొడుకు మాటలువిని రావణుడు పరమానందంతో పరవశించాడు.

"కుమారా! ఇంద్రుణ్ని రథంమీద బంధించి లంకకు తీసుకు వెళ్ళు నేను వెంటనే వస్తాను" అన్నాడు. అలాగే చేశాడు మేఘనాదుడు.

రావణుడు కూడా తన సైన్యంతో పాటు లంకకు చేరుకున్నాడు.

తమ ప్రభువుని రాక్షసులు బందీగా తీసుకుపోవడం చూసి దేవతలు విచారగ్రస్తులై బ్రహ్మదేవుణ్ని దర్శించి, ఇంద్రుణ్ని విడిపించవలసిందిగా మొర పెట్టుకున్నారు.

వాళ్ళందరినీ వెంటబెట్టుకుని బ్రహ్మ లంకాపురానికి వచ్చి-"రావణా! నీ కొడుకు నిన్ను మించిపోయాడు. ఇంద్రుణ్ని ఓడించినందుకు 'ఇంద్రజిత్తు' అనే పేరు అతనికి సార్థకమవుతుంది. ఇంద్రుడితో సహా దేవతలందరూ నీకు వశులైనారు. కాబట్టి అతణ్ని వదిలిపెట్టు" అన్నాడు.

"పితామహా! నాకు అమరత్వాన్ని ప్రసాదిస్తే అలాగే వదిలి పెడతాను" అన్నాడు మేఘనాదుడు

"నాయనా! పుట్టిన ప్రతిప్రాణికీ మృత్యువు తప్పదు. కాబట్టి నీకు అమరత్వాన్ని యివ్వడం కుదరదు" సమాధానమిచ్చాడు బ్రహ్మ.

"అయితే నేను కోరేది విని నాకావరం ఇవ్వు. యుద్ధానికి బయలు

నేరేముందు మంత్రాలతో అగ్నిని అర్చించి హోమం చేస్తాను. అప్పుడు నాకొక రథం సిద్ధంకావాలి. ఆ రథాన్ని అధిరోహించి నేను యుద్ధం చేస్తున్నంతసేపూ నాకు చావులేకుండా వుండాలి. ఒకవేళ హోమకార్యం పూర్తి కాకపోతే యుద్ధంలో నాకు చావు వచ్చినా పరవాలేదు. ఇది నా పరాక్రమానికి అనుగుణమైన కోరిక" అని వినమ్రుడై పరమేష్టిని వేడుకున్నాడు.

బ్రహ్మదేవుడు ఆ వరం అనుగ్రహించి ఇంద్రుణ్ణి బంధవిముక్తుణ్ణి చేశాడు.

వేదవతి

భూలోకమంతా తిరుగుతూ ఒకనాడు రావణుడు హిమశైలం చేరుకున్నాడు. అక్కడ ఒక జవ్వని జింక చర్మం ధరించి, నియమ నిష్ఠలతో తపస్సు చేసుకుంటోంది. ఆమెను చూసీ చూడగానే రావణుని బుద్ధి చలించింది. మోహం అతనిలో తాండవించింది. ఆమెను సమీపించి ఇలా అన్నాడు.

"సుందరీ! నువ్వు ఎవరి కూతురివి? నీ భర్త ఎవరు? ఇంత మిసమిసలాడే యౌవనాన్ని వ్యర్థం చేసుకుంటూ తపస్సు చెయ్యాల్సిన అవసరం ఏమొచ్చింది?"

అప్పుడామె యిలా సమాధానం చెప్పింది. "బృహస్పతి కొడుకైన కుశధ్వజుడు నా తండ్రి. నిరంతర వేదాధ్యయన పరాయణుడు. అందువల్లనే 'వేదవతి' అని నాకు పేరు పెట్టారు. నన్ను తమ కిచ్చి పెళ్ళి చెయ్యమని ఎంతోమంది దేవతలు, రాక్షసులు, గంధర్వులు మొదలైనవాళ్ళు మా నాన్నగారిని అడిగారు. కాని ఆయన వీల్లేదన్నాడు. కారణం శ్రీమహావిష్ణువే తనకు అల్లుడు కావాలని ఆయన కోరిక"

ఒకనాడు 'దంభుడు' అనే దానవుడు వచ్చి నన్ను తన కివ్వమని మా తండ్రిని అడిగితే ఆయన అంగీకరించలేదు.

"అందుకని కోపంతో వాడు ఆయన్ని నిర్దాక్షిణ్యంగా చంపేశాడు. నా తల్లి సహగమనం చేసింది. నా తండ్రి ఆశయాన్ని నెరవేర్చడమే నా కర్తవ్యంగా భావించి విష్ణువును భర్తగా పొందడం కోసం నేనీ తపస్సు చేస్తున్నాను."

వేదవతి చెప్పిన మాటలు విని రావణుడు మదన పీడితుడై ఇలా అన్నాడు.

"రమణీమణీ! సర్వగుణ సంపన్నురాలయిన నువ్విలా చెప్పడం భావ్యం కాదు. త్రైలోక్యసుందరివి. మంచి యౌవనంలో ఉండి, అన్ని సుఖాల్నీ త్యజించి, విష్ణువు కోసం తపస్సు చేస్తున్నానంటున్నావు. విష్ణు వెవడు? నాలాంటి పరాక్రమంగాని, బలంగాని, తపోమహిమగాని, భోగ భాగ్యాలుగాని వాడికి లేవు. నాతో అతను సరిరాడు. నేనెవరో తెలుసా? లంకాధిపతిని....నన్ను వరించి నాతో దివ్యసుఖాలు అనుభవించు.

దానికి ప్రతి సమాధానంగా····"విష్ణువు సర్వలోకాధినేత. పూజ్యుడు దివ్యప్రభావం కలవాడు". అన్నది వేదవతి.

కాని మొండివాడయిన రావణుడు తమకంతో ఆమె కొప్పు పట్టుకున్నాడు. వేదవతి క్రోధారుణనేత్ర అయి తన చెయ్యి అనే చురకత్తితో అతను పట్టుకున్న కేశాల్ని ఖండించి యిలా అన్నది.

"దుర్మార్గుడా! నిన్ను శపించే శక్తి నాకుంది. కాని అలా చేస్తే నా తపస్సు వ్యర్థం అవుతుంది. నన్ను ఇలా పరాభవించిన నిన్ను సర్వ నాశనం చెయ్యడానికి అయోనిజనై ఒకధర్మాత్ముడికి కూతురుగా పుడతాను ఇలా అంటూనే వేదవతి అగ్నిలో దూకి ఆత్మాహుతి చేసుకుంది.

కృతయుగంలోని ఈ వేదవతి త్రేతాయుగంలో జనకుని కుమార్తె, సీతా నామధేయంతో శ్రీరాముడికి ధర్మపత్నియై రావణసంహారానికి కారణ భూతురాలయింది.

రావణుడు కార్తవీర్యుడు

'కార్తవీర్యార్జునుడు' అనే రాజు మహిష్మతీ పురాన్ని పాలించేవాడు. అతనికి వెయ్యి చేతులు. మహాపరాక్రమవంతుడు. భూలోకంలోని రాజులందరినీ జయించాలనే కోరికతో రావణాసురుడు ఒకప్పుడు మహిష్మతికి వచ్చి-"నేను యుద్ధార్థినై వచ్చానని మీ రాజుతో చెప్పండి" అని కార్యవీర్యుని మంత్రులతో చెబుతాడు.

ఆ మంత్రులు మహాబుద్ధిమంతులు. తమ రాజు ఎక్కడ ఉన్నాడో చెప్పకుండా "ఇప్పుడు మారాజు పట్టణంలో లేడు" అని మాత్రం చెబుతారు

అందువల్ల రావణుడు తిరుగు ముఖంపట్టి వింధ్య పర్వతం చేరుకుని, దాని సోయగాల్ని తిలకిస్తూ పక్కనే వున్న నర్మదా నదికి వెళ్ళి చక్కగా స్నానంచేసి వచ్చి, ఒక బంగారు శివలింగాన్ని యిసుక తిన్నె మీద ప్రతిష్ఠించాడు. ఈ లోపల అతని మంత్రులు కూడా నర్మదలో సుస్నాతులై సుగంధ భరితాలయిన పుష్పాలు శివ పూజ కోసం తెచ్చారు. రావణుడు శివలింగాన్ని అర్చించి, కొంతసేపు గానంచేసి, మరికొంతసేపు భక్తితత్పర్యంతో నాట్యం చేశాడు.

ఆ సమయంలో కార్తవీర్యుడు వెయ్యిమంది సుందరాంగుల్ని కూడి నర్మదలో జలకేళీ నిమగ్నుడై ఉన్నాడు. ఆ కేళీవిలాసంలో పడమటిదిశగా ప్రవహిస్తున్న నదిని తన చేతులతో ఆపివేశాడు. ఆ నదీప్రవాహం వెనక్కి మళ్ళి రావణుడు పూజిస్తున్న శివలింగాన్ని, పూజా ద్రవ్యాల్ని ముంచె త్తింది. క్షణకాలం విస్మయం చెందిన లంకేశుడు ఈ నది తూర్పుదిశగా రావడానికి కారణమేమిటో తెలుసుకురమ్మని అనుచరుల్ని పంపించాడు. వాళ్ళు అక్కడికి వెళ్ళి విషయమంతా తెలుసుకుని తమ ప్రభువుకి నివేదించారు.

రావణుడు ఉగ్రుడైనాడు. ఆ రాజు కార్తవీర్యుడని గ్రహించి

అతని మదం అణచాలని నిర్ణయించుకున్నాడు. సైన్యాన్ని సమాయత్తం చేశాడు.

కార్తవీరుడి మంత్రుల దగ్గరికి వెళ్ళి "రావణుడు యుద్ధం కోసం నిరీక్షిస్తున్నాడని మీ రాజుతో చెప్పండి" అన్నాడు.

మంత్రులు నవ్వి "రావణా! యుద్ధానికి వేళాపాళా వుండాలి. మా రాజుగారిప్పుడు జలక్రీడలో ఉన్నాడు. నీతో రేపు యుద్ధం చేస్తాడు. ఇప్పుడే "కావాలంటే మాతో యుద్ధం చెయ్యి" అన్నారు.

ఈ లోపలే రావణ మంత్రులు వాళ్ళమీద శరపరంపరలు గుప్పించారు. వాళ్ళు కూడా ధనుజ సైన్యాన్ని ఎదుర్కొని ముప్పతిప్పలు పెట్టారు. రాక్షస మంత్రులు కార్తవీర్యుడి మంత్రుల్ని చంపి తినేశారు. ఈ సంగతిని కార్తవీర్యుడికి అతని భటులు ఎరిగించారు.

కార్తవీర్యుడు నదినుంచి బయటికి వచ్చి, పెద్ద గద నొకదాన్ని తన భుజస్కంధాలమీద ధరించి, రౌద్రాకారుడై యుద్ధానికి వచ్చాడు.

ప్రహస్తుడు [రావణ మంత్రి] అతణ్ని ముసలంతో ఎదుర్కొన్నాడు. అర్జునుడు ముసలాన్ని తప్పించుకుని, తన గదతో అతని శిరస్సు మీద కొట్టాడు. ప్రహస్తుడు స్పృహతప్పి పడిపోయాడు. మిగిలిన మంత్రు లందరూ పారిపోయారు. వెంటనే లంకేశ్వరుడు కార్తవీర్యుడితో తల పడ్డాడు.

రావణార్జునుల మధ్య పోరాటం అతి భీకరంగా ప్రజ్వరిల్లింది. వాళ్ళిద్దరూ రెండు పర్వతాలలాగా, సముద్రాలలాగా, అగ్నుల్లాగా, ఏనుగుల్లాగా, మేఘాలలాగా, సింహాలలాగా, ప్రళయకాల రుద్రుల్లాగా గదా యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో ఒకరి కొకరు ఏ మాత్రం తీసిపోలేదు. ఇలా సమరం సాగుతుండగా అదను చూసుకుని అర్జునుడు రావణుడి వక్షాన్ని తన గదతో మోదగా అతను కొంచెం వెనక్కి తప్పుకున్నాడు. ఆ సమయంలో రావణుణ్ని అమాంతం తన సహస్ర బాహువులతో గరుత్మంతుడు పామును పట్టుకున్నట్లుగా పట్టుకుని, బంధించి, తన నగరానికి తీసుకువెళ్ళాడు కార్తవీర్యుడు.

ఈ లోపల అంతకు ముందు కార్తవీర్యుడి గదాఘాతం వల్ల మూర్ఛిల్లిన ప్రహస్తుడికి తెలివి వచ్చింది. తమ రాజు బందీ అయినట్లు తెలుసుకుని తన మూకతో కార్తవీర్యుణ్ణి ఎదిరించాడు కాని అతని ప్రతాపాగ్నికి తట్టుకోలేక తొలగిపోయాడు.

రావణుడు బంధితుడయిన వార్త విని పులస్త్యుడు మాహిష్మతికి వచ్చాడు. ఆయన్ని సత్కరించి పూజించి "మీకు ఏం కావాలో ఆజ్ఞాపించండి" అని కార్తవీర్యుడు వినమ్రుడైనాడు.

"కార్తవీర్యా! ముల్లోకాలను గజగజ లాడించిన రావణుణ్ణి నువ్వు ఓడించిన మహాపరాక్రమశాలివి. అతను నా మనుమడు. వాడిని విడిచిపెడితే సంతోషిస్తాను. ఇదే నేను కోరుకునేది" అన్నాడు పులస్త్య బ్రహ్మ.

ఆయన కోరిక ప్రకారం రావణుడికి బంధ విమోచనం కలిగించి నూతన వస్త్రాలతోను, ఆభరణాలతోను సత్కరించి, అతనితో అగ్ని సాక్షిగా సఖ్యం చేశాడు.

సిగ్గుతో రావణుడు లంకకు చేరుకున్నాడు. పులస్త్యుడు బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు.

రావణుడు - వాలి

కార్తవీర్యార్జునుడి చేతిలో ఓడిపోయి పులస్త్యుని కోరికమీద బంధ విముక్తుడైన రావణుడికి ఇంకా బుద్ధిరాలేదు. బలంగల వాళ్ళందరినీ జయించాలనే కండూతి అతన్ని విడిచిపెట్టలేదు. దాని ఫలితంగానే మహా బలసంపన్నుడయిన వాలిని జయించాలనే కోర్కె పుట్టింది. పుట్టిందే తడవుగా కిష్కింధా నగరానికి వెళ్ళి తన కుతూహలాన్ని వెల్లడించాడు.

అక్కడున్న తారకుడు (మంత్రి), సుషేణుడు (మామ), సుగ్రీవుడు (యువరాజు) యిది విని "రావణా! మా రాజు ఇప్పుడు

కిష్కింధలో లేడు. ప్రతిదినం ఆయన ప్రాతఃకాల సమయంలో నాలుగు సముద్రాలలోను స్నానంచేసి యథావిధిగా సంధ్యావందన జపాదులు పూర్తి చేసుకుని తిరిగి వస్తాడు. కాబట్టి కొంచెంసేపు ఆగు. అయినావాలితో పోరు మంచిది కాదు. అతనితో పోరాడిన వీరుల అస్థిపంజరాలు చూడు ఎలా గుట్టలుగా పడి ఉన్నాయో! అంతగా కాదుకూడదంటే దక్షిణ సముద్రానికి వెళ్ళు. ఆయనిప్పుడు అక్కడే వుంటాడు" అని చెప్పాడు.

బలగర్వియైన రావణుడు వాళ్ళని కోతులనే చులకన భావంతో చూసి, పుష్పకంలో దక్షిణ సముద్రానికి వెళ్ళాడు. అక్కడ వాలి బంగారు మేని ఛాయతో, ఉదయభానుడి లాగా ప్రకాశిస్తూ సంధ్యోపాసన చేస్తున్నాడు. రావణుడు అతని వెనకగా వెళ్ళి పట్టుకుందామనే ఉద్దేశ్యంతో ముందడుగువేసి వాలిని సమీపించాడు. ఇదంతా తన క్రీగంటి చూపులతో గ్రహించిన వాలి హఠాత్తుగా రావణుణ్ణి ఒడిసి పట్టుకుని, చంకలో ఇరికించుకుని ఒక్క ఊపుతో గగనతలంలోకి ఎగిరిపోయాడు. రాక్షసుడు తన గోళ్ళతో రక్కుతున్నా, కోరలతో కొరుకుతున్నా లెక్క చెయ్యకుండా వాలి మహావేగంతో పయనించి పశ్చిమ సముద్రం చేరుకున్నాడు. రావణుణ్ణి చంకలో పెట్టుకునే సముద్ర స్నానంచేసి, సంధ్యోపాసన ముగించుకుని, ఉత్తర సముద్రానికి వెళ్ళి, అక్కడ కూడా అలాగే చేసి, తర్వాత తూర్పు సముద్రంలో మునిగి, గృహోన్ముఖుడై కిష్కింధకు సమీపాన ఉన్న ఒక ఉపవనంలో రాక్షస రాజుని కింద పడేశాడు. పైపెచ్చు "ఎక్కడి నుంచి వస్తున్నారు తమరు?" అని వేళాకోళం చేశాడు.

రావణుడు ఆశ్చర్య చకితుడైనాడు.

"వానరేశ్వరా! నీ శక్తి అమోఘం. గమనంలో నువ్వు వాయువునూ, మనస్సునూ. గరుడుణ్ణీ మించిపోయావు. నన్ను అవలీలగా చంకలో పెట్టుకుని నాలుగు సముద్రాలూ తిప్పివచ్చావు. నీ అంతటి వీరుణ్ణి నేనెక్కడా చూడలేదు. ఈ క్షణం నుంచీ మనిద్దరం స్నేహితులుగా కలిసిమెలిసి బ్రతుకుదాం" అన్నాడు. దానికి ఒప్పుకున్నాడు వాలి. తర్వాత

వాళ్ళిద్దరూ కలిసి కిష్కింధకు వచ్చారు. అక్కడే సుఖంగా నెల రోజులు గడిపి, లంకకు చేరుకున్నాడు రావణుడు.

నలకూబర శాపం

ఒకప్పుడు రావణుడు ఇంద్రలోకాన్ని జయించాలనే కోరికతో వెడుతూ మార్గమధ్యంలో కుబేరుని నివాస ప్రదేశమయిన కైలాస పర్వతాన్ని చేరుకుని, అక్కడ తన సైన్యంతో సహా విడిది చేశాడు.

సూర్యుడు అస్తమించాడు· తర్వాత చంద్రోదయమైంది. సైన్యమంతా నిద్రా ముద్రితమై ఉంది. రావణుడు ఒంటరిగా కొండ శిఖరంమీద కూర్చున్నాడు. చల్లని వెన్నెల హాయి గొల్పుతోంది. ఆ ప్రాంతమంతా పుష్ప ఫల సంభరితములయిన వృక్షాలతో నిండి వుంది. కిన్నర స్త్రీలు మదన పరవశంతో మధుర గానాలు ఆలాపిస్తున్నారు. విద్యాధరులుమదిరా పానలోలురై మదనోత్సవ విలాసంలో సర్వం మరిచిపోతున్నారు. కుబేరుని యింట్లోంచి అప్సరసల గానం శ్రవణపేయమై గుండెల్లో మధురానందాన్ని నింపుతోంది. చల్లని గాలి సుమసౌరభాలను వెదజల్లుతోంది.

రావణుడు మన్మథ బాణాలకు వశమైనాడు. అలా చంద్రునివైపే చూస్తూ ఉండిపోయాడు. వెన్నెల వేడిగా మారింది. అతని నిట్టూర్పులు వెచ్చనైనాయి.

ఆ సమయంలో ఆ దారిన వెడుతోంది అందాల రాశి రంభ. ఆమె చక్కగా అలంకరించుకుని ఉంది. ఒడలు నిండా చల్లని గంధం పూసుకుంది. దివ్యపరిమళాలను ఒలికించే మందార పుష్పాలను కొప్పులో ధరించింది. వయ్యారంగా వెడుతున్న ఆ సుందరాంగిని చూసి రావణుడు ఇలా మదనోద్రేకంతో పొంగిపోయాడు· ఆమె చేతిని మృదువుగా పట్టుకుని ఇలా అన్నాడు.

"రమణీ! నీ పయన మెక్కడికి? పద్మసుగంధ భరితమయిన నీ అధరామృతాన్ని గ్రోలే భాగ్యవంతు డెవడు? నీ వక్షోజాలను తన హృదయానికి గాఢంగా హత్తుకునే అదృష్టవంతు డెవడు? స్వర్గరూపమయిన నీ అందచందాల్ని ఎవరు అనుభవిస్తారో గదా! మదవతీ! నేను రావణుడను. ముల్లోకాలలోనూ నాతో సమానమైన వాడులేడు. అటువంటి నేను నిన్ను యాచిస్తున్నాను. నన్ను కనికరించు. చిరునవ్వు లొలికించు. ఆనందము చిందించు, అమృతం కురిపించు, ఈ శిలాఫలకంమీద విశ్రమించు."

రంభ కంపించి, తల వంచి అతనితో ఇలా అంది: "అయ్యా! మీరు నాకు మామగారు అవుతారు. నేను మీకు కోడల్ని, మీ అన్నగారైన కుబేరుని కొడుకు నలకూబరుడు. అతని కోరిక తీర్చడానికి వెళుతున్నాను. నన్ను దయచేసి విడిచి పెట్టండి."

కాని కామోద్రేకంతో కన్నుమిన్నులు కానరాని రావణుడు "ఓసీ! అప్సరసలకు ఒక్కడేమిటి పతి? నాకు నీతులు చెబుతున్నావా?——" అంటూ వికటాట్టహాసంచేసి చంద్రకాంత శిలావేదికమీద ఆమెను బలాత్కరించాడు.

ఆమె వాడిపోయిన మోముతో, చెదిరిన ఆభరణాలతో, విడిపోయిన కేశాలతో, వాడిన పూలతో, మదపుటేనుగు చేత కలచబడిన నదిలాగా వెళ్ళి నలకూబరుని దగ్గర నిలబడింది. జరిగినదంతా చెప్పింది. ఆమె దీనావస్థను చూచిన నలకూబరుడు కోపోద్రిక్తుడై, రక్తారుణనేత్రుడై "ఇష్టంలేని ఇంతుల్ని ఇకముందు ఇలా బలాత్కారిస్తే వాడికి మృత్యువు కలుగుతుంది" అని శపించాడు.

ఈ శాప వార్త విని దేవతలు, మునులు, రావణునిచేత చెరపట్టబడిన వనితలు సంతోషించారు. అశనిపాతం లాంటి శాపాన్ని తెలుసుకున్న రావణుడు అప్పటినుంచీ తనమీద ఇష్టంలేని కాంతల్ని బలాత్కరించడం మానుకునాడు.

హనుమంతుడు

సూర్యప్రభావంచేత బంగారు ఛాయతో వుంటుంది మేరు పర్వతం. ఆ ప్రాంతానికి ఏలిక కేసరి అనే వానరుడు. ఆయన భార్య అంజనాదేవి. వాయుదేవుడి అనుగ్రహంతో అంజనాదేవికి జన్మించాడు ఆంజనేయుడు.

ఆ బాలుణ్ని ఇంట్లోనేవుంచి పళ్ళు తేవటం కోసం అంజనాదేవి అడవికి వెళ్ళింది. ఇంట్లోవున్న ఆంజనేయుడికి బాగా ఆకలివేసింది. ఏడవడం మొదలుపెట్టాడు. అటూ ఇటూ చూశాడు. తూర్పున సూర్య భగవానుడు ఉదయిస్తున్నాడు. ఆయన్ని చూసి పండు అనుకున్నాడు బాలుడు. వెంటనే ఆకాశంమీదికి ఎగిరిపోయి రెండవ బాలసూర్యుడిలాగా ప్రకాశించాడు. తన కుమారుడికి సూర్యునివేడి తగలకుండా గాలిచల్లగా వుండేటట్లు వీచాడు వాయువు. ముక్కుపచ్చలారని బాలుణ్ని రక్షించాలనే ఉద్దేశ్యంతో సూర్యుడు తనవాడియైన వేడి కిరణాల్ని అతని మీద ప్రసరించనీయలేదు.

ఆరోజు సూర్యగ్రహణం కావడంవలన సూర్యుణ్ని పట్టుకోవాలని వస్తున్నాడు రాహువు. కాని అక్కడున్న బాలుని చూసి, తిరుగుముఖంపట్టి కోపంతో దేవేంద్రుడి దగ్గరికి వెళ్ళి మొరపెట్టుకున్నాడు.

"అయ్యా! సూర్యచంద్రుల్ని మింగడం అనేది నాకు నువ్వు ఏర్పరిచిన నియమం. ఈ రోజు సూర్యుణ్ని పట్టుకోవాలనే ఉద్దేశంతో వెళ్ళాను. కాని అక్కడ ఎవరో మరొక రాహువు వచ్చి నా బదులుగా తానే సూర్యగ్రహణం చెయ్యబోతున్నాడు."

ఆశ్చర్యచకితుడైన ఇంద్రుడు ఐరావతం ఎక్కి బయలుదేరి వచ్చాడు. ఆయన కంటే ముందుగానే రాహువు తిరిగి వచ్చాడు.

వచ్చిన రాహువును మరో పండుగా భావించిన ఆంజనేయుడు సూర్యుణ్ని వదిలేసి రాహువు వెంట పడ్డాడు. అతను లబోదిబోమంటూ "దేవేంద్రా! రక్షించు రక్షించు" అని ప్రార్థించాడు.

"నీకేమీ భయంలేదు" అంటూ ఇంద్రుడు తన ఏనుగును ముందుకు నడపగా, బాల వానరవీరుడు దానిని కూడా ఫలమని భావించి పట్టుకోడానికి ప్రయత్నుడైనాడు. ఈ వానర శిశువును చూసి ఇంద్రుడు మృదుకోపం వహించి తన వజ్రాయుధంతో నెమ్మదిగా కొట్టాడు. ఎడమ దవడకి దెబ్బ తగిలి బాలుడు కొండమీద పడిపోయాడు.

వాయుదేవుడు ఇది చూసి కోపించాడు. తన కుమారుణ్ణి తీసుకొచ్చి ఒక కొండగుహాలోకి ప్రవేశించాడు. ప్రపంచమంతటా గాలి స్తంభించి పోయింది. ప్రాణులన్నీ గాలిలేక విలవిలలాడి పోయాయి. యజ్ఞ యాగాది క్రతువులకు అంతరాయం కలిగింది. దేవదానవ మహర్షి సంఘాలు వెళ్ళి ఈ ప్రాణసంకటస్థితిని గురించి విధాతకు నివేదించారు. వాళ్ళందర్నీ వెంట పెట్టుకుని వాయుదేవుడున్న గుహలోకి వచ్చాడు బ్రహ్మ.

వాయుదేవుడు లేచి బ్రహ్మకి పాదాభివందనంచేసి దీనవదనంతో నిలబడ్డాడు. దయార్ద్ర హృదయంతో బ్రహ్మ శిశువు శిరస్సును మృదువుగా తన పాణిపద్మంచేత స్పృశించాడు. ఆ స్పర్శవల్ల బాలుడు బాహ్య స్మృతికి వచ్చాడు. వాయుదేవుడు సంతోష తరంగిత హృదయారవిందుడై నాడు. వాయుసంచారం మొదలయింది. అందరి ముఖాల్లో ఆనందం వెల్లి విరిసింది.

అప్పుడు బ్రహ్మ యిలా అన్నాడు— "దేవతలారా! ఈ బాలుడు ముందు ముందు దేవకార్యం నెరవేరుస్తాడు. వాయువు సంతోషించేటట్లుగా ఈ బాలుడికి మీరందరూ వరాలివ్వండి."

బ్రహ్మ ఆజ్ఞను శిరసావహించి మొట్టమొదటగా మహేంద్రుడు ముందుకువచ్చి, బాలుణ్ని పుష్పమాలా లంకృతుని చేసి "నా వజ్రంచేత ఇతని హనువు [దవడ] దెబ్బ తిన్నది కాబట్టి నేటి నుంచీ "హనుమంతుడు" అనే పేరు ఇతనికి సార్థకమవుతుంది. ఇకమీదట నా వజ్రాయుధం ఇతన్ని ఏమీ చెయ్యలేదు" అని వరమిచ్చాడు.

సూర్యుడు తన తేజస్సులో నూరోవంతు పిల్లవాడి కిచ్చి, అతని విద్యాభ్యాసం భారం తానే వహిస్తానని, అతనివంటి శాస్త్రజ్ఞాని మరొకడు ఉండబోడనీ అన్నాడు.

"నావల్లగానీ' నా పాశాలవల్లగానీ ఇతనికి మృత్యు భయముండదు" అని వరుణుడు వరమిచ్చాడు.

"ఇతను ఏ రోగమూ, రోషూ లేకుండా వుంటాడు. యుద్ధంలో యమదండంవల్ల కీడు జరగదు" అంటూ యముడు ఆశీర్వదించాడు.

తన గదవల్ల యుద్ధంలో చావు కలగదని కుబేరుడూ, తనవల్ల కానీ, తనకు సంబంధించిన అస్త్రశస్త్రాలవల్ల కానీ మృత్యువు కలగదని శంకరుడూ వరాలు అనుగ్రహించారు.

"నాచేత నిర్మింపబడిన ఆయుధాల వలన ఆపదలు లేకుండా చిర కాలం వర్ధిల్లుతాడు" అంటూ విశ్వకర్మ దీవించాడు.

"బ్రహ్మాస్త్రంవల్ల యితనికి ఏ విధమయిన ఆపద రాదనీ, చిరం జీవిగా వర్ధిల్లుతాడనీ" బ్రహ్మదేవుడు తన ఆశీస్సులు అందజేశాడు.

వర ప్రదానం అయిన తర్వాత బ్రహ్మవాయుదేవుడితో—"నీకొడుకు అరివీర భయంకరుడు, యుద్ధంలో అజేయుడు అవుతాడు. కామరూపుడు, కామగమనుడు, కామచరుడు అవుతాడు. వానరుల్లో శ్రేష్ఠుడు, అప్రతిమాన పరాక్రముడు, కీర్తిమంతుడు అవుతాడు. రాక్షస మర్దనంకోసం అవతరించే శ్రీరామచంద్రునికి ప్రీతిపాత్రుడవుతాడు" అని చెప్పి మిగతా దేవతలతో పాటు అంతర్ధానమయ్యాడు.

జరిగిన సమాచారమంతా సవిస్తరంగా అంజనాదేవికి చెప్పి,బాలుణ్ణి ఆమెకు అప్పగించి వెళ్ళిపోయాడు వాయువు.

దేవతలచేత వరాలు పొందిన హనుమంతుడు మునీశ్వరుల ఆశ్రమ ప్రాంతాలలో సంచరిస్తూ వారిని అనేకవిధాలుగా బాధపెట్టేవాడు. వాళ్ళ అగ్నిహోత్రాల్ని ఆర్పేసేవాడు. ఆరేసుకున్న బట్టల్ని చించేసే వాడు. యజ్ఞోపకరణాల్ని పాడుచేసేవాడు. కాని హనుమంతుని శక్తి నెరి

గినవాళ్ళు అతన్ని ఏమీ చెయ్యలేకపోయారు. వాయుపుగాని, అంజనగాని కేసరిగాని అతని అల్లరి పనుల్ని ఆపలేకపోయారు.

చివరికి ఋషులు విసిగిపోయి "వరబలంచేత నువ్వు మమ్మల్ని ఇలా ఇబ్బంది పెడుతున్నావు. ఇకనుంచి ఎల్లకాలం నువ్వు నీ బలాన్ని తెలుసుకో లేవు. ఇతరులు నిన్ను కీర్తించినప్పుడు మాత్రమే నీ బలమేమిటో నీకు తెలుస్తుంది" అని శపించారు. ఆరోజునుంచీ హనుమంతుడు బుద్ధిమంతు డైనాడు.

వానర రాజైన ఋక్షరజసుడి మరణానంతరం వాలి రాజైనాడు. అతని తమ్ముడు సుగ్రీవుడు యువరాజైనాడు. ఈ యువరాజుకి మిత్రుడు హనుమంతుడు. వాలి సుగ్రీవులకు విరోధం వచ్చినప్పుడు హనుమంతుడు మునిశాప కారణంగా తన శక్తి సామర్థ్యాలను, పరాక్రమోత్సాహాలను, వచో నైపుణ్యబుద్ధి చాతుర్యాలను, గాంభీర్య వీర్యాలను, ప్రతాప ధైర్యా లను గుర్తించ లేకపోవడం వల్లనే వాలి నేమీ చెయ్యలేదు. లేకపోతే మిత్రు డైన సుగ్రీవుడి కష్టాల్ని ఎప్పుడో గట్టెక్కించేవాడు.

మహామతిమంతుడు, బలవంతుడు అయిన హనుమంతుడు సూర్యుని దగ్గర విద్యాభ్యాసం చేశాడు. ఆయనతోపాటు ఉదయాద్రి నుంచి అస్తాద్రి వరకూ పయనించి, సాటిలేని శాస్త్రజ్ఞానాన్ని, కూలంకషమైన పాండి త్యాన్ని సముపార్జించిన ఈ ప్రతిభాశాలి బృహస్పతికి దీటైనవాడు.

(ఈ కథ అన్నింటినీ అగస్త్యుడు రాముడితో చెప్పాడు)

జానకీ పరిత్యాగం

శ్రీరామచంద్రుడు రాక్షస సంహారానంతరం సీతతో అయోధ్యకు తిరిగి వచ్చి కోసల దేశానికి ప్రభువుగా పట్టాభిషిక్తుడై ధర్మం తప్పకుండా పదివేల సంవత్సరాలు రాజ్యంచేసి సీతతో అనేక దివ్యభోగాలు అనుభ వించాడు.

ఒకనాడు సీతారాములు ఏకాంతంగా వున్న సమయాన రాముడు-
"దేవీ! నువ్వు తల్లివి కాబోతున్నావు. నీ మనస్సులో ఏమైనా కోరిక వుంటే చెప్పు. తప్పకుండా నెరవేరుస్తాను" అన్నాడు.

భర్త మాటలకు సంతోషపడి జానకి తన ముద్దుమోమున చిరు నవ్వులు చిందిస్తూ ఇలా అంది-

"నాథా! గంగాతీరంలో ఉన్న ముని ఆశ్రమాలలో ఫలాలు, కంద మూలాలు తిని ఒక్కరోజు గడపాలని" వుంది.

"సీతా! ఇదేనా నీ కోరిక! అలాగే తీరుస్తాను" అన్నాడు రాముడు.

కాని సీత కోరిక రాముడికి మనస్తాపాన్ని కలిగించింది. వెంటనే ఆయన సభాభవనానికి వెళ్ళిపోయాడు. అక్కడ విజయుడు, మధు మత్తుడు, కాశ్యపుడు, పింగళుడు, కుటుడు, సురాజు, కాళియుడు, భద్రుడు, దంతవక్త్రుడు, సుమాగధుడు అనేక హాస్య కథలు చెప్పి రాముణ్ని సంతోష పెట్టారు.

ఆ కథలు వింటూ భద్రుణ్ని చూసి రాముడిలా అన్నాడు: "భద్రా! నన్ను గురించిగాని, సీతను గురించిగాని, నా సోదరులను గురించిగాని, మా మంచి చెడ్డల్ని గురించిగాని ప్రజలు ఏమనుకుంటున్నారో వివరంగా చెప్పు."

"ప్రభూ! నీ పరాక్రమాల్ని ప్రజలు వేనోళ్ళ కొనియాడుతున్నారు. సముద్రానికి సేతువు కట్టటం, రావణ సంహారం మొదలైన కృత్యాలన్నీ ఘనంగా భావిస్తున్నారు. కాని రాక్షసుడు ఎత్తుకుపోయి తన అధీనంలో చాలాకాలం వుంచుకున్న సీతను తిరిగి తీసుకురావడాన్ని మాత్రం ప్రజలు రకరకాలుగా చెప్పుకుంటున్నారు" రెండు చేతులు జోడించి అన్నాడు భద్రుడు.

రాముని ముఖం విషాదగ్రస్తమైంది. స్నేహితుల్ని పంపేశాడు. ద్వారపాలకుణ్ని పిలిచి తమ్ముళ్ళను వెంటనే రమ్మని కబురు చేశాడు.

లక్ష్మణ భరత శత్రుఘ్నులు ముగ్గురూ రాహుగ్రస్తమైన చంద్రబింబం లాగా వున్న అన్నగారి ముఖంచూసి నిశ్చేష్టులయ్యారు.

జరిగిన సంగతంతా తమ్ముళ్ళతో చెప్పి "లక్ష్మణా! నీకన్ని సంగతులూ తెలుసు. సీత అగ్ని ప్రవేశం చేసిన తర్వాత సూర్యచంద్రులు, అగ్ని, వాయువు, ఇంద్రుడు వచ్చి సీత యొక్క సౌశీల్యాన్ని మెచ్చుకున్నారు. నా అంతరాత్మ కూడా సీత మహాపతివ్రత అని నమ్మింది. కాని నా ప్రజలు ఈ విధంగా అపవాదు సృష్టించారు. దీనిని పోగొట్టుకొనడానికి సీతా పరిత్యాగం తప్ప వేరే మార్గంలేదు. కాబట్టి నువ్వు రేపు ఉదయాన సీతను తీసుకెళ్ళి, గంగానదికి అవతల తమసా నదీతీరాన వున్న వాల్మీకి మహర్షి యొక్క ఆశ్రమం దగ్గర విడిచిపెట్టు. ఇది నా ఆజ్ఞ. సీత కూడా మున్యాశ్రమాలలో కొంతకాలం వుండాలని కోరుకుంది. ఆమె కోరిక కూడా తీరుతుంది" అన్నాడు రాముడు.

మర్నాడు పొద్దున రథాన్ని సిద్ధం చేశాడు మంత్రి సుమంత్రుడు. లక్ష్మణుడు వదినగారి దగ్గరికి వెళ్ళి "తల్లీ! నీ కోరిక ప్రకారం ఋషుల ఆశ్రమాలకు తీసుకు వెళ్ళమని అన్నగారి ఆజ్ఞ అయింది" అని విన్నవించాడు.

తనను రాముడు పరిత్యజిస్తున్నాడని తెలియని జానకి తన కోరిక ఫలిస్తోందని సంతోషపడింది. మునిపత్నుల కివ్వాలని అనేక ఆభరణాలు, వస్త్రాలు తీసుకుని రథమెక్కింది. వాయువేగంతో రథం కదిలింది.

మార్గమధ్యంలో సీతాదేవికి అనేక దుశ్శకునాలు గోచరించాయి. కుడికన్ను అదిరింది. ఆమె గుండెలో అధైర్యం ప్రవేశించింది. శరీరం కంపించింది. ఆమె దిగులుపడి "లక్ష్మణా! నాకెందుకో దుశ్శకునాలు కాన వస్తున్నాయి. మీ అన్నగారికీ, అత్తగార్లకూ, అయోధ్యాపుర ప్రజలకూ క్షేమమేనా!" అని అడిగింది.

సౌమిత్రి అవునన్నట్లు తల పంకించాడు. కాని అతని మనస్సు

కలత చెందివుంది. ఆ రాత్రి వాళ్ళు గోమతి అనే నదీ సమీపాన విశ్రాంతి తీసుకున్నారు.

మర్నాడు ఉదయం బయలుదేరిన రథం మధ్యాహ్నానికి గంగా నదిని సమీపించింది. లక్ష్మణుడు వదినగారి దీనావస్థను తలుచుకొని ఏడ్చాడు.

అతన్ని చూసింది సీత. "లక్ష్మణా! ఎందుకు దుఃఖిస్తున్నావు? రెండురోజులు మీ అన్నగారిని చూడలేదని విచారిస్తున్నావా? నేను మాత్రం ఆయన్ని వదలి వుండగలనా! ఒక్క రాత్రి ముని ఆశ్రమంలో గడిపి మరుసటిరోజే అయోధ్యకు వెళ్ళిపోదాం. త్వరగా గంగానదిని దాటే ఏర్పాటు చేయించు" అన్నది అమాయకంగా.

లక్ష్మణుడు మనస్సు చిక్కబట్టుకుని సుమంత్రుణ్ని అక్కడే వుండమని చెప్పి ముందుగా సీతను నావ ఎక్కించి తర్వాత తాను ఎక్కాడు. గంగానదిని దాటిన పిదప లక్ష్మణుడు రెండు చేతులెత్తి సీతకు ప్రణమిల్లి కన్నీరు మున్నీరుకాగా గద్గద కంఠంతో "తల్లీ! ఏమని చెప్పను? నేను మహాపాపిని. నాకు చావు వచ్చినా బాగుండేది? నన్నీ ఘోరకార్యానికి అన్నగారు నియోగించారు. పరమపావనివైన నీ మీద ప్రజలేవో అపవాదు వేశారని నిన్ను మా తండ్రిగారికి ఇష్టుడైన వాల్మీకిమహర్షుల ఆశ్రమం దగ్గర విడిచి రమ్మన్నారు. ఆయన శాసనానికి తిరుగులేదు. ఆ మహర్షి దయామయుడు, మహాత్ముడు. ఆయన సన్నిధిలో నిరంతరం శ్రీరామచంద్రుని స్మరిస్తూ కాలం గడుపు. నీకు సకల శ్రేయాలూ కలుగుతాయి" అంటూ ఆమె పాదాలమీద పడ్డాడు.

దారుణమైన లక్ష్మణుని పలుకులు విని సీత మూర్ఛిల్లింది. కొంతసేపటికి తెలివి తెచ్చుకుని రోదిస్తూ ఇలా అంది. "సౌమిత్రీ! నేను కష్టాలనుభవించడానికే పుట్టానేమో! పూర్వజన్మలో ఏ పాపం చేశానో అది నన్ను పట్టిపీడిస్తోంది. మునుపు అరణ్యవాసం చేశాను. అది భర్త సాన్నిధ్యంలో, కాని యిప్పుడు భర్తను విడిచి ఒంటరిగా ఎలా వుండగలను?

నా కష్టాల్ని ఎవరితో చెప్పుకోను? రాముడు నన్నెందుకు త్యజించాడని మునిపత్నులు అడిగితే ఏం చెప్పగలను?...అన్నా! రాజాజ్ఞ సీతా నారీ శిరోధార్యం. నువ్వు వెంటనే అయోధ్యకు తిరిగివెళ్ళు. అత్తగార్లకు నా నమస్కారాలు అందించు. మహారాజుకి నా క్షేమ సమాచారాలు తెలియజెయ్యి. నాకు పతియే దైవమనీ, సఖుడనీ, తల్లిదండ్రులనీ, గురువనీ, ఆయన అనతిని గౌరవిస్తానని మీ అన్నతో చెప్పు."

సీత మాటలు విన్న లక్ష్మణుడు శోక బాష్పాకుల నేత్రుడై వదిన గారి పాదాలకు మొక్కి ప్రదక్షిణం చేశాడు, వెళ్ళలేక వెళ్ళలేక గంగా నదిని చేరుకుని, నావ ఎక్కి అవతలితీరం చేరి సుమంత్రునితోపాటు రథం అధిరోహించాడు. మాటిమాటికీ పెల్లుబుకుతున్న దుఃఖంతో సీతను వెనక్కి తిరిగి చూస్తూనే వున్నాడు. ఆమె కూడా రథం కనిపించినంత సేపూ చూస్తూనే వుండి, అది కనుమరుగు కాగానే పెద్ద పెట్టున ఏడుస్తూకుప్పగా కూలిపోయింది.

ఆమె దీనావస్థను చూసిన ముని బాలకులు వెంటనే వచ్చి వాల్మీకితో చెప్పారు. ఆయన దివ్యదృష్టితో విషయమంతా తెలుసుకుని, శిష్యసమేతుడై సీతమ్మ వున్న చోటుకి చేరుకుని "తల్లీ! జనకుని కూతురివి, దశరథుని కోడలివి, శ్రీరాముని అర్ధాంగివి అయిన నీ సమాచారం తపశ్శక్తివల్ల తెలుసుకున్నాను. నీ చరిత్ర అతి పవిత్రం, నా ఆశ్రమానికి రావలసిందిగా నిన్ను కోరుతున్నాను. అక్కడున్న మునిసతు లందరూ నిన్ను కన్న కూతురులాగా చూసుకుంటారు." అని మృదూక్తులతో ఆమెను ఓదార్చాడు.

సీత మునికి నమస్కారంచేసి ఆయన్ని అనుసరించింది. ఆయన సీతను వెంటబెట్టుకుని, తన ఆశ్రమానికి చేరుకుని "ఈమె యిక నుంచీ నా సంరక్షణలో వుంటుంది. జాగ్రత్తగా చూడండి" అని ముని పత్నులకు అప్పగించాడు.

భృగు శాపం

పూర్వం ఒకప్పుడు దేవదానవ యుద్ధం జరిగింది. అందులో దానవులందరూ ఓడిపోయి పతివ్రతా తిలకమైన భృగు మహర్షి పత్నిని ఆశ్రయించారు. ఆమె వాళ్ళకి అభయమిచ్చింది. దేవతలకి రక్షకుడైన మహావిష్ణువు ఈ సంగతి తెలుసుకుని తన చక్రంతో ఆమె శిరస్సుని ఖండించాడు.

భార్య మరణానికి మండిపడ్డాడు మహర్షి. "నా భార్యను చంపి నాకు వియోగం కలిగించావు. కాబట్టి నువ్వు మానవలోకంలో పుట్టి చాలా సంవత్సరాలు భార్యా వియోగం అనుభవిస్తావు" అంటూ శపించాడు విష్ణువుని.

తాను చేసిన పనికి విచారించాడు విష్ణువు. భృగువు కూడా ఆ పర మాత్ముడికి తానిచ్చిన శాపాన్ని తలుచుకుని, పశ్చాత్తాపపడి, ఆ దేవ దేవుణ్ని నిరంతరం నియమ నిష్ఠలతో పూజించాడు.

ఆయన భక్తికి ప్రీతుడై ప్రత్యక్షమయ్యాడు విష్ణువు.

"మునీశ్వరా! నీ శాపాన్ని మన్నిస్తాను. దుష్ట శిక్షణార్థం నేను భూలోకంలో జన్మిస్తాను. నువ్వేమీ విచారించవద్దు" అని చెప్పి అంతర్ధాన మయ్యాడు.

ఈ కథను దూర్వాస మహర్షి ఒకప్పుడు దశరథ మహారాజుకి చెప్పి "ఓ రాజా! ఆ విష్ణువే నీకు కుమారుడై జన్మించాడు. ముందు ముందు భృగు శాపాన్ని అనుభవిస్తాడు. ఎన్నో యజ్ఞాలు చేస్తాడు. అతని పాలనలో ప్రజలు నిశ్చింతగా సుఖభోగాలు అనుభవిస్తారు. పదకొండు వేల సంవత్సరాలు రాజ్యంచేసి చివరికి తన లోకం చేరుకుంటాడు. అతనికి ఇద్దరు కుమారులు జన్మిస్తారు. కాని అయోధ్యలో మాత్రం పుట్టరు" అని వివరించాడు.

సీతాదేవిని వాల్మీకి మహర్షియొక్క ఆశ్రమం దగ్గర విడిచి, సుమంత్రునితో కలిసి అయోధ్యకు తిరిగి వస్తూ, లక్ష్మణుడు తన అన్న

గారి పరాక్రమాన్ని, ఆయన అనుభవించిన కష్టాల్ని, ప్రజలు ఆయనమీద మోపిన అపవాదుని తలుచుకొని [illegible] బాధపడ్డాడు.

"సుమంత్రా! విశుద్ధ చరిత అయిన సీతకు పతివియోగం ధర్మమూర్తి అయిన రాముడికి పత్నీవియోగం. వాళ్ళ కెంతటి కష్ట దశ వచ్చింది! దేవదానవ యక్షరాక్షసుల్ని తన పాదాక్రాంతుల్ని చేసుకోగల శక్తిమంతుడైన రాముడు విధికి తలఒగ్గి వున్నాడు. పితృవాక్యపాలన కోసం పూర్వం అడవులకు వెళ్ళి పత్నీ వియోగం అనుభవించాడు. ఇప్పుడు ప్రజల మాటల్ని గౌరవించి మళ్ళీ పత్నీవియోగం అనుభవిస్తున్నాడు. విధి బలీయంగదా!" అని నిట్టూర్చాడు.

శోక భారంతో కుంగిపోతున్న లక్ష్మణుణ్ని ఓదారుస్తూ సుమంత్రుడిలా అన్నాడు.

"లక్ష్మణా! మీ వంశ భవిష్యత్తును గురించి దుర్వాసుడు చెప్పినట్లే ఇప్పుడు జరుగుతోంది. కాబట్టి విచారించి లాభంలేదు. రాముడు కష్టాలు అనుభవిస్తాడు. సీతా పరిత్యాగమేకాదు కొంతకాలం అయిన తర్వాత నిన్ను, నీ సోదరుల్ని కూడా విడిచి పెడతాడు. ఈ సంగతి ఎవ్వరికీ చెప్పకూడదని దశరథ మహారాజు నన్ను శాసించారు. అందుకని ఇంత కాలం మనస్సులోనే దాచుకున్నాను. ఇప్పుడు నష్టంలేదు గదా అని నీకు చెబుతున్నాను. కాని రహస్యాన్ని భరత శత్రుఘ్నులకు కూడా చెప్పరాదు."

ఇదంతా విని లక్ష్మణుడు విచారాన్ని దిగమింగి మనస్సును దిటవు చేసుకున్నాడు.

నృగ మహారాజు

పూర్వం సత్యసంధుడు, కీర్తిమంతుడు, నిర్మల హృదయుడు అయిన 'నృగుడు' అనే మహారాజు వుండేవాడు. ఆయన కోటి షాడి ఆవుల్ని బ్రాహ్మణులకు దానం చేశాడు. అలా ఒకడికి దానం చేసిన ఆవు

క్రోని ఒక ఆవు రాజుగారి మందలోకి తిరిగి వచ్చేసింది. ఆ ఆవుని మళ్ళీ వేరొకడికి దానమిచ్చాడు రాజు.

అంతకు ముందు దానం పరిగ్రహించిన బ్రాహ్మణుడు తప్పిపోయిన తన ఆవు కోసం వెతికి వెతికి చివరికి కనఖలం అనే గ్రామంలో ఒక బ్రాహ్మణుని యింట్లో చూశాడు.

"శబలా! రా పోదాం" అంటూ పిలిచాడు. ఆవు అతన్ని అనుసరించింది. రెండవ బ్రాహ్మణుడు ఆవు తన దంటూ దాన్ని అనుసరించాడు.

ఆవు నాదంటే నాదని యిద్దరూ తగవులాడుకుంటూ నృగ మహారాజు దగ్గరికి వచ్చారు తీర్పు కోసం. ఎన్నో దినాలు వేచి వున్నారు. కాని రాజు వాళ్ళకి దర్శనం యివ్వలేదు. న్యాయవిచారణ జరిపించలేదు. రాజు నిర్లక్ష్యానికి గురయిన బ్రాహ్మణు లిద్దరూ చివరికి విసిగిపోయి కోపావేశంతో "నువ్వు తొండవై జన్మించి అనేక వేల సంవత్సరాలు అలాగే పడివుండు. వసుదేవుడికి పుత్రుడై పుట్టిన విష్ణువు ఈ శాపానికి విమోచనం కలిగిస్తాడు" అని శపించి, ఆవుని మరొకడికి యిచ్చేసి వెళ్ళిపోయారు.

ఈ శాప వార్త విని రాజు సభతీర్చి, మంత్రి పురోహితులకు విషయము తెలిపి "నన్ను శపించి వెళ్ళిపోతున్నవాళ్ళు పర్వత నారదులు. వాళ్ళు బ్రాహ్మణుల్లాగా ముల్లోకాల్లోనూ సంచరిస్తున్నారు. వాళ్ళ శాపానికి తిరుగులేదు. అనుభవించాల్సిందే. కాబట్టి నాకు నివాస యోగ్యముగా ఉండే ఒక పల్లపు ప్రాంతాన్ని సిద్ధపరిచి, వానకిగాని, ఎండకిగాని, చలికిగాని బాధపడకుండా వుండేటట్లు ఏర్పాట్లు చేయించండి. ఆ పల్లపు భూమి చుట్టూరా పళ్ళ చెట్లనూ, పూల చెట్లనూ నాటించండి. శాప మోక్షం అయ్యే వరకూ అక్కడే వుంటాను" అని చెప్పి తన కొడుకు వసువుకి రాజ్యం అప్పగించి -

"నాయనా! క్షత్రధర్మం ప్రకారం జాగ్రత్తగా రాజ్యపాలన చెయ్యి. చిన్న తప్పు చేసినందుకు నేనెలా శాపగ్రస్తుణ్ని అయ్యానో చూడు.

తెలుసు. సుఖదుఃఖాల్ని అనుభవించక తప్పదు. కాబట్టి నా కోసం విచారించవద్దు" అని హితబోధలు చేసి శాపఫలం అనుభవిస్తాడు.

ఈ కథను శ్రీరాముడు తమ్ముడైన లక్ష్మణునితో సీతా పరిత్యాగానంతరం చెప్పి-"ప్రజల కష్టసుఖాల్ని రాజు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాళ్ళ సమస్యల్ని పరిష్కరించాలి. కార్యార్థులై వచ్చిన ప్రజల్ని పట్టించుకోకపోతే వాళ్ళలో అలజడి రేకెత్తుతుంది. దానివల్ల రాజు అనేక కష్టనష్టాలపాలు కావాల్సి వస్తుంది. కాబట్టి లక్ష్మణా! నా దర్శనకోసంఎవరైనా వచ్చారేమో చూడు" అన్నాడు.

నిమి-వశిష్ఠుడు

ఇక్ష్వాకువు పన్నెండవ కొడుకు నిమి, బలపరాక్రమాల్లో సాటి లేనివాడు. పరమ ధార్మికుడు. ఈయన గౌతమ మహర్షి ఆశ్రమానికి దగ్గరగా వైజయంతమనే నగరాన్ని నిర్మించుకుని సుఖముగా ఉన్నాడు.

ఒకప్పుడు తన తండ్రి అయిన ఇక్ష్వాకుణ్ని సంతృప్తి పరచడానికి సత్రయాగం చెయ్యాలని నిర్ణయించుకున్నాడు నిమి. ఈ యాగాన్ని జరిపించడానికి కులగురువయిన వశిష్ఠుణ్ని, అత్రి అంగిరస భృగుమహర్షుల్ని ఋత్విక్కులుగా ఉండమని ప్రార్థించాడు.

"రాజా! నన్ను ఇంతకు ముందే దేవేంద్రుడు తాను తలపెట్టిన యజ్ఞాన్ని చేయించమని అడిగాడు. అది అయిపోగానే వచ్చి నీకు ఋత్విక్కుగా ఉంటాను. అంతవరకు ఓపికపట్టు" అన్నాడు వశిష్ఠుడు.

కానీ అంతకాలం ఆగకుండా ఆయన స్థానంలో గౌతమమహర్షిని నియమించి యాగం పరిసమాప్తి చేశాడు నిమి.

ఇంద్రయాగం పూర్తికాగానే వశిష్ఠుడు వైజయంతపురానికి వచ్చి,

నిమి యజ్ఞం పరిసమాప్తం అయినట్లు తెలుసుకుని మండిపడ్డాడు. రాజు దర్శనం కోసం వెళ్ళి చాలా సేపు పడిగాపులు పడ్డాడు. కానీ నిమి గాఢ నిద్రలో ఉన్నందున ఎంత సేపటికీ ఆయన దర్శనం కాలేదు.

వశిష్ఠుడు క్రుద్ధుడయ్యాడు.

"కులగురువయిన నన్ను విడనాడి, వేరొకరిచేత యాగం చేయించు కున్నావు. పైగా నాకు దర్శనం కూడా ఇవ్వలేదు. కాబట్టి నీ శరీరము చైతన్య హీనమై పోతుంది" అని శపించాడు.

కొంత సేపటికి నిద్రలేచిన నిమి ఈ దారుణ శాపం విని "నిద్రలో ఉన్న నాకు నువ్వు వచ్చినట్లు ఎలా తెలుస్తుంది? ధర్మపరతంత్రుడనయిన నన్ను అనవసరంగా శపించావు. కాబట్టి నువ్వు కూడా చైతన్య హీనుడవై పోతావు? అని ప్రతి శాప మిచ్చాడు.

ఈ విధంగా నిమి, వశిష్ఠుడు ఇద్దరూ ఒకర్ని ఒకరు శపించుకుని, శరీరాలు త్యజించి, వాయుభూతులయినారు.

వాయురూపి అయిన వశిష్ఠుడు బ్రహ్మదేవుణ్ణి దర్శించి, ఆయన పాదాలకు ప్రణమిల్లి "పితామహా! నిమి శాపంవల్ల నా శరీరాన్ని విడిచి వాయురూపంతో తిరుగుతున్నాను. శరీరం లేకివాడు ఏ పనీ చెయ్యలేడు. నామీద దయ వుంచి ఏదైనా దేహాన్ని అనుగ్రహించు"అని వేడుకున్నాడు. దయామయుడైన ఆ ముని మాటలు ఆలకించి "వశిష్ఠా! మిత్రుడు. వరుణుడు—వీరిద్దరి తేజస్సులో ప్రవేశించి అయోనిజుడవై పుట్టు" అని చెప్పాడు.

బ్రహ్మదేవుడి ఆజ్ఞ ప్రకారం వశిష్ఠుడు వరుణాలయానికి (సముద్రానికి) వెళ్ళాడు. అప్పుడే సూర్యుడు [మిత్రుడు] కూడా అక్కడికి వచ్చాడు. అదే సమయానికి అన్నులమిన్న ఊర్వశి కూడా తన చెలికత్తెలతో వచ్చి ఆటపాటల్లో మునిగి వుంది. ఆమెను చూడగానే వరుణుడు కామపరవశుడై తన కోర్కె తీర్చమన్నాడు.

అప్పుడామె వరుణునికి అంజలి ఘటించి—"దేవా! నువ్వు ఇంతకు

ముందే సూర్యుడు వరించి పిలిచాడు. ఆయన కోసమే ఇక్కడికి వచ్చాను. నా మనస్సు నీ మీద లగ్నమై ఉన్నా శరీరాన్ని మాత్రం సూర్యునికే అర్పిస్తాను" అంది.

వరుణుడు తన మనస్సును ఆమె మీదే లగ్నంచేసి అగ్నితో సమానంగా ప్రజ్వలల్లే తన తేజాన్ని ఒక కుంభంలో విడిచి పెట్టాడు.

తర్వాత ఊర్వశి సూర్యుడి దగ్గరికి వెళ్ళింది. సంగతిని గ్రహించిన సూర్యుడు మహోగ్రుడై "నీ కోసం చాలా సేపటినుంచీ నిరీక్షిస్తున్న నన్ను లెక్క చెయ్యకుండా ఇంకొకణ్ణి వరించి దుష్టచారిణివైనావు. పైగా మనస్సొకడికి, శరీరం ఒకడికి కాబట్టి నువ్వు మానవ లోకంలో పుట్టి, కొంతకాలం అక్కడే నివశించు. బుధుని కొడుకు, కాశీరాజు అయిన పురూరవుడికి భార్యగా ఉండు" అని శపించాడు.

అంతకు ముందే తన తేజస్సును వరుణ తేజస్సున్న కడవలో ఉంచాడు సూర్యుడు. ఈ రెండు తేజస్సులూ ఉన్న కుంభంలోంచి ఇద్దరు మహర్షులు—అగస్త్యుడు, వశిష్ఠుడు—ప్రభవించారు.

నూత్న దేహంతో పుట్టిన వశిష్ఠుణ్ణి తమ కుల పురోహితునిగా వుండమని ప్రార్థించాడు ఇక్ష్వాకు మహారాజు.

వశిష్ఠునిచేత శపించబడిన నిమి కళేబరాన్ని గంధ పుష్పాదులతో అలంకరించి భద్రపరిచారు ఋత్విక్కులు. యాగం పూర్తి అయింది. దేవతలు తుష్టులైనారు.

"నిమీ! నీకు ప్రాణాన్ని యిస్తాం. కాని దేని యందు ఉంటాలో చెప్పు" అని ప్రశ్నించారు.

దానికి సమాధానంగా — "జీవులందరి కళ్ళలో ఉండాలని నా కోరిక" అన్నది నిమి యొక్క ఆత్మ.

"సరే, నువ్వు కోరుకున్నట్టుగానే అందరి కళ్ళలోనూ వాయు రూపంలో తిరుగుతుంటావు. నీకు అలసట తీరేందుకు జీవులందరూ తమ

కనురెప్పల్ని మూస్తూ వుంటారు" అని చెప్పి దేవతలు వెళ్ళిపోయారు.

ఆ తర్వాత మునులు నిమి శరీరాన్ని తెచ్చి మంత్రపూర్వకంగా దానిని అగ్నితో మధించారు. అప్పుడా శరీరం నుంచి దివ్య తేజోవిరాజితు డయిన ఒక తపశ్శాలి పుట్టాడు. మథనంవల్ల పుట్టిన కారణంగా 'మిథి' అనీ, విగతమయిన దేహంనుంచి పుట్టినవాడు కాబట్టి 'వైదేహు'డనీ ప్రసిద్ధి కెక్కాడు ఆ మహాపురుషుడు.

ఈయనే జనక వంశ మూలపురుషుడు. ఈయన నిర్మించిన నగరమే మిథిల.

(ఈ కథను సీతా పరిత్యాగానంతరం శ్రీరాముడు లక్ష్మణుడితో చెప్పాడు.)

యయాతి

ఊర్వశీ పురూరవులకు ఆయువు, ఆయువుకి నహుషుడు జన్మించారు. నహుషుని కొడుకు యయాతి. ఈయనకు అందగత్తెలయిన భార్యలు ఇద్దరు-శర్మిష్ఠ, దేవయాని. శర్మిష్ఠ వృష పర్వుడనే రాక్షసుని కూతురు దేవయాని శుక్రాచార్యుల వారి కూతురు. శర్మిష్ఠ కొడుకు పూరువు దేవయాని కొడుకు యదువు.

యాయాతికి శర్మిష్ఠమీద, పూరువుమీద ప్రేమానురాగాలు ఎక్కువ. అందువల్ల వాళ్ళతోనే ఎక్కువ కాలం గడిపేవాడు. ఇది తెలుసుకున్న యదువు తల్లి దగ్గరకువచ్చి "అమ్మా! నువ్వు పెద్ద భార్యవయినా నాన్న గారు నిన్ను ఎక్కువగా గౌరవించడంలేదు. ఈ అవమానాన్ని నువ్వెలా భరిస్తున్నావు? నేను మాత్రం భరించలేకుండా వున్నాను. మనిద్దరము అగ్నిలో దూకుదాం. అలా నీకిష్టం లేకపోతే నేను దేహత్యాగం చెయ్య డానికి సిద్ధంగా వున్నాను. అనుమతి ఇవ్వు" అన్నాడు.

కొడుకు మాటలు విని దేవయాని [illegible] వృత్తాంతం [illegible] తండ్రిని తలుచుకుంది. శుక్రుడు [illegible] దగ్గరకి వచ్చాడు.

"నా పెళ్లి నన్ను సరిగా అడుగుతున్నాడు. [illegible] శర్మిష్ఠతో కుంగిపోతున్నాను. నా కొడుకు [illegible] అనే స్త్రీతో వున్నాడు. ఇంకా నా బ్రతుకు వ్యర్థం. మాకిద్దరికీ [illegible] తప్ప వేరే మార్గం లేదు" అని తండ్రితో చెప్పుకుని కన్నీరు పెట్టింది దేవయాని.

కూతురు దైన్యాన్ని చూసి కోపోద్రిక్తుడై "ఓరీ! యయాతీ! నన్నూ, నా కూతుర్నీ యింత తేలిగ్గా చూస్తావా? ఇదే నా శాపం. ఇకమీదట నువ్వు ముసలితనంతో శరీరం కృశించిపోగా బాధపడుతూ వుండు" అని వెళ్ళిపోయాడు శుక్రుడు.

శుక్రుడిచ్చిన శాపంవల్ల యయాతి ముసలివాడైనాడు. కాని కామ సుఖాలమీద మోజుమాత్రం తీరలేదు. అందుకని దేవయాని కొడుకైన యదువుని పిలిచి-"నా ముసలితనాన్ని నువ్వు తీసుకుని నీ యౌవనాన్ని నాకివ్వు. కోరికలు తీరిన తర్వాత నా ముసలితనాన్ని తిరిగి తీసుకుంటాను" అన్నాడు.

"బాగుంది. నీకు పూరువు అంటే పంచప్రాణాలుగదా! నాకన్న అతన్నే ఎక్కువగా లాలించి, ముద్దు ముచ్చటలతో కాలం గడిపావు. నన్నెప్పుడూ ఎడమొగం పెడమొగంగానే చూశావు. కాబట్టి నీ ముద్దుల కొడుక్కే నీ ముసలితనాన్ని యిచ్చుకో" అని నిర్మొహమాటంగా చెప్పాడు యదువు.

యయాతి చేసేదిలేక పూరువుని పిలిచి అడిగాడు. దాని కతడు ఒప్పుకున్నాడు. తన ముసలితనాన్ని పూరువుకి అప్పగించి అతని యౌవనాన్ని తాను గ్రహించాడు రాజు.

ఎన్నోవేల సంవత్సరాలు ధర్మయుక్తంగా రాజ్యంచేసి అనేక సుఖాలు తృప్తిగా అనుభవించాడు. చివరికి కొడుకుని పిలిచి అతని జరాభారమంతా తాను స్వీకరించి, తన యౌవనాన్ని అతనికిచ్చి "కుమారా!

నామీద గౌరవముంచావు. నేను చాలా సంతోషించాను. నా రాజ్యానికి నిన్నే పట్టాభిషిక్తుణ్ని చేస్తాను" అన్నాడు.

అనంతరం దేవయాని కొడుకైన యదువుని పిలిచి "నువ్వు రాక్షస బుద్ధిగలవాడివి. నన్నూ, నా మాటల్నీ లెక్కచెయ్యకుండా అవమానించావు. నీకు పుట్టే సంతానమంతా రాక్షస జాతి అవుతుంది. నీ వంశంలో పుట్టిన వాళ్ళు చంద్రవంశీయులు కాకుండా, దుర్వినీతులై రాజ్యార్హత పోగొట్టుకుంటారు" అని శపించాడు.

తర్వాత పూరువుకి రాజ్యాన్ని అప్పగించి, తాను వానప్రస్థం స్వీకరించి, దీర్ఘకాలం తపస్సుచేసి స్వర్గలోకం చేరుకున్నాడు యయాతి.

పూరువు ప్రతిష్ఠాన పురాన్ని రాజధానిగా చేసుకుని కాశీరాజ్యాన్ని పాలించాడు. యదువు క్రౌంచవనం అనే పట్టణంలో నివాసం ఏర్పరచుకుని రాక్షసుల్ని కన్నాడు.

ఈ కథను రాముడు లక్ష్మణుడితో చెప్పి "చూశు. వశిష్ఠుని శాపానికి కోపగించి ప్రతిశాపమిచ్చాడు నిమి. కాని శుక్రుని శాపాన్ని యయాతి ఓర్పుతో గ్రహించాడేగాని మళ్ళీ తిరిగి శపించలేదు. కాబట్టి ఓర్పు అనేది చాలా ముఖ్యం" అన్నాడు.

లవణాసురుడు

పూర్వం కృతయుగంలో లోల అనే స్త్రీ ఉండేది. ఆమె పెద్ద కొడుకు మధువు. అతను దానవుడైనా బుద్ధిమంతుడు, సద్గుణసంపన్నుడు, ఆపదలో ఉన్న వాళ్ళని ఆదుకునేవాడు. బ్రాహ్మణ ప్రియుడు, దేవతలకి మిత్రుడు, చాలా కాలం తపస్సుచేసి ఈశ్వరుణ్ణి మెప్పించాడు. శివుడు తన శూలం లోంచి మరొక శూలాన్ని పుట్టించి మధువుకిచ్చి "నువ్వు దేవ బ్రాహ్మణుల్ని ఎదిరించకుండా ఉన్నంత కాలం ఈ శూలం నీ దగ్గ

రుంటుంది. [illegible] శత్రుఘ్నుని [illegible]" అన్నాడు.

"స్వామీ! ఈ శూలం నా వంశంలో [illegible] ఉండేట్లు అనుగ్రహించు" అంటూ ప్రార్థించాడు మధువు.

"మధూ! అలా కుదరదు. కాని నీ కొడుక్కి మాత్రం ఈ శూలం రక్షగా ఉంటుంది" అని ఈశ్వరుడు వరం ప్రసాదించాడు.

శివ వరప్రసాదంతో తిరిగి వచ్చిన మధువు మధు వనాన్ని నిర్మించుకుని, అందులో నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. అతని భార్య కుంభీనసి. వీరిద్దరికీ జన్మించాడు లవణాసురుడు! ఇతను దుష్ట బుద్ధుడు. క్రూరకర్ముడు, కొడుకు చేసే పనులు చూసి విచారించాడు మధువు. కొంత కాలం తర్వాత శివ ప్రసాదితమయిన శూలాన్ని కొడుక్కి అప్పగించి, వరుణ లోకానికి వెళ్ళిపోయాడు.

సీతా పరిత్యాగానంతరం శ్రీరాముడు ధర్మపాలన చేస్తున్న సమయంలో ఒకనాడు చాలామంది మునులు వచ్చి, లవణాసురుని వృత్తాంతమంతా చెప్పి ఇలా విన్నవించుకున్నారు.

"రామా! త్రిశూల ప్రాప్తివల్ల లవణుని అహంకారము మరింత రెట్టింపయింది. స్త్రీలనూ, మునుల్నీ బాధిస్తున్నాడు. కనిపించిన మనుష్యుల్నీ, జంతువుల్నీ తినేస్తున్నాడు. ఎందరో రాజుల్ని రక్షించమని ప్రార్థించాం. కాని లాభం లేకపోయింది! చివరకి నువ్వే సర్వ సమర్థుడివని నిశ్చయించుకుని నీ దగ్గరి కొచ్చాం. నిన్ను వేడుకుంటున్నాం మమ్మల్ని రక్షించు ప్రభూ!"

మునుల దీనాలాపాల్ని విని రాముడు తమ్ముళ్ళని పిలిచి "మీలో ఎవరు లవణ సంహారం చేస్తారు?" అని అడిగాడు.

వెంటనే భరతుడు ముందుకొచ్చాడు. కాని శత్రుఘ్నుడు కలుగ చేసుకుని "అన్నా! నువ్వు అరణ్యవాసంచేసి అయోధ్యకు తిరిగి వచ్చే

వరకూ భరతుడు అనేక కష్టాల పాలయ్యాడు. తాను కూడా వనవాస జీవితమే అనుభవించాడు. కాబట్టి అయన్ని సుఖంగా ఉండ నివ్వండి. లవణాసురుణ్ని నేను సంహరిస్తాను. నన్ను దీవించి పంపండి" అన్నాడు.

శత్రుఘ్నుడి మాటలకి రాముడు సంతోషించి "తమ్ముడూ! నువ్వు నిజంగానే ఈ కార్యం చెయ్యడానికి సమర్థుడివి. అస్త్రవిద్యలో అసమాన పరాక్రమం కలవాడివి! నువ్వు వెళ్ళి రాక్షసుణ్ని చంపి, అతని రాజ్యాన్ని కైవసం చేసుకుని ధర్మయుక్తంగా పాలించుకో. నిన్ను ఇప్పుడే మధు పురానికి పట్టాభిషిక్తుణ్ని చేస్తాను" అన్నాడు రాముడు.

"అన్నా! నీ ఆజ్ఞ ప్రకారం లవణ సంహారం చేస్తాను. కాని అన్న లుండగా నేను మధుపురాన్ని ఏలడం సమంజసం కాదు. అయినా నువ్వు చెప్పింది చెయ్యడమే నా కర్తవ్యం" అని వినమ్రుడైనాడు శత్రుఘ్నుడు.

మహా వైభవోపేతంగా జరిగిన పట్టాభిషేకం తర్వాత శత్రుఘ్నుడు దేవ సైన్యానికి ఆధిపత్యం వహించిన కుమారస్వామి లాగా దివ్య తేజంతో ప్రకాశించాడు. ఈ ఉత్సవాన్ని కౌసల్య, సుమిత్ర, కైకేయి, పురజనులు, మహర్షులు చూసి ఆనందించారు. మంగళా శాసనం చేశారు.

అప్పుడు తమ్ముణ్ని చూసి మృదు వచనాలతో ఇలా అన్నాడు రాముడు. "శత్రుఘ్నా! ఇదుగో ఈ దివ్యబాణం తీసుకో. ప్రళయకాలంలో విష్ణువు సముద్రంలో శయనించే సమయంలో మధుకైటభుల్ని చంపడానికి దీన్ని సృష్టించాడు. అతిలోక భయంకరమైన యీ బాణాన్ని నేను రావణునిమీద కూడా ప్రయోగించలేదు. తమ్ముడూ! శివదత్తమయిన త్రిశూలం ఒకటుంది యీ రాక్షసుడి దగ్గర. అతను దాన్ని నిరంతరమూ పూజిస్తాడు. అది అతని చేతిలో ఉన్నంతకాలం వాడికి తిరుగులేదు. కాబట్టి అతను త్రిశూలాన్ని ఇంట్లో వదలిపెట్టి పట్టణానికి దూరంగా వెళ్ళినప్పుడే సంహరించాలి."

తమ్ముడికి ఈ విధంగా లవణ వధోపాయం చెప్పి, ఇంకా యిలా హితబోధలు చేశాడు రాముడు.

"నాలుగువేల గుర్రాల్ని, రెండువేల రథాల్ని, వంద ఏనుగుల్ని, భట సమూహాల్ని తోడుగా తీసుకెళ్ళు. కావలసినంత ఆహార సామగ్రిని, ధన కనక వస్తు వాహనాల్ని తీసుకెళ్ళు. నీ సైనికుల్ని, భృత్యుల్ని ఎప్పుడూ సంతోషపెడుతూ ఉండు. వర్షాకాలం రాక్షస సంహారానికి అనువుగా వుంటుంది. యీ లోపల నీ సైన్యము గంగానదిని దాటేటట్లు చూసుకో. యీ మునుల్ని అనుసరించే నీ సైన్యం వుండాలి! నువ్వు ఒక్కడివే ధనుర్బాణాలు ధరించి లవణునిమీదకి వెళ్ళు. తనమీద నువ్వు యుద్ధానికి వస్తున్నట్లు వాడికి తెలియకూడదు!"

రాముడు చెప్పినట్లు తన సైన్యాన్ని ముందుగా పంపించాడు శత్రుఘ్నుడు. నెలరోజుల తరువాత తాను అందరివద్దా సెలవు తీసుకుని బయలుదేరాడు. రెండు రోజులకు వాల్మీకి ఆశ్రమం చేరుకుని, ఆ ముని ఇచ్చిన ఆతిథ్యం స్వీకరించి, ఆ రాత్రి అక్కడే గడిపాడు.

అదేరోజు రాత్రి సీత ఇద్దరు బాలకుల్ని ప్రసవించింది. వాల్మీకి సంతోషించి, దర్భల్ని తెచ్చి రెండు భాగాలుగా మధ్యకు విరిచి, పై భాగంతో [కుశాగ్రాలతో] ఒకడికీ, క్రింది భాగంతో [లవాలతో] ఒకడికీ మంత్ర పూర్వకంగా రక్షాక్రియలు నిర్వర్తించి, కుశలవులు అని వాళ్ళకి నామకరణం చేశాడు.

ఆనందప్రదమైన ఈ వార్త తెలియగానే శత్రుఘ్నుడు సీతను దర్శించి, నమస్కారంచేసి, కుశల ప్రశ్నలు వేశాడు.

తెల్లవారగానే లేచి వాల్మీకి మహర్షి దగ్గర సెలవు తీసుకుని, ఏడు రోజులు ప్రయాణంచేసి, యమునా నదిని దాటి చ్యవనాశ్రమానికి వెళ్లాడు! ఆ రాత్రి అక్కడే విశ్రమించి, మర్నాడు మధుపురం చేరుకున్నాడు.

ఆ రోజు పొద్దున్నే మధువు ఆహారం కోసం పట్టణం విడిచిపెట్టి, అడవికి వెళ్ళి మధ్యాహ్నానికల్లా తిరిగి వచ్చాడు.

పట్టణ ద్వారానికి అడ్డంగా ధనుర్బాణాలు ధరించి నిలబడిఉన్నాడు శత్రుఘ్నుడు.

"ఎవర్రా నువ్వు? ఆయుధపాణివై నిలబడ్డావు. నా తడాఖా నీకు తెలియదేమో! నీలాంటి వాళ్ళు ఎందరో నాకు ఆహారమై పోయినారు" విస్మితంగా నవ్వాడు లవణుడు.

"నేను దశరథ పుత్రుణ్ణి. శ్రీరాముని తమ్ముణ్ణి, నన్ను శత్రుఘ్నుడంటారు. నీతో యుద్ధం కోసం వచ్చాను" గంభీరంగా అన్నాడు రాఘవుడు.

"నా మేనమామ రావణుణ్ణి చంపిన వాడి తమ్ముడివా నువ్వు! అయితే నీ కోరిక తప్పకుండా తీర్చాలి. కొంచెం ఉండు. నా ఆయుధాన్ని తెచ్చుకుంటాను" అక్కడి నుంచి కదలబోయాడు మధువు.

"ఎదుట పడిన శత్రువుని తెలివితక్కువగా విడిచిపెట్టడు యీ శత్రుఘ్నుడు. చూడు ఇప్పుడే నా బాణాలతో నిన్ను యమలోకానికి పంపిస్తాను" పౌరుషం ప్రదర్శించాడు సౌమిత్రి.

శత్రుఘ్నుడి మాటలకు లవణుడు క్రోధంతో తాండవించాడు. భయంకరంగా అరిచాడు. యుద్ధానికి రమ్మని మాటిమాటికీ సవాలుచేశాడు.

రాఘవుడు ఏ మాత్రం చలించకుండా- "దురాత్మా! ఆనాడు మా చేతిలో చచ్చిపోయిన రావణుణ్ణిచూసి దేవతలూ, స్త్రీలూ ఆనందించారు. యీనాడు నాతో చచ్చిపోయే నిన్ను చూసి మునులు, పౌరులు సంతోషిస్తారు. చూడు వజ్రసమానమైన నా బాణాలు సూర్యకిరణాలు పద్మంలోకి చొరపడ్డట్లుగా నీ గుండెల్లోకి దూసుకుపోతాయి" అంటూ బాణాలు సంధించాడు.

లవణుడు కోపంతో చెట్లుపీకి రాఘవుని మీదికి విసిరాడు. వాటిని మధ్యలోనే ఖండించాడు శత్రుఘ్నుడు. వీళ్ళిద్దరి మధ్య హోరాహోరీ యుద్ధం జరిగింది.

ఆ సమయంలో మంచి అవకాశం చూసుకుని రాక్షసుడు ఒక చెట్టు పీకి బలంగా కొట్టాడు. శత్రుఘ్నుడి తలమీద, దానితో ఆయన స్పృహ తప్పి పడిపోయాడు కాని అప్పుడు తన శూలాన్ని తెచ్చుకోవాలనే బుద్ధి

పుట్టలేదు లవణుడికి. శత్రువు దొరక్కపోవటానికి అనుకుని, తెచ్చుకున్న ఆహారం తినటం మొదలు పెట్టాడు.

ఇంతలో శత్రుఘ్నుడు లేచాడు. రాముడిచ్చిన దివ్య బాణాన్ని సంధించాడు. అది గొప్ప తేజస్సుతో వెలిగిపోతోంది.

భూతగణాలన్నీ కంపించాయి. దేవతలు భయభ్రాంతులై బ్రహ్మ దేవుడి దగ్గరికి వెళ్ళి మొరపెట్టుకున్నారు. బ్రహ్మ వాళ్ళని ఊరడించి, భయాన్ని తొలగించాడు.

యుద్ధాన్ని చూడటానికి వచ్చిన దేవతలతో ఆకాశం నిండిపోయింది.

ఒక్కపెట్టున సింహనాదంచేసి దివ్యబాణాన్ని లవణుడి మీద ప్రయోగించాడు శత్రుఘ్నుడు. ఆ బాణం రాక్షసుడి గుండెలోంచి దూసుకుపోయి, పాతాళానికి వెళ్ళి తిరిగి వచ్చి, శత్రుఘ్నుడి అమ్ముల పొదిలోకి ప్రవేశించింది.

వజ్రపు దెబ్బతో కూలిన పర్వతంలాగా లవణుడు పడిపోయాడు. అతని ఆధీనంలో ఉన్న త్రిశూలం ఈశ్వరుణ్ణి చేరుకుంది.

శత్రుఘ్నుడి మీద పూలవాన కురిసింది. దేవతలు సంతోషించారు. ప్రజలు ఆనందించారు. ఋషులు ఆశీర్వదించారు. గంధర్వులు పాటలు పాడారు. అప్సరసలు ఆడారు. అగ్ని, ఇంద్రుడు మొదలయిన దేవతలు వచ్చి, సౌమిత్రిని అభినందించి వరం కోరుకోమన్నారు.

వాళ్ళకి వినయంతో నమస్కారం చేసి "ఈ మధుపురం మనోజ్ఞంగా ఉంది. దీన్ని నాకు నివాస యోగ్యంగా ఉండేటట్లు చెయ్యండి" అని ప్రార్థించాడు శత్రుఘ్నుడు. అలాగే అనుగ్రహించి వెళ్ళిపోయారు దేవతలు.

గంగాతీరాన విడిసి వున్న సైన్యం తమ ప్రభువుయొక్క విజయ వార్త విని మధుపురం చేరుకుంది.

రమ్యమయిన ఉద్యాన వనాలతోనూ, విశాలమయిన వీధులతోనూ, అందమైన హర్మ్యాలతోనూ అమరావతి లాగా తయారయిన మధుపురాన్ని ఇంపుగా పాలించాడు శత్రుఘ్నుడు.

శ్వేతుడు

ఒకప్పుడు త్రేతాయుగంలో అతివిశాలమైన అరణ్యం ఒకటి ఉండేది. అందులో జనసంచారం ఉండేది కాదు. పశు పక్ష్యాదులు కూడా లేవు. ఫల పుష్ప సమన్వితమయి మనోహరంగా ఉన్న ఆ అరణ్యములో తపస్సు చేసుకోవాలనే కోరిక పుట్టింది అగస్త్య మహర్షికి.

ఆ అడవి మధ్య పెద్ద సరస్సొకటి ఉంది. అది నిర్మలమైన నీళ్ళతోను, హంసలు మొదలైన పక్షులతోను, పద్మాలు, కలువలు మొదలైన పుష్పాలతోను చూడముచ్చటగా ఉండేది. దాని ఒడ్డున ఒకఆశ్రమం ఉంది. అందులో మహర్షు లెవరూ నివసించడంలేదు.

అగస్త్య మహర్షి ఒకనాటిరాత్రి ఈ ఆశ్రమంలో విశ్రమించాడు. మర్నాడు ఉదయం లేచి ఆ సరస్సును సమీపించాడు. అందులో ఒక శవం కనిపించింది ఆయనకి. ఆశ్చర్యంతో చూస్తున్నాడు దాన్ని. అంతలో అక్కడికో విమానం వచ్చింది. అప్సరసలచేత సేవింపబడుతూ ఉన్న దివ్యపురుషు డొకడు విమానం దిగి వచ్చి శవ మాంసం తిని మళ్ళీ విమానము ఎక్కబోతున్నాడు.

"అయ్యా! మీరు దివ్యపురుషుల్లాగా ఉన్నారు. ఈ శవ మాంసం తినడానికి కారణమేమిటి"? అని ప్రశ్నించాడు అగస్త్యుడు.

అప్పుడా దివ్యపురుషుడు తన వృత్తాంతాన్ని ఇలా చెప్పాడు.

"మహర్షీ! విదర్భ దేశాన్ని సుదేవుడనే రాజు పాలించేవాడు. ఆయనకి యిద్దరు భార్యలు. పెద్ద భార్య కుమారుణ్ని నేను. నా పేరు శ్వేతుడు. చిన్న భార్య కొడుకు సురథుడు. మా తండ్రి తర్వాత నేను రాజ్యాన్ని పాలించాను చాలాకాలం. తర్వాత నా ఆయుః ప్రమాణం తెలుసుకుని, రాజ్యాన్ని తమ్ముడికి వప్పగించి, నేను ఈ అరణ్యానికి వచ్చేశాను. ఈ సరస్సు తీరాన దీర్ఘకాలం తపస్సు చేసి బ్రహ్మ లోకానికి వెళ్ళాను. ఆకలి దప్పులు లేని ఆ లోకంలో నన్ని రెండూ పీడించి పెట్ట

లేదు. అప్పుడొస్తాను. "స్వామీ! [illegible] [illegible]" [illegible]
బ్రహ్మను అడిగాను.

"నువ్వు [illegible] [illegible] [illegible] [illegible] [illegible]
చేసుకున్నావు. [illegible] [illegible] [illegible] [illegible]
ఆకలి దప్పులు నిన్ను వదలవు. నీ [illegible] మాంసమే [illegible] ఆహారం.
అది తింటూ వుండు. కొంతకాలమైన తర్వాత అగస్త్యుడొస్తాడు. ఆయన
మహామహిమోపేతుడు. ఆయన వచ్చి[illegible] [illegible] పని వుండదు. నిన్ను
ఆయనే ఉద్ధరిస్తాడు" అని సెలవిచ్చాడు.

"అప్పటినుంచీ నేను ప్రతిదినం ఇక్కడికి వచ్చి నా శరీరంలోని
మాంసం తింటున్నాను. అది తరగడంలేదు. ఆకలి దప్పులు కూడా అలాగే
వున్నాయి. మహానుభావా! ఈ దివ్యమైన ఆభరణం తీసుకో. ఇది చాలా
మహిమ గలది. సకల సంపదలూ సమకూర్చి పెడుతుంది. దీన్ని స్వీక
రించి నా ఆకలి బాధను పోగొట్టి హేయమైన శవమాంస భక్షణం నుంచి
నాకు విముక్తి కలిగించు" అంటూ ప్రార్థించాడు.

ఈ కథ విని అగస్త్యుడు జాలిపడ్డాడు. శ్వేతుణ్ని ఉద్ధరించాలనే
ఉద్దేశంతో ఆభరణం తీసుకున్నాడు. వెంటనే అక్కడి శవం మాయమై
పోయింది. శ్వేతుడికి ఆకలి దప్పులు మటు మాయమైనాయి. ఆయన పర
మానందంతో బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు.

(తన ఆశ్రమానికి వచ్చిన రాముడికి అగస్త్యుడు ఈ కథను విని
పించాడు)

దండకారణ్యం

పూర్వం మనువు భూమిని పాలించాడు. ఆయన పెద్ద కొడుకు
ఇక్ష్వాకువు. కొడుక్కి పట్టంకట్టి "నాయనా! నువ్వు వంశ కర్తవు అవు
తావు. ధర్మం తప్పకుండా రాజ్యం చెయ్యి. ప్రజల్ని శాస్త్ర సమ్మతంగా

శాసించు. శిక్షాస్మృతిని చక్కగా పాటించు" అని రాజనీతిని బోధించి స్వర్గస్థుడైనాడు మనువు.

ఇక్ష్వాకుడికి వందమంది కొడుకులు. అందరిలోకి చిన్నవాడు దండుడు. ఇతనికి విద్యాగంధం అబ్బలేదు. ఒట్టి మూర్ఖుడు. మొండివాడు. ఇతని గుణాలు నచ్చక వింధ్య పర్వతాల మధ్యనున్న రాజ్యాన్ని ఇచ్చి పంపేశాడు తండ్రి. అక్కడే మధుమంతమనే సుందరమైన నగరాన్ని నిర్మించుకుని, శుక్రాచార్యుల్ని పురోహితుడుగా చేసుకుని ఏలిక అయినాడు దండుడు.

ఒకమాటు దండుడు శుక్రాచార్యులవారి ఆశ్రమానికి వెళ్ళాడు. అది చైత్రమాసం. వసంతశోభ రమణీయంగా ఉంది. ఆశ్రమ వనంలో విహరిస్తోంది అందాలరాశి, శుక్రుని కూతురు అయిన అరజ. దండుడు ఆమెను చూసి మన్మథ బాణాగ్ని తప్తుడైనాడు.

"కోమలీ! నువ్వెవరిని? మూర్తీభవించిన రతిలాగా ఉన్నావు?" ఆమెను సమీపిస్తూ అన్నాడు దండుడు.

అతని ఆంతర్యాన్ని గ్రహించిన ఆమె "రాజా! నేను మహాతపశ్శక్తి సంపన్నుడైన శుక్రాచార్యులవారి పెద్దకూతుర్ని. నువ్వు నా తండ్రి అనుమతి లేకుండా నన్ను చేపట్టరాదు. ఆయన్ని అడుగు. ఆయన అంగీకరిస్తే నన్ను స్వీకరించవచ్చు. లేకపోతే నా తండ్రి శాపానికి బలిఅయిపోతావు" అని వినయంగా చెప్పింది.

దండుడు రెండు చేతులూ జోడించి "సుందరీ! నన్ను దయచూడు. నా మనస్సంతా నీ అధీనమైపోయింది. ఏది ఏమైనా నేనింకా ఆగలేను. నీ పొందుకోసం ఎన్ని కష్టాలైనా అనుభవిస్తాను" అంటూ మితిమీరిన తమకంతో బలాత్కరించి తన పట్టణానికి వెళ్ళిపోయాడు.

అరజ తనకు జరిగిన అన్యాయానికి ఆక్రోశిస్తూ తండ్రి కోసం ఎదురుచూస్తూ వుంది.

కొంతసేపైన తర్వాత శిష్య సమేతంగా ఇంటికి వచ్చాడు శుక్రుడు.

దీనవదనంతో కనిపిస్తున్న కూతుర్ని చూశాడు. అసలే ఆవేశంలో ఉన్నాడు. దానికితోడు కూతురికి జరిగిన అవమానాన్ని తెలుసుకున్నాడు. కోపంతో మండిపడ్డాడు.

శిష్యుల్ని చూస్తూ "చూడండి దండుడు ఎలాంటి నీచ స్థితికి దిగజారి పోయాడో! వీడికి పోయేకాలం వచ్చింది. గురుద్రోహం చేసిన ఈ దుర్మార్గుడికి ఇదే నా శాపం. ఇవాల్టి నుంచి ఏడురోజులు అయేసరికి వీడి రాజ్యం సర్వం నాశనమైపోతుంది. మట్టి వాన ఏడు రోజులు కురుస్తుంది. రాజు, వాడి పరివారం, చతురంగబలాలు అన్నీ నశిస్తాయి" అని శపించి, ప్రజలందర్నీ దేశాన్ని విడిచి వెళ్ళిపొమ్మని హెచ్చరించాడు. అలాగే వాళ్ళంతా దండు రాజ్యాన్ని ఖాళీచేసి వెళ్ళిపోయారు.

తర్వాత కూతుర్ని చూసి—"ఒక యోజనం మేర వ్యాపించిన ఈ సరస్సు దగ్గరే కాలం గడుపుకో. నా శాపంవల్ల కలిగే దుమ్ము వానవల్ల ఈ సరోవర ప్రాంతంలోని జంతు జాలానికిగాని, పశుపక్ష్యాదులకుగాని ఏ అపకారమూ జరగదు" అన్నాడు శుక్రుడు.

శుక్రశాప ప్రభావంవల్ల దండుడి రాజ్యం బూడిద పాలైంది. అది ఏ ప్రాణికి నివాసయోగ్యం కాకుండా పోయింది. అప్పటినుంచీ దీనికి "దండకారణ్యం" అనే పేరు వచ్చింది.

(ఈ కథను ఇలా అగస్త్యుడు రాముడికి వినిపించాడు తన ఆశ్రమంలో)

వృత్రాసురుడు

పూర్వం 'వృత్రుడు' అనే రాక్షసుడు భూమిని పాలించేవాడు. అతను గొప్ప బలవంతుడు, సత్యశీలుడు, ధర్మజ్ఞుడు, బుద్ధిమంతుడూ, వినయ

మూర్తి. మూడు లోకాల్నీ స్నేహ దృష్టితో చూసేవాడు. అతని పాలనలో దేశమంతా సుభిక్షంగా ఉండేది. ప్రజలు సర్వసంపదలతో, పాడిపంటలతో తులతూగేవారు.

అటువంటి వృత్రుడికి తపస్సు చెయ్యాలనే కోరిక కలిగింది. కొడుక్కి రాజ్యాన్ని అప్పగించి తాను తపస్సుమొదలుపెట్టాడు. ఇంద్రుడు భయపడిపోయాడు. అసమాన పరాక్రమం గల ఈ వీరుడు తపశ్శక్తితోడైతే లోకభీకరుడై అన్ని లోకాల్నీ తన వశం చేసుకుంటాడు. అప్పుడు అతన్ని నిర్జించడం కష్టమౌతుందనీ అనుకుని, దేవతల్ని 'తన వెంటబెట్టుకుని విష్ణుమూర్తి దగ్గరికి వెళ్ళి మొరపెట్టుకున్నాడు.

"ధర్మగుణ శోభితుడైన వృత్రుణ్ని నేను చంపను. కానీ దేవతల శ్రేయస్సుని దృష్టిలో పెట్టుకుని నా తేజస్సుని మూడు భాగాలుగా చేసి, ఒక భాగం నీలోను, రెండవభాగం నీ వజ్రంలోను, మూడవభాగం భూమిలోను ప్రవేశపెడతాను. అప్పుడతన్ని నువ్వు చంపగలవు" అని చెప్పి ఇంద్రుణ్ని పంపించేశాడు విష్ణువు.

విష్ణువు అంశను పొందిన దేవేంద్రుడు వృత్రుడు తపస్సు చేసుకుంటున్న అరణ్యానికి వెళ్ళి దివ్యతేజస్సుతో విరాజిల్లే అతని శిరస్సును తన వజ్రంతో నరికేశాడు. కాని అతనికి బ్రహ్మ హత్యాపాతకం చుట్టుకుంది. అతను తెలివి తప్పి పడిపోయాడు. ప్రపంచం అల్లకల్లోలమైంది. భూమి నిస్సారమైంది. వర్షాలు లేవు. నదులు యెండిపోయాయి.

అటువంటి పరిస్థితిలో దేవతలు అగ్నిదేవుణ్ని ముందు పెట్టుకుని విష్ణువు దగ్గరికి వెళ్ళి "దేవదేవా! విశ్వేశ్వరా! నీ ఆనతి ప్రకారమే ఇంద్రుడు వృత్రాసురుణ్ని సంహరించాడు. కాని బ్రహ్మహత్య అతన్ని ఆవరించింది. దీనినుంచి ఇంద్రుడికి విముక్తి కలిగించు" అని ప్రార్థించారు.

దేవతల మొరలు ఆలకించి, హరి పలికి "ఇంద్రుడిచేత నన్ను ఆవాహనం చేయించి అశ్వమేధయాగం జరిపించండి. అప్పుడతనికి బ్రహ్మ హత్య తొలగిపోతుంది. తిరిగి యింద్ర పదవి లభిస్తుంది" అని చెప్పాడు దేవతలతో.

విష్ణుదేవుని ఆనతి ప్రకారం దేవతలు ఇంద్రుడిచేత అశ్వమేధ క్రతువును సక్రమంగా పూర్తి చేయించారు. వెంటనే బ్రహ్మ హత్య ఇంద్రుణ్ని వదిలి "నా కిప్పుడు స్థానం ఎక్కడ?" అని దేవతల్ని అడిగింది.

ముందు నాలుగు భాగాలు తమ్మన్నారు వాళ్ళు బ్రహ్మ హత్యని. అలాగే అయి నాలుగు స్థలాలు కోరుకుంది. తాను వుండడానికి—ఒక భాగంతో నాలుగు నెలలు నిండుగా ప్రవహించే నదుల్లో ఉండేటట్లు, రెండవ భాగంతో భూమిలో యెప్పుడూ వుండేటట్లు, మూడవ భాగంతో రజస్వలయిన స్త్రీలలో ఉండేటట్లు, నాలుగో భాగంతో బ్రాహ్మణ హింస చేసేవాళ్ళలో ఉండేటట్లు. దీనికి సమ్మతించారు దేవతలు.

బ్రహ్మహత్య వీడిన ఇంద్రుడు పూర్వపు వైభవంతో తన పదవిని స్వీకరించాడు.

అశ్వమేధయాగం యొక్క గొప్పదనాన్ని పైవిధంగా వివరించి, రాజసూయ యాగ ప్రయత్నం మాని అశ్వమేధం చెయ్యమని లక్ష్మణుడు రాముడికి సలహా ఇచ్చాడు.

ఇళుడు

మునుపు కర్దమ ప్రజాపతికి ఇళుడు అనే కొడుకుండేవాడు. అతను బాహ్లిక దేశానికి రాజు. ధర్మబద్ధంగా భూమి నేలిన మహా పరాక్రమవంతుడు. అసమానమయిన కీర్తిని గడించినవాడు. ప్రజల్ని కొడుకుల్లాగా చూసుకునేవాడు. దేవతలు, రాక్షసులు, యక్షులు, గంధర్వులు, నాగులు మొదలయినవాళ్ళు అతన్ని గౌరవించేవాళ్ళు.

వెళ్ళి, ఇళ యొక్క చెలికత్తెల్ని పిలిచి విషయమంతా తెలుసుకున్నాడు. "ఇకనుంచీ మీరందరూ కింపురుష స్త్రీలై ఈ కొండ ప్రాంతాల్లో సుఖంగా నివాసముండండి. మిమ్మల్ని పెళ్ళిచేసుకున్నవాళ్లు కింపురుషులౌతారు" అన్నాడు.

తర్వాత ఇళను సమీపించి – "నిన్ను ప్రేమిస్తున్నాను. నన్ను దయతో స్వీకరించు" అని అడిగాడు. ఆమె ఒప్పుకున్నది. చైత్రమాసమంతా కామకేళీ విలాసాల్లో మునిగిపోయారు వాళ్ళిద్దరూ.

ఆ నెల గడచిన తర్వాత ఇళ పురుషుడిగా మారింది. పూర్వం ఏం జరిగిందో గుర్తులేదు.

నిద్రనుంచి మేలుకుని సరస్సు దగ్గరికి వెళ్ళి, నీటిలో నిలబడి తపస్సు చేసుకుంటున్న బుధుణ్ణి సమీపించి "మహాత్మా! నేను నా పరివారముతో సహా అడవికి వచ్చాను. కాని వాళ్ళిప్పుడు కనిపించడంలేదు. ఎటు వెళ్ళారు?" అని అడిగాడు.

దానికి బుధుడు "రాజా! నీ వాళ్ళందరూ వడగండ్ల వానలో చచ్చిపోయారు. నువ్వు మాత్రం నా ఆశ్రమంలో నిద్రపోయావు. ఇప్పుడు విచారించి లాభంలేదు. ఇక్కడే హాయిగా ఉండు" అన్నాడు.

"మునివర్యా! నా వాళ్లు లేని రాజ్యం నాకెందుకు? శశిబిందుడనే నా పెద్దకొడుక్కి రాజ్యభారాన్ని అప్పగిస్తాను" ఇళుడు విచారంతో కుంగిపోతూ అన్నాడు.

"రాజా! ధైర్యంగా ఉండు. ఒక్క సంవత్సరంపాటు యిక్కడే కాలం గడుపు. తర్వాత నీకు మంచి జరిగేటట్లు చేస్తాను" అని ఆయన్ని ఒప్పించాడు బుధుడు.

మళ్ళీ నెల గడవగానే స్త్రీగా మారిపోయాడు ఇళుడు. ఆ నెలంతా ఇళా బుధులు దివ్యసుఖాలు అనుభవించారు. యీ విధంగా గడుపుతూ తొమ్మిదవ నెలలో పురూరవుడనే కొడుకును ప్రసవించింది ఇళ.

పన్నెండో నెలలో ఇళుడు పురుషుడుగా వున్నాడు. అప్పుడు సంవర్తుడు, చ్యవనుడు, అరిష్టనేమి, దూర్వాసుడు మొదలైన మహర్షుల్ని పిలిపించి "కర్దమ ప్రజాపతి పుత్రుడయిన ఇళుని సంగతి మీకందరికీ తెలిసిందే. అతన్ని కరుణించి శాశ్వతంగా పురుషుడుగా ఉండేటట్లుచెయ్యండి" అని ప్రార్థించాడు బుధుడు.

ఈ లోపలే కర్దమ ప్రజాపతి కూడా అక్కడికి వచ్చాడు. వీళ్ళందరూ కలిసి ఆలోచించి ఇళుడిచేత శివప్రీతి కోసం అశ్వమేధయాగాన్ని చేయించారు. యాగానంతరం ఈశ్వరుడు ప్రత్యక్షమై ఇళుడికి శాశ్వతమైన పురుషత్వాన్ని ప్రసాదించాడు.

ఇళుడు బాహ్లిక దేశానికి తన కొడుకైన శశిబిందుణ్ని రాజుగా చేసి, తాను మధ్య దేశంలో ప్రతిష్ఠానమనే పురానికి అధినేతగా వుండి చాలాకాలం రాజ్యంచేసి, చివరకు పుణ్యలోకాలను చేరుకున్నాడు. ఆయన తర్వాత పురూరవుడు రాజైనాడు.

[అశ్వమేధ మాహాత్మ్యాన్ని చెప్పే ఈ కథని రాముడు లక్ష్మణ భరతులకు చెప్పాడు.]

శ్రీరాముని అశ్వమేధం

ఒకనాడు రాముడు భరత, లక్ష్మణుల్ని పిలిచి "సర్వపాపహరం, ఇహపర సుఖదాయకం, ధర్మప్రవర్తకం అయిన రాజసూయ యాగాన్ని చెయ్యాలనే ఆలోచన నాకు కలిగింది. పూర్వం ఈ యాగాన్ని చేసిన సూర్యుడు, చంద్రుడు, వరుణుడు దిగంత కీర్తి విఖ్యాతులైనారు. యీ విషయం బాగా ఆలోచించి మీ అభిప్రాయాలు చెప్పండి" అని అడిగాడు.

అప్పుడు భరతుడు అన్నగారికి అంజలి ఘటించి— "ప్రభూ! నీ పాలనలో ధర్మదేవత చక్కగా నడుస్తోంది. కీర్తి నిన్ను ఆశ్రయిం

బింది. రాజన్యులందరూ నిన్ను గౌరవిస్తున్నారు. ప్రజలు నిన్నే తండ్రిగా చూసుకుంటున్నారు. ఈ భూమిమీదగల ప్రాణులన్నింటికీ నువ్వే గతివి. ఆశ్రయుడివి. నీ పాలనలో దుష్టులు, పాపకర్ములు అయిన రాజులు లేరు. రాజసూయంవల్ల రాజవంశాలు అనేకం నేలమట్టమౌతాయి. కాబట్టి రాజసూయం అవసరమని నేను భావిస్తున్నాను" అని చెప్పాడు.

"రాజసూయం బదులు అశ్వమేధయాగం చేస్తే మంచిది. పూర్వం ఇంద్రుడు ఈ యాగంచేసి వృత్రాసుర వధవల్ల కలిగిన బ్రహ్మహత్యా పాతకాన్ని పోగొట్టుకున్నాడు" అని తన అభిప్రాయాన్ని తెలియజేశాడు లక్ష్మణుడు.

సోదరుల మాటలు విని రాముడు సంతోషించి పూర్వం ఇళుడు కూడా అశ్వమేధయాగం చేసి శాశ్వతమయిన పురుషత్వాన్ని పొందిన సంగతి గుర్తుచేసుకుని, అశ్వమేధమే చెయ్యాలని నిశ్చయించుకుని, దానికి కావలసిన ఏర్పాట్లు చేయించమని తమ్ముళ్ళని ఆదేశించాడు.

వెంటనే యాగ ప్రయత్నాలు మొదలయినాయి. అందరికీ ఆహ్వానాలు పంపబడ్డాయి. అందులో సుగ్రీవుడు, విభీషణుడు, వివిధ దేశాధిపతులు, మునులు, నటులు, గాయకులు మొదలయిన వాళ్ళున్నారు.

నైమిశారణ్యంలో గోమతి నదీతీరాన యజ్ఞవాటిక నిర్మింపబడింది. సమస్త వైభవోపేతంగా యాగం జరిగేందుకు విస్తృతంగా ఏర్పాట్లు జరిగాయి. యాగానికి చూడ్డానికి వచ్చే వాళ్ళ కోసం అన్ని సౌకర్యాలు సమకూర్చబడ్డాయి.

మంచి లక్షణాలు కలిగి నల్లని దేహకాంతితో ప్రకాశించే అశ్వాన్ని అర్చించి రాముడు వదలిపెట్టాడు. రక్షకుడుగా దాని వెంట లక్ష్మణుడు ఋత్విజులతో సహా బయలుదేరి వెళ్ళాడు.

తరువాత రాముడు యజ్ఞ వాటికలో ప్రవేశించాడు. రాజు లందరూ ఆయనకు కానుకలు సమర్పించారు. భరత శత్రుఘ్నులు ఆహూతులందర్నీ యథోచితంగా సత్కరించారు. యాచకులకు దానధర్మాలు చేశారు. ఏది

కోరితే అది యిచ్చారు. యాగం సంవత్సరంపాటు జరిగింది. దీన్ని మెచ్చుకోని వాళ్ళు లేరు.

యాగం నిర్విఘ్నంగా, సర్వశోభాయమానంగా జరుగుతున్నప్పుడు వాల్మీకి మహర్షి శిష్యసమేతంగా విచ్చేశాడు. భరత శత్రుఘ్నులు ఆయన కోసం సర్వసౌకర్యాలతో కూడిన పర్ణశాల నొకదాన్ని విడిదిగా యేర్పాటు చేశారు.

విడిదిలో చేరిన అనంతరం వాల్మీకి కుశలవుల్ని పిలిచి యిలా అన్నాడు. "మీరు రేపటి నుంచి నేను నేర్పిన రామాయణాన్ని రాజమార్గాల్లోనూ, మునివాసాల్లోనూ, యజ్ఞవాటిక దగ్గరా, రాముని మందిరం వద్ద శ్రావ్యంగా, శ్రుతి లయబద్ధంగా, మంచి స్థాయిలో మధురంగా రోజుకి ఇరవై సర్గల చొప్పున పాడండి. ఫలాలు, దుంపలు మాత్రమే తినండి. ఎవరి దగ్గరా డబ్బు కోసం ఆశపడకండి. డబ్బుతో మనకి పనిలేదు. 'మీరు ఎవరి కొడుకులు?' అని ఎవరయినా అడిగితే—'వాల్మీకి శిష్యులం' అని మాత్రమే చెప్పండి. ప్రభువయిన శ్రీరాముణ్ని ఏ మాత్రం చులకనగా చూడకండి."

మర్నాడు ఉదయం కుశలవులు వాల్మీకికి నమస్కారం చేసి, ఆయన ఆశీర్వాదం స్వీకరించి, రామాయణ గానం మొదలు పెట్టారు. రాముడు ఆ గానం విన్నాడు. అపరిమితమైన ఆనందాన్ని అనుభవించాడు.

యజ్ఞకర్మ పూర్తికాగానే ఒక సభను ఏర్పాటు చేశాడు. ఆ సభలో మునులు, రాజులు, పండితులు, సంగీత విద్వాంసులు, భాషాకోవిదులు, వేదవేత్తలు, సకల విద్యా పారంగతులు మొదలైనవాళ్ళు ఆసీనులైనారు.

అప్పుడు కుశలవుల్ని పిలిచి గానం చెయ్యమన్నాడు రాముడు. వాళ్ళు మొదటి సర్గనుంచి ఇరవై సర్గల వరకూ శ్రుతి రమ్యంగా గానం చేశారు. సభికులందరూ ఆ గానానికి ముగ్ధులైనారు.

భరతుణ్ని పిలిచి ఆ పిల్లలిద్దరికీ పద్దెనిమిదివేల బంగారు నాణాలు ఇవ్వమని చెప్పాడు. కాని వాళ్ళు ఒప్పుకోలేదు.

రాముడు కుశలవుల్ని ఉద్దేశించి "ఈ కావ్యకర్త ఎవరు? ఆయన ఎక్కడుంటారు? ఈ కావ్య పరిమాణం ఎంత?" అని అత్యంత కుతూహలంతో ప్రశ్నించాడు.

"దీని కర్త వాల్మీకి మహర్షి. ఇప్పుడాయన ఇక్కడే వున్నారు. ఆయనే మాకు గురువు. మీ చరిత్రనే ఆయన ఇరవైనాలుగువేల శ్లోకాలలో వ్రాశాడు. దీంట్లో ఏడు కాండాలున్నాయి. అయిదు వందల సర్గలున్నాయి. వంద కథలున్నాయి. మీకంతగా కోరిక వుంటే ప్రతిరోజూ దీన్ని పాడి మీకు వినిపిస్తాం" అన్నారు కుశలవులు సవినయంగా.

రాముడు దీనికి అంగీకరించాడు. ఆయన అభీష్టానుసారం వాళ్ళు ప్రతిరోజూ రామాయణాన్ని గానం చేశారు. అదంతా విని ఈ బాలకులు నిశ్చయంగా సీతాపుత్రులే అని గ్రహించాడు రాముడు.

ఆ తరువాత దూతల్ని పిలిచి–"మీరు వెంటనే వాల్మీకి మహర్షి దగ్గరికి వెళ్ళి సీతాపావన చరిత, కళంక రహిత అయినట్లయితే రేపు సభాముఖంగా నిరూపించుకోమని చెప్పండి" అని చెప్పి పంపించాడు.

అలాగే వచ్చి నిరూపించుకుంటుందని కబురు చేశాడు మహర్షి.

అప్పుడు రాముడు సభనంతా కలయజూసి "రేపు సీత తన నిర్దోషిత్వాన్ని ప్రకటిస్తుంది. కాబట్టి మీరంతా తప్పకుండా సభకు రావాలి. ఆమె మీద అభాండాలు వేసిన వాళ్ళు కూడా వచ్చి సీత శపథాన్ని వినాలని కోరుకున్నాను." అన్నాడు.

ఆయన ప్రకటన విన్న వాళ్ళందరూ "ఇటువంటి ధర్మం నీ కొక్కడికే చెల్లుతుంది" అంటూ రాముణ్ణి కొనియాడారు.

ఆరోజు గడిచింది. మర్నాడు రాముడు సభ తీర్చి ఉన్నాడు. మునులు, రాజులు, ప్రజలు సభను అలంకరించారు. అంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ సమయంలో బ్రహ్మదేవుణ్ని అనుసరించే వేదంలాగా వాల్మీకి వెంబడి వచ్చింది సీతమ్మ. ఆ తల్లిని చూసి సభికులందరూ హర్షధ్వానాలు చేశారు.

అప్పుడు వాల్మీకి "రామా! ఈమె నీ భార్య. పావనచరిత. నువ్వు లోకంలోని అపవాదుకు భయపడి ఈమెను వదిలిపెట్టావు. తన స్వచ్ఛమైన శీలాన్ని చాటి చెప్పుకునేందుకు ఈమె వచ్చింది. ఈ యిద్దరు నీ పుత్రులు. నేను ప్రచేతసుని కొడుకుని, అబద్ధమాడను. ఈ తల్లిలో రవ్వంతయినా దోషముంటే వేలసంవత్సరాల నుంచిచేసిన నా తపస్సంతా వ్యర్థమవుతుంది." అన్నాడు.

"మహర్షీ! మీరు చెప్పినదంతా నిజమని, సీత పరిశుద్ధురాలని నాకు తెలుసు. రావణ వధానంతరం ఆమె సౌశీల్యం నిరూపించబడింది. కాని లోకంలో వచ్చిన అపప్రథవల్ల ఇలా చెయ్యక తప్పిందికాదు. ఈ బాలకులు నా కొడుకులే అని కూడా నా అంతరాత్మ చెబుతోంది. లోకానికి నమ్మకం కలిగించడం కోసమే సీత తన సాధుశీలాన్ని చాటుకోవాలి" అన్నాడు ప్రజారాముడు.

ఇంతలో సుగంధ పరిమళాలతో చల్లనిగాలి వీచింది. సభలోని వారందరూ ఏం జరుగుతోందని ఆసక్తితో ఎదురు చూస్తున్నారు.

కాషాయాంబర భూషిత అయిన సీత సభనంతా ఒక్కమాటు చూసింది. రెండు చేతులు జోడించి తలవంచి యిలా శపథం చేసింది.

"నేను శ్రీరామచంద్రుణ్ని తప్ప అన్యుల్ని తలచనిదాన్నే అయితే భూదేవి నా ప్రవేశానికి వీలుగా ఉండేటట్లు దారి యివ్వాలి. త్రికరణ

శుద్ధిగా నేనెప్పుడూ రాముణ్నే పూజించేదాన్ని అయితే భూదేవి నా ప్రవేశానికి మార్గం చూపాలి. రాముణ్ని తప్ప ఇతరుల్ని ఎరగని దానినయితే భూదేవి నాకు దారి చూపాలి."

సీతాదేవి తనశపథం ముగించిందో లేదో భూమి బద్దలయింది. నాగరాజులు మోస్తున్న దివ్య సింహాసన మొకటి పైకి వచ్చింది. దానిలో ఆసీనురాలయిన భూమాత రెండు చేతులతోను సీతామాతను దగ్గరికి తీసుకుని తన పక్కనే కూర్చోబెట్టుకుంది. ఆకాశంనుంచి పూలవాన కురుస్తుండగా సింహాసనం పాతాళంలోకి వెళ్ళిపోయింది.

సీత సౌశీల్యాన్ని మునులు, దేవతలు మెచ్చుకున్నారు. వాళ్ళ వాక్కులు దశదిశలా మారు మోగిపోయాయి. సభాసదులు ఆశ్చర్యాంబుధితో మునిగిపోయారు. ప్రకృతి విస్మయంతో చలించింది. కొందరు ధ్యానమగ్నులై నారు. మరికొందరు రాముడివంక చూస్తూ వుండిపోయారు. కొందరు సీతమ్మను తలుచుకుంటూ చేష్టలుదక్కి అలాగే వుండిపోయారు. వానరులు దీనులై విలపించారు.

రాముని దుఃఖానికి అంతులేదు. "నా కన్నుల ముందే నా భార్య మాయమయింది. నా సీతను లంకనుంచి తీసుకురాగలిగినవాణ్ణి భూమిలోకి ప్రవేశించి తెచ్చుకోలేనా? భూదేవీ! అత్తగారివైన నిన్ను మర్యాదగా అడుగుతున్నాను. నా సీతను నాకివ్వు. లేకపోతే నాకుకూడా దారి యిస్తే సీతను కలుసుకుని, ఆమెతోనే వుంటాను. అలా చెయ్యకపోయావో ఈ భూమండలంలో జలప్రళయం సృష్టిస్తాను" అంటూ క్రోధాన్ని ప్రదర్శించాడు.

అప్పుడు బ్రహ్మదేవుడు వచ్చి "రామా! నీకు దుఃఖంగాని కోపముగాని తగనివి. నీ నిజస్వరూపాన్ని తెలుసుకో. నీ వైష్ణవస్థితిని గుర్తుంచుకో. సీత నాగలోకంలో సుఖంగా వుంది. ఆమె నిన్ను స్వర్గధామంలో తర్వాత కలుసుకుంటుంది. రాఘవా! నీ చరిత్ర ఉత్తమకావ్యమవు

తుంది. నీ జననం మొదలు ఇప్పటి వరకు జరిగిన కథంతా వాల్మీకి వ్రాశాడు. మేమందరము ఇదివరకే విన్నాం. ముందు జరగబోయే కథను కూడా వాల్మీకి వ్రాశాడు. అది కూడా తెలుసుకో. కాని దానిని నువ్వు, మునులు మాత్రమే వినాలి" అని చెప్పి పితామహుడు అంతర్ధానమైనాడు.

జరగబోయే తన చరిత్రను మరుసటిరోజు విన్నాడు రాముడు.

అశ్వమేధం ముగిసింది. యాగానికి వచ్చిన వాళ్ళందరూ తమ తమ నివాసాలకు వెళ్ళిపోయారు. రాముడు లవకుశులతో అయోధ్యకు చేరు కున్నాడు. ⊙

లక్ష్మణ భరత పుత్రులకు రాజ్యప్రాప్తి

అశ్వమేధ యాగానంతరం రాముడు అయోధ్యా పాలన చేస్తుం డగా, ఒకనాడు కేకయరాజు యుధాజిత్తు [భరతుడి మేనమామ]. శ్రీరామ చంద్రుడికి అనేక రత్నాభరణాలు కానుకలుగా పంపి, గార్గ్యముని ద్వారా ఒక సందేశం పంపించాడు.

"రామచంద్రా! మా రాజ్యానికి దగ్గరలో సింధునది వుంది. దానికి రెండు పక్కలా మనోహరమయిన గంధర్వ దేశం వుంది. అది ఎప్పుడూ ఫలసంపదతో నిండి వుంటుంది. మహా పరాక్రమోపేతులు, బలిష్ఠులు అయిన గంధర్వులు దాన్ని కాపాడుతూ ఉంటారు. నువ్వు వచ్చి ఆ దేశాన్ని స్వాధీనం చేసుకుంటే బాగుంటుందని నేను భావిస్తున్నాను. నే నెప్పుడూ నీ మేలు కోరేవాడిని."

మేనమామ సందేశం విని రాముడు సంతోషించాడు. గంధర్వ దేశాన్ని వశం చేసుకుని, దానికి పాలకులుగా తక్షుడు, పుష్కలుడు అనే భరతుడి కొడుకుల్ని నియమించాలని అనుకున్నాడు.

అనుకున్నదే తడవుగా వాళ్ళిద్దర్నీ అభిషేకించి, కార్యసాధనభారం భరతుడికి అప్పగించాడు.

పిక్షుల్ని కావించి, కారుపథ దేశాన్ని వశం చేసుకుని పడమటి ప్రాంతంలో అంగదీయం అనే పట్టణాన్ని కట్టించి అంగదుడికీ, ఉత్తర భాగంలో చంద్రకాంతమనే నగరాన్ని నిర్మించి చంద్రకేతువుకీ యిచ్చాడు. ఆ సందర్భముగా లక్ష్మణుడు అంగదుడితో వెళ్ళి ఒక్క సంవత్సరం పాటు అక్కడే వుండి తర్వాత అయోధ్యకు తిరిగి వచ్చాడు. భరతుడు చంద్రకేతుణ్ని వెంట బెట్టుకుని వెళ్ళి సంవత్సరం తర్వాత అయోధ్యకు వచ్చాడు.

లక్ష్మణ భరతుల సేవలందుకుంటూ రాముడు ధర్మం తప్పకుండా రాజ్యం చేస్తున్నాడు.

లక్ష్మణ పరిత్యాగం

సర్వజన రంజకంగా రాముడు రాజ్యం చేస్తుండగా అవసాన దశలో ఒకనాడు యముడు మునివేషంలో అయోధ్యకు వచ్చాడు. రామ దర్శనం కోసం వచ్చిన ఆయన ద్వారం దగ్గర వున్న లక్ష్మణుడితో "నేను అతిబలుడు అనే మునిపుంగవుని శిష్యుణ్ని. రాముణ్ని వెంటనే చూడాలి" అన్నాడు.

వెంటనే సౌమిత్రి లోపలికి వెళ్ళి ఈ విషయం అన్నగారితో చెప్పాడు. సత్వరం లోపలికి ప్రవేశపెట్టమన్నాడు రాముడు.

"రాజా! నీకు జయం" అన్నాడు ముని లోపలికి ప్రవేశిస్తూ, ఆయనకి పాదాభివందనం చేసి మర్యాదలు చేశాడు రాముడు. బంగారపు ఆసనంమీద కూర్చుని ముని ఇలా అన్నాడు. "రామా! మనము మాట్లాడే మాటలు ఎవ్వరూ వినకూడదు. మనల్ని యెవరూ చూడకూడదు. ఒకవేళ ఎవరన్నా అలాచేస్తే వాళ్ళకి మరణదండన విధించాలి. యీ నియమాన్ని నువ్వు గౌరవిస్తే నేను వచ్చిన పని ఏమిటో చెబుతాను."

దీనికి ఒప్పుకున్నాడు రాముడు. ద్వారం దగ్గర లక్ష్మణుణ్ణి కాపలా వుంచాడు.

అప్పుడు కపటముని ఇలా అన్నాడు. "రామా ! నేను యమధర్మ రాజుని. నన్ను బ్రహ్మదేవుడు దూతగా పంపించాడు. మహానుభావా! నీ మాయా ప్రభావంచేత నేను పుట్టాను. నీ ఆదేశానుసారం నేను అందరినీ మృత్యువు పాలు చేస్తాను. బ్రహ్మ యిచ్చిన సందేశాన్ని యిప్పుడు నీతో మనవి చేసుకుంటాను. చిత్తగించు.

"దేవా! పూర్వం నువ్వు మహా సముద్రంలో శయనించావు తర్వాత నీ నాభికమలం నుంచి నన్ను పుట్టించావు. సర్పరాజైన అనంతుణ్ని సృష్టించావు. మధుకైటభుల్ని సంహరించావు. సృష్టి కార్యక్రమాన్ని నా కప్పగించి దాని రక్షణ బాధ్యతను నువ్వు స్వీకరించావు. దేవతల్ని రక్షించావు. రాక్షస సంహారం కోసం భూలోకంలో అవతరించావు. ఆ పని అయిపోయింది. పదకొండువేల సంవత్సరాలు రాజ్యం చెయ్యాలని నిర్ణయించుకున్నావు. ఆ కాలం పూర్తి అవుతోంది. నువ్వు అనుకున్న పనులన్నీ నిర్వర్తించావు. ఇంకా రాజ్యపాలన చెయ్యాలని వుంటే నీ యిష్టం. లేకపోతే నీ లోకానికి తిరిగివచ్చి మమ్మల్ని పాలించు."

ఈ సందేశం విని రాముడు చిరునవ్వు నవ్వి "యమధర్మరాజా! ముల్లోకాల్ని రక్షించడమే నా బాధ్యత. నా స్వస్థానానికే రావడానికి నిర్ణయించుకున్నాను" అని తన ఉద్దేశం చెప్పాడు.

రాముడు, యముడు సంభాషించుకుంటున్న సమయంలో రామ దర్శన కుతూహలంతో వచ్చాడు దుర్వాసుడు. వచ్చి "లక్ష్మణా! నేను అవశ్యం రాముణ్ని చూడాలి" అన్నాడు.

దుర్వాసుడికి నమస్కారంచేసి "మహర్షి! రాముడు అత్యవసరమైన కార్యంలో నిమగ్నుడై వున్నాడు. కొంచెంసేపు ఓపికపట్టండి దయ చేసి" వినమ్రుడైనాడు సౌమిత్రి.

దుర్వాసుడు మండిపడ్డాడు. "లక్ష్మణా! ఒక్క క్షణంకూడా ఆగేది లేదు. నేను వచ్చినట్లు రాముడితో వెంటనే చెప్పు. లేకపోతే నిన్ను, నీ అన్నదమ్ముల్ని, నీదేశాన్ని, నీ వంశాన్ని శపిస్తాను" అంటూ కళ్ళలోంచి నిప్పులు కురిపించాడు.

భయంతో కంపించాడు లక్ష్మణుడు. "నేను లోపలికి వెడితే నేనొక్కణ్ణే నశిస్తాను. లేకపోతే ఈ రఘు వంశమే అంతరించి పోతుంది." అని ఆలోచించుకుని లోపలికి వెళ్ళి అన్నతో దూర్వాసుడు వచ్చినట్లు చెప్పాడు.

రాముడు యమధర్మరాజుని పంపేసి, బయటికి వచ్చి దూర్వాసుడికి నమస్కారంచేసి "ఏం సెలవు మహాముని!" అని అడిగాడు.

"ధర్మాత్మా! రామా! వెయ్యి సంవత్సరాల నుంచి తపోదీక్షలో ఉన్న నాకు తిండిలేదు. భరింపరాని ఆకలిగా వుంది. వెంటనే భోజనము పెట్టించు" అన్నాడు దుర్వాసుడు.

రాముడు సంతోషించి మునికి అమృతంతో సమానమైన భోజనాన్ని పెట్టి తృప్తిపరిచాడు. భోజనం చేసిన తర్వాత తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు ముని.

తాను యముడి కిచ్చిన వాగ్దానాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు రాముడు. అత్యంత ప్రీతి పాత్రుడయిన తన తమ్ముడికి మరణశిక్ష విధించాల్సి వచ్చినందుకు అపరిమితంగా దుఃఖించాడు. శోక సముద్రంలో మునిగిపోయాడు. విషాదంతో కుంగిపోయాడు.

దీనుడై వున్న అన్నను చూసి "నువ్వు యముడికిచ్చిన మాట నిలబెట్టుకో. ఏ సంకోచమూ లేకుండా నాకు శిక్ష విధించి ధర్మాన్ని రక్షించు" అని ప్రార్థించాడు లక్ష్మణుడు.

తమ్ముడి మాటలు విని రాముడు నిలువెల్లా వణికిపోయాడు. వెంటనే మంత్రుల్ని, పురోహితుల్ని పిలిపించి జరిగినదంతా వివరించి ఏం చెయ్యాలో చెప్పమన్నాడు.

సభలో ఎవ్వరూ పెదవి విప్పలేదు. అప్పుడు వశిష్ఠుడు "రామా! ధర్మాన్ని కాపాడాలంటే నీ ప్రతిజ్ఞను నెరవేర్చక తప్పదు. లక్ష్మణుడు నీకెంత ప్రియుడో నాకు తెలుసు. అయినాసరే అతన్ని వెంటనే బహిష్కరించు" అని సలహా యిచ్చాడు.

మహర్షి మాటలు శిరోధార్యాలని భావించి రాముడు తమ్ముడి వంక తిరిగి "సాధుపరిత్యాగం మరణ సమానం అవుతుంది. కాబట్టి నిన్ను బహిష్కరిస్తున్నాను" అని పలికాడు.

వెంటనే సౌమిత్రి తన యింటివైపు కూడా చూడకుండా సరాసరి సరయూ నది ఒడ్డుకుచేరి యోగసమాధి గతుడైనాడు.

ఇంద్రుడు అదృశ్యుడై వచ్చి లక్ష్మణుణ్ని తన విమానములో కూర్చోబెట్టుకుని అమరావతికి తీసుకువెళ్ళాడు. విష్ణుమూర్తి నాలుగో భాగం తమ దగ్గరకు వచ్చినందుకు దేవతలు ఆనందంతో పులకించారు.

శ్రీరామ అవతార సమాప్తి

లక్ష్మణుడికి బహిష్కరణ శిక్ష విధించిన తర్వాత మంత్రుల్ని, పురోహితుల్ని, ప్రజల్ని రప్పించి, అయోధ్యకి భరతుణ్ని రాజుగాచేసి, లక్ష్మణుడు వెళ్ళినట్లే తాను కూడా వెళ్ళిపోతానన్నాడు రాముడు.

అశనిపాతాలయిన ఈ మాటలు విని పురజనులు దుఃఖించారు. భరతుడు స్పృహ కోల్పోయాడు. కొంతసేపటికి తేరుకుని "అన్నా! నువ్వులేని రాజ్యం నాకు మాత్రం ఎందుకు? నిన్ను వదిలి నేను వుండలేను. నేనుకూడా నీతోనే వచ్చేస్తాను. ఈ కోసల దేశాన్ని రెండుగా విభజించి దక్షిణ కోసలాన్ని కుశుడికీ, ఉత్తర కోసలాన్ని లవుడికి యిస్తే బాగుంటుంది. ఇదే ధర్మమార్గం. వెంటనే మన మహాప్రస్థాన విషయాన్ని గూర్చి శత్రుఘ్నుడికి కబురు పంపించాలి" అన్నాడు.

భరతుడి మాటలు ప్రజల్ని దిగ్భ్రాంతులిని చేశాయి. అందరూ తలలు వంచుకుని చూస్తున్నారు.

ఆ సమయంలో వశిష్ఠుడు లేచి "రామా! ఈ ప్రజల అభిప్రాయము కూడా తెలుసుకుని, వాళ్ళ ఈప్సితాన్ని మన్నించు" అన్నాడు.

"నేను ఏం చేస్తే మీకు తృప్తిగా ఉంటుందో చెప్పండి" అని అడిగాడు రాముడు ప్రజలని ఉద్దేశించి.

"ప్రభూ! మమ్మల్ని నీతోపాటు తీసుకు వెళ్ళాలి. నువ్వు ఎక్కడికి వెడితే మేము కూడా అక్కడికే వస్తాం. మా కోరిక ఇదే" ఏక కంఠంతో అన్నారు పౌరులందరూ. వాళ్ళ కోరికను ప్రజారాముడు ఎలా కాదన గలడు?

ఆ రోజే కుశలవుల పట్టాభిషేకం జరిగింది. కొడుకు లిద్దర్నీ ప్రేమతో దగ్గరకు తీసుకుని తన తొడమీద కూర్చోబెట్టుకుని వాళ్ళ శిరస్సుల్ని ఆఘ్రాణించాడు రాముడు. ధన కనకవస్తు వాహనాదులతో పాటు సైన్యాన్ని యిచ్చి కుశుణ్ణి కుశావతికి, లవుణ్ణి శ్రావస్తికి పంపించాడు. తరువాత దూతల ద్వారా జరిగిన సంగతులన్నీ శత్రుఘ్నుడికి తెలియ జేశాడు.

శత్రుఘ్నుడు మంత్రి పురోహితుల్ని రావించి తాను కూడా అన్నలతో పాటే వెళ్ళిపోతానని చెప్పి - తన రాజ్యాన్ని రెండు భాగాలుగా చేసి మధురానగరానికి పెద్దకొడుకు సుబాహుడినీ, విదిశా నగరానికి చిన్న కొడుకు శత్రుఘాతినీ అభిషేకించాడు.

తదనంతరం అయోధ్యకు రాముడుతోవచ్చి తన నిర్ణయాన్ని చెప్పి ఆయన అనుమతి తీసుకున్నాడు.

ఈ లోపల శ్రీరాముడు వెళ్ళిపోతున్నాడని తెలిసి- వానరులు, భల్లూకాలు, రాక్షసులు తండోపతండాలుగా అయోధ్యకు తరలి వచ్చారు. సుగ్రీవుడు ముకుళితహస్తుడై "రామా! నువ్వు వెళ్ళిపోతే మా కింకా దిక్కెవరు? నా రాజ్యాన్ని అంగదుడికి ఇచ్చి వచ్చేశాను. నన్ను కూడా నీతో పాటే తీసుకువెళ్ళు" అని ప్రార్థించాడు. రాముడు సరే నన్నాడు.

రాక్షసరాజు విభీషణుడు కూడా ముందుకువచ్చి ఏమిటో చెప్ప బోతుండగా— "సూర్యచంద్రులున్నంత కాలం నా కథ ఈ లోకంలో ప్రజలు చెప్పుకున్నంత కాలం నువ్వు ధర్మబద్ధమైన పాలన చెయ్యాలి. స్నేహితుడిగా నిన్ను ఈ విషయంలో ఆజ్ఞాపిస్తున్నాను. అంతేకాదు. మా

ఇక్ష్వాకు వంశానికి జగన్నాథుడు కులదైవం. ఆయన్ని ఎప్పుడూ సేవిస్తూ వుండు" అని చెప్పాడు. రామాజ్ఞను శిరసావహించాడు విభీషణుడు.

తరువాత హనుమంతుడివైపు తిరిగి- "నువ్వు ఎంతో ప్రజ్ఞ కల వాడివి. నా చరిత్ర ఈ భూమిమీద నిలిచినంత కాలం సుఖంగా వుండు" అన్నాడు రాముడు.

"ప్రభూ! నీ ఆజ్ఞను ఎప్పుడూ పాలిస్తాను" వినయంతో అంజలి ఘటించాడు ఆంజనేయుడు.

అనంతరం జాంబవంత, మైంద, ద్వివిదుల్ని చూసి- "మీరు కలి యుగం వచ్చేవరకూ జీవించండి" అని ఆశీస్సు లిచ్చి, మిగిలిన వానర భల్లూక వీరుల నందర్నీ తనతో తీసుకు వెళ్ళడానికి సమ్మతించాడు రఘు వీరుడు.

ఆ రోజు గడిచింది.

తెల్లవారింది.

బ్రాహ్మణులు అగ్నిహోత్రాల్ని, వాజపేయచ్ఛత్రాన్ని పట్టుకుని ముందు నడుస్తున్నారు.

రాముడు సన్నని వస్త్రాలు ధరించి, చేతివేళ్ళ మధ్య దర్భలు పట్టుకుని, మంత్రాలను ఉచ్చరిస్తూ వెడుతున్నాడు. ఆయనకు రెండు పక్కలా శ్రీదేవి, హ్రీదేవి, ముందు భూదేవి ఉన్నారు. ధనుర్బాణాలు పురుష రూపంతో ఆయన్ని అనుగమించాయి. వేదాలు, గాయత్రి, ఓంకార వషట్కారాలు ఆ మహాపురుషుణ్ణి విప్రరూపంలో అనుసరించాయి.

బ్రహ్మర్షులు, విప్రులు, భరత శత్రుఘ్నులు, అంతఃపురజనులు, ప్రజలు, వానరులు, రాక్షసులు ఆ పురుషోత్తముని వెంట వెళ్ళారు.

అయోధ్యలో వున్న పశుపక్ష్యాదులు తమ ప్రభువుతోపాటు ప్రయాణము సాగించాయి. అయోధ్య అంతా ఖాళీ అయిపోయింది.

శ్రీరాముడు అర్ధ యోజన దూరం నడిచి, పడమటి దిక్కుగా ప్రవహిస్తున్న సరయూ నదిని చేరుకున్నాడు. అప్పటికే దేవతలతోను, ముని బృందాలతోను బ్రహ్మదేవుడు అక్కడికి వచ్చాడు. ఆకాశం దివ్య విమానాలతో నిండిపోయింది.

పరిమళ భరితమైన చల్లని పిల్లగాలులు వీచి అహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. పూల వానలు కురుస్తున్నాయి. దేవతల దుందుభి ధ్వానాలు చెవులకు ఇంపుగా వినవస్తున్నాయి. గంధర్వులు కమ్మగా పాడుతున్నారు. అచ్చరలు అమోఘంగా ఆడుతున్నారు.

శ్రీరామచంద్రుడు సరయూ నదిలోకి అడుగు పెట్టాడు. అప్పుడు బ్రహ్మ ఇలా ప్రార్థించాడు.

"మహావిష్ణూ! నీకు శుభమగుగాక! నీ తమ్ముళ్ళతో కూడా స్థూల శరీరాలు విడిచిపెట్టి దివ్యశరీరాన్ని ధరించు. నీకు ఏ రూపం కావాలో ఆ రూపాన్ని ధరించు. సకల భువనాలకూ నువ్వే ఆధారం."

పితామహుడి మాటల్ని ఆలకించి రాముడు సోదరులతోపాటు వైష్ణవ రూపం స్వీకరించాడు. ఇంద్రాది దేవతలు, మహా యోగులు, సాధ్యులు, గరుడులు, గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు, దైత్యులు, దానవులు మొదలయిన వాళ్ళందరూ హర్షాతిరేకంతో జయజయ ధ్వానాలు చేసి ఆ దివ్యమంగళమూర్తిని అర్చించారు.

అప్పుడు విష్ణువు బ్రహ్మను చూసి– "నా వెంట వచ్చిన వాళ్ళందరూ నా భక్తులు. నా కోసం ఏదైనా చెయ్యడానికి సిద్ధపడినవాళ్ళు. తమ సర్వస్వం త్యజించి నాతోపాటు వచ్చిన వీళ్ళకి పుణ్యలోకాలను ప్రసాదించు" అని చెప్పాడు.

"దేవా! నిన్ను ఆశ్రయించిన వాళ్ళకి-పశు పక్ష్యాదులకైనా సరే సంతానకమనే దివ్యలోక నివాసం కలుగుతుంది. ఇప్పుడు నీతో వచ్చి వాళ్ళందరూ ఆ లోకానికి వెడతారు. వానరాదులు తాము ఏ దేవతాంశచే జన్మించారో ఆ దేవతాంశలు పొందుతారు. సుగ్రీవుడు సూర్యునిలో లీనమవుతాడు" బ్రహ్మ వివరించాడు.

రాముణ్ణి అనుసరించి వాళ్లు అందరూ 'గోప్రతారం' అనే తీర్థంలో మునిగారు. వాళ్ళకి పూర్వ శరీరాలు పోయి దివ్యశరీరాలు వచ్చాయి. అనంతరం విమానాలలో తమకు కేటాయించబడిన పుణ్యలోకాలకు వెళ్ళిపోయారు.

– ఓం తత్ సత్ –